ప్రతిపక్షం

www.prathipaksham.in

గురువారం 05.03.2026 | Published From Hyderabad | సంపుటి: 18 సంచిక: 344 పేజీలు:10 | ₹5

@prathipaksham | prathipaksham tv telugu

ఇండియా - ఇంగ్లండ్ సెమీ ఫైనల్ నేడే 10

రంజాన్ వేళలు

ఇఫ్తార్ – 6.29

(గురువారం సాయంత్రం)

సహర్ – 5.09

(శుక్రవారం ఉదయం)

ఇరాన్ సుప్రీం నేతగా
ఖమేనీ కుమారుడు మొజ్తాబా

- 36 ఏళ్ల పాటు ఇరాన్ సుప్రీం నేతగా కొనసాగిన ఖమేనీ
- ప్రజా సందర్శనకు ఖమేనీ భౌతికకాయం
- టెహ్రాన్‌లో అంత్యక్రియల ప్రక్రియ
- నాయకుడు ఎవరైనా..ఏరివేతే మా టార్గెట్: అమెరికా, ఇజ్రాయెల్
- ఇరాన్ నౌకపై సబ్‌మెరైన్‌తో అమెరికా దాడి.. శ్రీలంక తీరంలో 101 మంది గల్లంతు

ప్రతిపక్షం నేషనల్ డెస్క్

ఇరాన్ కొత్త సుప్రీం నేతగా అయతుల్లా ఖమేనీ కుమారుడు మొజ్తాబా హుసేన్ ఖమేనీ ఎన్నికయ్యారు. ఇరాన్‌కు చెందిన నిపుణుల అసెంబ్లీ మొజ్తాబాను ఎన్నుకున్నది. అయతుల్లా అలీ ఖమేనీ వారుసుడిగా మొజ్తాబా కొనసాగనున్నారు. 36 ఏళ్ల పాటు ఇరాన్ సుప్రీం నేతగా కొనసాగిన ఖమేనీ.. గత శనివారం అమెరికాఇజ్రాయెల్ దళాలు జరిపిన దాడిలో మృతిచెందిన విషయం తెలిసిందే. ఆ దాడిలో ఖమేనీతో పాటు ఆయన కుమార్తె,

...:: మిగతా 2లో

ఢిల్లీలో గణపతి లొంగుబాటు?
కేంద్ర హోం మంత్రి అమిత్‌షా ఎదుట సరెండర్

- నేపాల్‌నుంచి ఢిల్లీ చేరుకున్న ముప్పాళ్ల లక్షణరావు
- హుటాహుటిన ఢిల్లీ వెళ్లిన సీఎం రేవంత్
- నేడు సీఎం ఎదుట భారీగా లొంగుబాట్లు
- మావోయిస్టు పార్టీకి కోలుకోలేని దెబ్బ
- ఆపరేషన్ కగార్ తో పార్టీ అంతం?
- గణపతి లొంగుబాటుతో ముగిసిన శకం

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో

హైదరాబాద్, మార్చి 4: మావోయిస్టు అగ్రనేత, సీపీఐ (మావోయిస్టు) మాజీ ప్రధాన కార్యదర్శి ముప్పాళ్ల లక్ష్మణ రావు అలియాస్ గణపతి అమిత్ షా సమక్షంలో గణపతి లొంగిపోయే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఇటీవల లొంగిపోయిన మావోయిస్టు అగ్రనేతలు దేవ్ జీ, మల్లా రాజిరెడ్డి తదితరులు ఇచ్చిన సమాచారం మేరకు అగ్రనేత గణపతి అచూకీ తెలంగాణ పోలీసులకు చిక్కినట్లు తెలుస్తుంది. వృద్ధాప్యంతో నేపాల్ లో తలదాచుకుంటున్న గణపతిని ఇండియాకు రప్పించేందుకు తెలంగాణ ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. ఈ క్రమంలోనే గణపతిని కేంద్ర హోంమంత్రి అమిత్ షా సమక్షంలో సరెండర్ చేయడానికి రేవంత్ రెడ్డి ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తుంది. దీనికోసం ఆయన ఈ రోజు సాయంత్రం హుటాహుటినా ఢిల్లీకి వెళ్లారు. ఆయన వెంట డీజీపీ శివధర్ రెడ్డి, ఇంటెలిజెన్స్ హెడ్ సుమతి, అదనపు డీజీపీ విజయ్ కుమార్ తదితరులు కూడా ఉన్నారు. కాగా మార్చి 31న ఆపరేషన్ కగార్ డెడ్ లైన్ గా పెట్టుకోవడంతో పాటు మావోయిస్టులను అంతం చేస్తామన్న అమిత్ షా నిర్ణయానికి నాలుగు వారాల ముందే గణపతి పోలీసులకు అందుబాటులోకి రావడం గమనార్హం. కాగా గణపతి ఆచూకీ కోసం తెలంగాణ ప్రభుత్వం చేసిన ప్రయత్నం ఫలించి ఆయనను ఢిల్లీకి తీసుకువచ్చినట్లు సమాచారం.

నేడు సీఎం ఎదుట భారీగా

అగ్రనేతలు దేవ్ జీ, బడే చొక్కారావు,

...:: మిగతా 2లో

అదనంగా ఐపీఎస్ అధికారులను
కేటాయించండి

- తెలంగాణ అనేక సవాళ్లను ఎదుర్కొంటోంది
- హైదరాబాద్ నగరంలో పెరుగుతున్న జనాభా
- ఇందుకు పెద్ద సంఖ్యలో ఐపీఎస్ అధికారుల అవసరం
- ప్రస్తుతం 83 ఐపీఎస్ లు ఉన్నారు, ఆ సంఖ్యను 105 కు పెంచండి
- కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షాకు సీఎం రేవంత్ విజ్ఞప్తి
- మావోయిస్టుల లొంగుబాటు... పునరావాసంపై కేంద్ర మంత్రితో చర్చలు

ప్రతిపక్షం నేషనల్‌బ్యూరో

న్యూఢిల్లీ, మార్చి 4: తెలంగాణ రాష్ట్ర అవసరాలకు అనుగుణంగా ఐపీఎస్ అధికారుల సంఖ్యను కేటాయించాలని కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షాకు ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షాతో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి బుధవారం రాత్రి భేటీ అయ్యారు. రాష్ట్ర విభజన అనంతరం 2016లో మొదటి కేడర్ రివ్యూ జరిగిందని, 2021లో జరగాల్సిన కేడర్ రివ్యూ చాలా ఆలస్యంగా 2025లో జరిగిందన్నారు. ఆ సమయంలోనూ కేవలం 7 గురు ఐపీఎస్ అధికారులను మాత్రమే తెలంగాణకు కేటాయించారని సీఎం వివరించారు. దేశంతో పాటు తెలంగాణ రాష్ట్రం సైబర్ నేరాలు, డ్రగ్స్, వైట్ కాలర్ నేరాలు సహా ఇతర అనేక ఆధునిక సవాళ్లను ఎదుర్కొంటోందని

...:: మిగతా 2లో

ఇండియాకు రష్యా చమురు సాయం

ఇరాన్-ఇజ్రాయెల్ యుద్ధం నేపథ్యంలో చమురు రవాణాపై నీలిమేఘాలు కమ్ముకున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఇండియాకు తగినంత చమురు సరఫరా చేసేందుకు రష్యా సిద్ధమైంది.

9

రాజ్యసభకు నితీశ్ కుమార్

బిహార్ రాజకీయాల్లో ఆసక్తికర చర్చ నడుస్తోంది. సీఎం పదవికి నీతీశ్ కుమార్ రాజీనామా చేసి, రాజ్యసభకు వెళ్తారని జోరుగా ప్రచారం జరుగుతోంది. నీతీశ్ కుమారుడు నిశాంత్ కుమార్ రాజకీయాల్లోకి వస్తున్న నేపథ్యంలో ఈ ప్రచారం జరగడం సర్వత్రా ఆసక్తి నెలకొంది.

9

రాజ్యసభకు అభిషేక్ సింఘ్వీ, నరేందర్ రెడ్డి

- ఖరారు చేసిన కాంగ్రెస్ అధిష్టానం
- ఇప్పటికే హైదరాబాద్ చేరుకున్న అభిషేక్ సింఘ్వీ
- నేడు నామినేషన్ వేయనున్న ఇరువురు నేతలు

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో

హైదరాబాద్, మార్చి 4: తెలంగాణ నుంచి రాజ్యసభ అభ్యర్థులు ఖరారయ్యారు. అభిషేక్ సింఘ్వీ, వేం నరేందర్ రెడ్డి పేర్లను కాంగ్రెస్ హైకమాండ్

...:: మిగతా 2లో

సింగూర్ డ్యామ్ భద్రతకు కట్టుదిట్టమైన చర్యలు



- స్వయంగా డ్యామ్ ను సందర్శిస్తా
- భూసేకరణకు రూ. 5000 కోట్లు
- జూన్ 2 నాటికి భూసేకరణ పూర్తి
- పాలెం వాగు ప్రాజెక్ట్ గేట్లు, రెగ్యులేటర్ సమస్యలను పరిష్కరిస్తాం
- ప్రాజెక్ట్ పరిస్థితిని క్షేత్రస్థాయిలో వెళ్లి సమీక్షించండి
- అధికారులకు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆదేశాలు
- నీటిపారుదల శాఖా ఇంజినీర్లతో ఉన్నత స్థాయి సమీక్ష

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో

హైదరాబాద్, మార్చి 4: సింగూర్ డ్యామ్ భద్రత కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖామంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. హైదరాబాద్ మహానగరానికి ప్రాణాధారంగ నిలిచిన సింగూర్ ప్రాజెక్టు పరిరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం పూర్తిస్థాయిలో చర్యలు తీసుకుంటుందని ఆయన తెలిపారు. స్వయంగా తాను సింగూర్ ప్రాజెక్టును సందర్శించి పరిస్థితిని పూర్తిస్థాయిలో సమీక్షిస్తానని ఆయన ప్రకటించారు. బుధవారం ఉదయం సహచర మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, సితక్క,

...:: మిగతా 2లో

గెలిచే ఆ ఒక్క సీటుకు శరద్ పవార్ పోటీ

మహారాష్ట్రలో ప్రతిపక్షం గెలిచే ఏకైక రాజ్యసభ సీటులో నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ చీఫ్ శరద్ పవార్ పోటీ చేస్తున్నారు. మహా వికాస్ అఘాడి కూటమి అభ్యర్థిగా ఆయనను ఎంపిక చేసింది. ఆయన కుమార్తె, ఎంపీ సుప్రియా సులే ఈ విషయాన్ని వెల్లడించారు.

9

రాహుల్‌ని ప్రధానిగా చూడాలనుకోవడం మా హక్కు

- నాయకత్వం ఎవరికి దక్కాలో నిర్ణయించేది సంజయ్ కాదు
- ఈ దేశానికి పట్టిన గ్రహణం ఎవరో ప్రజలకు తెలుసు
- కేంద్ర మంత్రి బండి సంజయ్ కి మంత్రి పొన్నం ప్రభాకర్ కౌంటర్

...:: 3లో

భూములు కోల్పోయే రైతులను ఆదుకుంటాం

- ములుగు జిల్లాలోని ఇరిగేషన్ ప్రాజెక్టులకు ప్రాధాన్యం
- భూసేకరణ పూర్తయ్యాక నష్టపరిహారం చెల్లింపు
- రామప్ప,- లక్నవరం ప్రాజెక్టుకు అదనపు నిధులు
- మంత్రులు ఉత్తమ్, పొంగులేటి, సీతక్క

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో

హైదరాబాద్, మార్చి 4: ములుగు జిల్లాలోని ఇరిగేషన్ ప్రాజెక్టులను ప్రాధాన్యం ఆధారంగా త్వరగా పూర్తి చేస్తామని మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, సీతక్క, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ఇరిగేషన్ శాఖ అధికారులతో మంత్రులు సచివాలయంలో సమావేశం నిర్వహించారు. ములుగు జిల్లా పరిధిలోని వివిధ ఇరిగేషన్ ప్రాజెక్టుల పనుల పురోగతిపై సమీక్షించారు. అనంతరం మంత్రులు మాట్లాడుతూ.. ములుగు

...:: మిగతా 2లో

అధికారుల బదిలీలతో పాలన జోక్ అయింది

- మైనింగ్‌లో భారీ అక్రమాలు
- మాజీ మంత్రి హరీష్ రావు ఫైర్



ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, మార్చి 4: రాష్ట్రంలో అధికారుల తరచూ బదిలీలవల్ల పాలన దెబ్బతింటోందని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో పరిపాలనలో స్థిరత్వం లేకపోవడంతో అన్నిశాఖల్లో అయోమయం నెలకొందని మాజీ మంత్రి, బీ ఆర్ ఎస్ ఎల్పీ ఉప నాయకుడు హరీష్ రావు విమర్శించారు. అదే సమయంలో నియోపోలిస్‌లో అక్రమ మైనింగ్ జరుగుతోందని, దీనిపై నిజానిర్ధారణ కోసం బీఆర్ఎస్ బృందం రేపు సందర్శించనుందని వెల్లడించారు. బుధవారం చిట్ చాట్ లో ఆయన మాట్లాడుతూ...రాష్ట్రంలో ఐఏఎస్, ఐపీఎస్ అధికారులను పూట పూటకు మార్చడం వల్ల పాలనలో ఫలితాలు రావడంలేదని హరీష్ రావు అన్నారు. ఇప్పటివరకు ఐదు సార్లు భారీ మార్పులు జరిగాయని, సుమారు 140 మంది ఐఏఎస్‌లను బదిలీ చేశారని తెలిపారు. 20 మంది కలెక్టర్లను మార్చడం జరిగిందని, రంగారెడ్డి జిల్లాలోనే నలుగురు కలెక్టర్లు మారారని చెప్పారు. కలెక్టర్లకు జిల్లా పరిస్థితులపై అవగాహన రావడానికి కనీసం ఆరు నెలలు పడుతుందని, అంతకంటే ముందే బదిలీలు చేయడం వల్ల నైతిక స్థైర్యం దెబ్బతింటోందన్నారు.విద్యుత్ శాఖలో రెండేళ్లలో ఐదుగురు అధికారులు మారారని, సింగరేణి, జీహెచ్ఎంసీ, పాఠశాల విద్య, పంచాయతీరాజ్, మున్సిపల్, ఐటీ, మైనింగ్, నేషనల్ హెల్త్ మిషన్ తదితర శాఖల్లో తరచూ మార్పులు జరిగాయని పేర్కొన్నారు. ఈ బదిలీలతో శాఖలు అతలాకుతలం అయ్యాయని, అవినీతి పెరిగిందని ఆరోపించారు.పదవీ విరమణ చేసిన అధికారులకు ఎక్స్టెన్షన్లు ఇవ్వడం సాధారణమైందని, డజన్ల కొద్దీ ఐఏఎస్, ఐపీఎస్‌లకు పొడిగింపులు ఇచ్చారని విమర్శించారు. బీఆర్ఎస్ హయాంలో ఇదే అంశంపై కాంగ్రెస్ నేతలు విమర్శలు చేశారని గుర్తు చేశారు. వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్ జైన్‌ను లగచర్ల ఆందోళన సందర్భంలో ఇచ్చిన హామీల కారణంగా బదిలీ చేశారని ఆరోపించారు. 20 శాతం జీఓలు మాత్రమే ఆన్‌లైన్‌లో ఉంచి, 80 శాతం జీఓలను ఆఫ్‌లైన్‌లో ఉంచుతున్నారని అన్నారు. హైకోర్టు ఆదేశించినప్పటికీ జీఓలను ఆన్‌లైన్‌లో పెట్టడంలేదని విమర్శించారు. అసెంబ్లీ వ్యవస్థను భ్రష్టు పట్టించారని, డిప్యూటీ స్పీకర్, చీఫ్ విప్ పదవులు ఖాళీగా ఉన్నాయని, హౌస్ కమిటీలు వేయడంలేదని ఆరోపించారు.

నియోపోలిస్‌లో అక్రమ మైనింగ్ ఆరోపణలు..

నియోపోలిస్ ప్రాంతంలో ముఖ్యమంత్రి మేనల్లుడి అనుచరులు అక్రమ మైనింగ్ చేస్తున్నారని హరీష్ రావు ఆరోపించారు. మొబైల్ క్రషింగ్ ప్లాంట్‌కు మాత్రమే అనుమతులు ఉండగా ఫిక్స్డ్ క్రషింగ్ ప్లాంట్ ఏర్పాటు చేశారని, లీజు నిబంధనలు ఉల్లంఘించారని అన్నారు. 15 లక్షల క్యూబిక్ మీటర్ల బండకు ఫీజులు ఎగ్గొట్టారని, అవసరమైన 89 అనుమతులు తీసుకోలేదని తెలిపారు. ఓఆర్ఆర్‌కు కిలోమీటర్ పరిధిలో మైనింగ్ నిషేధం ఉన్నప్పటికీ ఉల్లంఘన జరిగిందన్నారు.మంత్రి పొంగులేటి సంస్థ రాజేంద్రనగర్‌లో అనుమతులు లేకుండా మైనింగ్ నిర్వహిస్తోందని ఆరోపిస్తూ, రేపు బీఆర్ఎస్ బృందం అక్కడికి వెళ్లి నిజానిర్ధారణ చేస్తుందని వెల్లడించారు. రాజ్యసభ ఎన్నికల్లో పోటీపై సస్పెన్స్ కొనసాగుతుందని, రేపటి వరకు వేచి చూడాలని హరీష్ రావు అన్నారు.

పదవ తరగతి విద్యార్థులకు ఎగ్జామ్ ప్యాడ్స్ పంపిణీ

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, మార్చి 4: హబ్సిగూడ స్ట్రీట్ నంబర్ 1లోని ప్రభుత్వ పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు ఎగ్జామ్ ప్యాడ్స్, జామెట్రీ బాక్స్‌లను ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అందజేశారు. ఈ కార్యక్రమాన్ని బి ఆర్ ఎస్ పార్టీ హబ్సిగూడ డివిజన్ నాయకురాలు రజితారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి హాజరై విద్యార్థులకు ఎగ్జామ్ ప్యాడ్స్ పంపిణీ చేశారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి మంచి ఫలితాలు సాధించి తల్లిదండ్రులు, గురువులు, నియోజకవర్గానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. విద్యాభివృద్ధికి తమ వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బి ఆర్ ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు పసుల ప్రభాకర్ రెడ్డి, లక్ష్మీ నారాయణ, కైలాష్ పతి గౌడ్, మనోహర్ దినేష్ కుమార్, లక్ష్మి, నళిని రెడ్డి, శ్రుతి, ఇతర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వివాదంలో రామేశ్వర ఆలయ భూమి

- సర్పంచ్, ఈ ఓ మధ్య తగాదా
- ప్రభుత్వ భూమి అంటున్న సర్పంచ్
- ఆలయానికి సంబంధించిందని ఈఓ వాదన
- తహశీల్దార్‌కు ఈవో ఫిర్యాదు

ప్రతిపక్షం, షాద్ నగర్, మార్చి 4: దక్షిణ కాశీగా పేరుగాంచిన ఉత్తర శ్రీ రామలింగేశ్వర స్వామి దేవాలయం భూమి వివాదంలో చిక్కుకుంది. సర్వే నంబర్ల గందరగోళంతో ప్రారంభమైన ఈ వ్యవహారం ప్రస్తుతం గ్రామంలో చర్చనీయాంశంగా మారింది. సర్వే నంబర్లపై భేదాభిప్రాయాలు తలెత్తాయి. గ్రామానికి చెందిన సర్వే నంబర్లు 34, 35 ప్రభుత్వ భూమిగా నమోదు అయ్యాయని స్థానిక సర్పంచ్ పేర్కొన్నారు. ఆ స్థలంలో మహిళా సంఘ భవనం నిర్మించాలని నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. గ్రామ మహిళల సమావేశాలు, శిక్షణా కార్యక్రమాల కోసం ప్రత్యేక భవనం అవసరమని ఆయన అభిప్రాయపడ్డారు. అయితే దేవాలయ ఈఓ ఆ భూమి ఆలయం వెనుక భాగంలో ఉందని, అది సర్వే నంబర్ 33కి చెందిన దేవాలయ ఆస్తి అని వాదిస్తున్నారు. ఆలయానికి సంబంధించిన పాత రికార్డులు, పహాణీలు తమ వద్ద ఉన్నాయని, భూమి దేవాదాయ శాఖకు చెందినదేనని ఆయన స్పష్టం చేశారు. దీంతో వివాదం చెలరేగింది. ఆలయ భూమిపై ఎలాంటి నిర్మాణాలు చేపట్టరాదని భక్తులు కూడా ఈఓకు మద్దతుగా నిలుస్తున్నారు. మరోవైపు, ప్రభుత్వం భూమి అయితే ప్రజా ప్రయోజనాల కోసం వినియోగించుకోవడంలో తప్పేమీ లేదని సర్పంచ్ వర్గం వాదిస్తోంది. ఈ నేపథ్యంలో ఆలయ ఈఓ తహశీల్దార్‌కు లిఖితపూర్వక ఫిర్యాదు చేశారు. సంబంధిత సర్వే నంబర్లపై సమగ్ర విచారణ జరిపి, భూమి యాజమాన్యాన్ని స్పష్టం చేయాలని కోరారు. రెవెన్యూ రికార్డులు, ఫీల్డ్ మ్యాప్స్ ఆధారంగా సరిహద్దులు నిర్ధారించాలని విజ్ఞప్తి చేశారు.

'పది' హాల్‌టికెట్ల విడుదల

- వెబ్ సైట్‌నుంచి డౌన్‌లోడ్‌చేసుకోనే అవకాశం
- 14 నుంచి పదో తరగతి పబ్లిక్ పరీక్షలు

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, మార్చి 4: రాష్ట్ర వ్యాప్తంగా 2025-.26 విద్యా సంవత్సరానికి పదో తరగతి పబ్లిక్ పరీక్షల హాల్‌టికెట్లు విడుదల చేసేందుకు ఏర్పాట్లు చేశారు. ఈ మేరకు రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ ఏర్పాట్లు చేస్తుంది. అయితే ఈ సారి మూడు రకాలుగా పదో తరగతి హాల్‌టికెట్లు విడుదల చేయాలని నిర్ణయించారు. విద్యార్థులు ఈ మూడింటిలో ఏ విధంగానైనా తమ హాల్ టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ముందుగా సెకండరీ బోర్డు వెబ్‌సైట్‌లో హాల్ టికెట్లను విడుదల. అనంతరం విద్యార్థుల తల్లిదండ్రుల వాట్సాప్ నెంబర్‌కు సైతం పదో తరగతి హాల్ టికెట్లను పంపిస్తారు. మరోవైపు ప్రింటెడ్ హాల్‌టికెట్లను కూడా రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అన్ని స్కూళ్లకు చేరవేస్తారు. ఈ విధంగా విద్యార్థులు హాల్‌టికెట్లను మూడు రకాలుగా పొందొచ్చన్నమాట. కొన్ని ప్రైవేట్ స్కూళ్లు ఫీజు బకాయిలు పేరిట విద్యార్థులకు హాల్ టికెట్లు ఇవ్వకుండా ఇబ్బందులు గురి చేస్తున్నట్లు బోర్డుకు ప్రతి ఏటా ఫిర్యాదులు అందుతున్న నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకుంది. లేదంటే వాట్సాప్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. కుదరని పక్షంలో పాఠశాల ప్రిన్సిపల్‌ను సంప్రదించి వారి నుంచి నేరుగా పొందవచ్చు. విద్యార్థులు ఏ హాల్‌టికెట్ తో పరీక్ష కేంద్రాలకు వచ్చినా పరీక్షలకు అనుమతిస్తామని విద్యాశాఖ అధికారులు తెలిపారు. కాగా తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా పదో తరగతి పబ్లిక్ పరీక్షలు మార్చి 14 నుంచి ఏప్రిల్ 16 వరకు జరగనున్న విషయం తెలిసిందే. ఈ ఏడాది రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 5,28,248 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. పదో తరగతి పబ్లిక్ పరీక్షల హాల్‌టికెట్లు గురువారం విడుదల అయ్యాయి. ఈ మేరకు రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ ఏర్పాట్లు చేసింది.

వైసీపీ హయాంలో జాకీ, లులూ, అమర్‌రాజా, ఫ్రాంక్లిన్ టెంపుల్‌టన్ వంటి అనేక కంపెనీలను తరిమేశారు. కూటమి అధికారంలోకి వచ్చాక అనేక సంస్థలు రాష్ట్రానికి వస్తున్నాయి. మేం 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని మాట ఇచ్చాం. ఆ దిశగా చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటికే 30,588 ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చాం. పరిశ్రమలు, సంస్థల్లో 6.28 లక్షల మందికి ఉద్యోగాలు వచ్చాయి.

- ఏపీ సీఎం చంద్రబాబు

ఇరాన్ సుప్రీం నేతగా ఖమేనీ కుమారుడు మొజ్తాబా

మొదటిపేజీ తరువాయి

అల్లుడు, మనవరాలు మృతిచెందారు. గాయపడ్డ ఖమేనీ భార్య మన్సూరీ ఖోజసేత్ భగేర్జదే రెండు రోజుల తర్వాత ప్రాణాలు విడిచింది. మొజ్తాబా వయసు 56 ఏళ్లు. తన తండ్రి ఖమేనీ అడుగుజాడల్లో రాజకీయ, మతపరమైన వ్యవస్థలను ఆయన నడిచారు. 1969లో మషాద్‌లో మొజ్తాబా జన్మించారు. అలీ ఖమేనీ రెండో కుమారుడు ఆయన. ఆయనకు అయిదుగురు సోదరులు ఉన్నారు. టెహ్రాన్‌లో ఉన్న అలావి ఉన్నత పాఠశాలలో ఆయన చదువుకున్నారు. ఆ తర్వాత ఖోమ్‌లో మొజ్తాబా మతపరమైన విద్య నేర్చుకున్నారు. మతపరమైన శిక్షణలో ఆయన చాన్నాళ్లుగా కొనసాగుతున్నా.. అయతుల్లా ర్యాంక్‌కు మాత్రం ఇంకా చేరుకోలేదు. ఇరాన్‌ఇరాక్ మధ్య యుద్ధం సమయంలో.. హబిబ్ బెటాలియన్‌లో మొజ్తాబా విధులు నిర్వర్తించారు. ఇరాన్ సెక్యూర్టీ, ఇంటెలిజెన్స్‌లో ఉన్న ప్రముఖులతో ఆయనకు సంబంధాలు ఉన్నాయి.

ప్రజా సందర్శనకు ఖమేనీ భౌతికకాయం..

ఇజ్రాయెల్, అమెరికా దాడుల్లో హత్యకు గురైన ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీ మృతదేహాన్ని బుధవారం రాత్రి నుంచి ఇరాన్ రాజధాని టెహ్రాన్ లో ప్రజా సందర్శనకు ఉంచారు. అంత్యక్రియల ప్రక్రియ ప్రారంభానికి సంకేతంగా ఖమేనీ భౌతికకాయాన్ని బయటికి తీస్తున్నారు. ప్రజల సందర్శనార్థం ఖమేనీ భౌతికకాయాన్ని మూడు రోజులపాటు ప్రదర్శనకు పెట్టనున్నట్లు ఇరాన్ అధికార టీవీ తెలిపింది. ఖమేనీ తరచుగా ప్రజలను ఉద్దేశించి ప్రసంగాలు చేయడమేగాక, ప్రార్థనలు నిర్వహించిన సెంట్రల్ టెహ్రాన్‌లోని ఒక పెద్ద ప్రాంగణంలో ఆయన భౌతికకాయాన్ని ఉంచనున్నట్లు వెల్లడించింది. మూడు రోజుల ప్రజా సందర్శన అనంతరం ఇరాన్ ఖమేనీ అంత్యక్రియలు నిర్వహించనుంది. మరోపక్క ఇజ్రాయెల్‌పైన, పరిసర దేశాల్లోని అమెరికా సైనిక స్థావరాలపైన ఇరాన్ ప్రతీకార దాడులను తీవ్రతరం చేసింది.

ఏరివేతే మా టార్గెట్ : అమెరికా, ఇజ్రాయెల్

అలీ ఖమేనీ స్థానంలో ఇరాన్ ఎవర్ని నియమించినా.. ఆ వ్యక్తే తమ టార్గెట్ అవుతారని ఇజ్రాయెల్ పేర్కొన్నది. ఇరాన్‌కు చెందిన ఉగ్రవాద పాలకులు తమ నేతగా ఎవర్ని నియమించినా.. వారిని అంతం చేస్తామని ఇజ్రాయెల్ రక్షణ మంత్రి ఇజ్రాయెల్ కట్జ్ వార్నింగ్ ఇచ్చారు. ఇజ్రాయెల్‌కు కానీ, అమెరికాకు కానీ ఆ వ్యక్తి వ్యతిరేకంగా ఉన్నా , లేక ఇరానీ ప్రజలను హింసించినా, తాము ఊరుకోబోమన్నారు. అతని పేరెంటన్న విషయం అవసరం లేదని, అతను ఎక్కడ దాక్కున్నా ఏరివేస్తామని కట్జ్ తన వార్నింగ్‌లో వెల్లడించారు. అమెరికా భాగస్వాములతో కలిసి తాము పూర్తిగా దాడి చేస్తామన్నారు. అయితే ఖమేనీ స్థానంలో అతని కుమారుడు మొజ్తాబాను ఇరాన్ సుప్రీం నేతగా ఎన్నుకున్నట్లు తాజాగా ఓ మీడియా కథనం ద్వారా తెలిసింది.

అమెరికా, ఇజ్రాయెల్‌పై ఇరాన్ సైన్యం 40 క్షిపణులు

అమెరికాతో చర్చలు జరిపే ఆలోచన తమకు లేదని ఇరాన్ తేల్చి చెప్పింది. అమెరికా యుద్ధాన్ని కొనసాగించవచ్చని ఖమేనీ సన్నిహితుడు ఒకరు పేర్కొన్నారు. తమతో ఇరాన్ చర్చలు జరిపేందుకు ప్రయత్నిస్తుందని ట్రంప్ చేసిన కామెంట్స్ కు కౌంటర్‌గా ఇరాన్ ఈ ప్రకటన విడుదల చేసింది. కాగా, అమెరికా, ఇజ్రాయెల్‌పై ఇరాన్ సైన్యం 40 క్షిపణులు ప్రయోగించింది. ఇరాక్, కువైట్‌లోని అమెరికా స్థావరాలపై ఇరాన్ డ్రోన్ల దాడి చేస్తోంది. వందలకొద్దీ డ్రోన్లతో దాడి చేశామని ఇరాన్ ఈ మేరకు ప్రకటించింది. ఇరాన్ సుప్రీం లీడర్‌గా ఎవరిని ఎన్నుకున్నా చంపేస్తామన్న ఇజ్రాయెల్ దాడుల్లో ఇప్పటివరకు ఇరాన్‌లో 1,097 మంది చనిపోయినట్లు యూఎస్ మానవహక్కుల సంస్థ వెల్లడించింది.

అదనంగా ఐపీఎస్ అధికారులను కేటాయించండి

మొదటిపేజీ తరువాయి

సీఎం తెలిపారు. హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజిగిరి కమిషనరేట్ల పునర్వ్యవస్థీకరణ, ఫ్యూచర్ సిటీ కమిషనర్, హైదరాబాద్ నగరంలో భారీగా పెరుగుతున్న జనాభా నేపథ్యంలో పెద్ద సంఖ్యలో ఐపీఎస్ అధికారుల అవసరం ఉందని కేంద్ర మంత్రి అమిత్ షాకు సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. మూడో క్యాడర్ రివ్యూను నిర్దేశిత 2026 సంవత్సరంలోనే చేపట్టాలని కేంద్ర మంత్రికి సీఎం విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం 83 ఐపీఎస్ అధికారులు రాష్ట్రంలో ఉన్నారని... ఆ సంఖ్యను 105 కు పెంచి కేటాయించాలని సీఎం కోరారు.

మావోయిస్టుల లొంగుబాటుపై

అనంతరం మావోయిస్టుల లొంగుబాటుపై కేంద్ర మంత్రి అమిత్ షా, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చర్చించారు. ఇటీవల మావోయిస్టు అగ్ర నాయకుల లొంగుబాటు, వారి పునరావాసం అంశాలు వారి మధ్య చర్చకు వచ్చాయి. గత రెండేళ్లలో తెలంగాణ పోలీసింగ్లో గణనీయమైన మార్పులు వచ్చాయని సీఎం తెలిపారు. రాష్ట్రంలో 591 మంది మావోయిస్టులు ఆయుధాలను వీడి జనజీవన స్రవంతిలో కలిసిన విషయాన్ని కేంద్ర మంత్రి అమిత్ షా దృష్టికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీసుకెళ్లారు. ఇటీవల కాలంలో పలువురు మావోయిస్టు అగ్రనేతలు కూడా సాధారణ జీవితం గడిపేందుకు ముందుకు వచ్చారని, వారికి నిబంధనల ప్రకారం అందజేస్తున్న పరిహారం, పునరావాసం విషయాలను కేంద్ర మంత్రికి సీఎం తెలియజేశారు. రాష్ట్రంలో వెనుకబడిన ప్రాంతాల్లో అభివృద్ధి పనులకు కేంద్ర ప్రభుత్వం నిధులు కేటాయించి సహకరించాలని కేంద్ర మంత్రిని సీఎం కోరారు. సమావేశంలో ముఖ్యమంత్రి ప్రిన్సిపల్ సెక్రటరీ వి.శేషాద్రి, రాష్ట్ర డీజీపీ బి. శివధర్ రెడ్డి, ఇంటెలిజెన్స్ అడిషనల్ డీజీపీ విజయ్ కుమార్, ఎస్ఐబి ఐజీపీ బి. సుమతి పాల్గొన్నారు.

రాజ్యసభకు అభిషేక్ సింఘ్వీ, నరేందర్ రెడ్డి

మొదటిపేజీ తరువాయి

ఫైనల్‌చేసింది. వీరు రేపు నామినేషన్ వేయనున్నారు. ప్రస్తుతం వేం నరేందర్ రెడ్డి సీఎం రేవంత్ సలహాదారుగా ఉన్నారు. అభిషేక్ మనుసింఘ్వీ, కేఆర్ సురేష్ రెడ్డి పదవీ కాలం ముగియడంతో వారి స్థానంలో కొత్తవారిని ఎన్నుకునేందుకు కేంద్ర ఎన్నికల కమిషన్ నోటిఫికేషన్ జారీ చేసింది. అయితే రెండు సీట్లు కూడా కాంగ్రెస్ ఖాతాలోనే పడనున్నాయి. మరోవైపు ఈ ఎన్నికలో సరిపడ బలం లేకపోయినా 10 మంది ఫిరాయింపు ఎమ్మెల్యేలను ఇరకాటంలో పెట్టేందుకు అభ్యర్థిని బరిలోకి దింపాలని బీఆర్ఎస్ యోచిస్తోంది. కాంగ్రెస్ సీనియర్ నేత అభిషేక్ మను సింఘ్వీ సిట్టింగ్ ఎంపీగా ఉన్నారు. పైగా తెలంగాణ ప్రభుత్వానికి సంబంధించిన కేసులను అటు సుప్రీంకోర్టు ఇటు తెలంగాణ హైకోర్టులో కూడా ఆయనే వాదిస్తున్నారు. దీంతో అభిషేక్ మనుసింఘ్వీకి పార్టీ అధిష్టానం మరో అవకాశం ఇచ్చింది. నామినేషన్ పత్రాలు దాఖలు చేసేందుకు అభిషేక్ మను సింఘ్వీ ఇప్పటికే హైదరాబాద్ చేరుకున్నారు. ఇక రెండో స్థానం కోసం తెలంగాణ నుంచి రాజ్యసభకు రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు వేం నరేంద్ రెడ్డిని ఎంపిక చేసింది కాంగ్రెస్ పార్టీ. కాగా వీరిద్దరు గురువారం నామినేషన్ వేసే అవకాశం ఉంది. రాజ్యసభ సీటు కోసం అధికార పార్టీలో దాదాపు 16 మంది పోటీ పడ్డారు. వారిలో సీనియర్లే కాదు సూపర్ సీనియర్లు సైతం ఉన్నారు. ఈ నేపథ్యంలో ఎంపీ అభ్యర్థి ఎంపికపై పార్టీ అగ్రనాయకత్వంతో సీఎం రేవంత్ రెడ్డి బుధవారం న్యూఢిల్లీలో చర్చించారు. చివరకు వేం నరేందర్ రెడ్డి వైపు పార్టీ అధిష్ఠానం మొగ్గు చూపినట్లు తెలుస్తోంది. మరోవైపు ఈ ఎన్నికలో సరిపడ బలం లేకపోయినా 10 మంది ఫిరాయింపు ఎమ్మెల్యేలను ఇరకాటంలో పెట్టేందుకు అభ్యర్థిని బరిలోకి దింపాలని బీఆర్ఎస్ యోచిస్తోంది. అయితే ఏ సామాజికవర్గానికి టికెట్ ఇచ్చినా ఓడిపోయే సీటు ఇచ్చారన్న విమర్శలు ఎదురవుతాయని గులాబీ పార్టీ ఆలోచిస్తోంది. దీంతో గులాబీ పార్టీ పోటీపై డైలమాలో పడిపోయింది. అసెంబ్లీలో అధికారికంగా 37మంది సభ్యులున్న బీఆర్ఎస్ సంఖ్య.. ఫిరాయింపు ఎమ్మెల్యేల కారణంగా 27కు పడిపోయింది.

భూములు కోల్పోయే రైతులను ఆదుకుంటాం

మొదటిపేజీ తరువాయి

జిల్లాలోని ఇరిగేషన్ ప్రాజెక్టులను ప్రాధాన్యం ఆధారంగా త్వరగా పూర్తి చేస్తామని తెలిపారు. భూసేకరణకు సంబంధించిన అంచనాలు, ప్రతిపాదనలను 15 రోజుల్లో సిద్ధం చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. భూసేకరణ పూర్తయ్యాక సీఎం దృష్టికి తీసుకెళ్లి నష్టపరిహారాన్ని వెంటనే చెల్లించి పనులు ప్రారంభిస్తామని తెలిపారు.

రామప్ప,- లక్నవరం ప్రాజెక్టుకు అదనపు నిధులు

రామప్ప , లక్నవరం ఇంటర్ లింకింగ్ ప్రాజెక్టుకు అదనపు నిధులు కేటాయించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. జిల్లా అధికార యంత్రాంగం, ఇరిగేషన్ శాఖలు సమన్వయంతో పనిచేసి ములుగు రైతులకు సాగునీరు అందించాలని మంత్రులు ఆదేశించారు. దేవాదుల ప్రాజెక్టుకు అవసరమైన భూసేకరణపై 15 రోజుల్లో మరోసారి సమావేశం నిర్వహించి ప్రత్యేకంగా చర్చిస్తామని మంత్రులు పేర్కొన్నారు. సమ్మక్క సారాలమ్మ ప్రాజెక్టుపై చత్తీస్‌గఢ్ అభ్యంతరాలు వ్యక్తం చేస్తోందని, అక్కడ ముంపు బాధితులకు పరిహారం చెల్లిస్తామని స్పష్టం చేశారు. పెండింగ్ పనుల జాప్యంపై కాంట్రాక్టర్లపై మంత్రులు ఆగ్రహం వ్యక్తం చేశారు. త్వరితగతిన పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. ఏవైనా ఇబ్బందులుంటే పరిష్కరిస్తామని మంత్రులు పేర్కొన్నారు.

సింగూర్ డ్యామ్ భద్రతకు కట్టుదిట్టమైన చర్యలు

మొదటిపేజీ తరువాయి

వివేక్ వెంకటస్వామి లతో కలసి డాక్టర్ బీఆర్.అంబెద్కర్ సచివాలయంలో ఆయన నీటిపారుదల శాఖా ఇంజినీర్లతో ఉన్నత స్థాయిలో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ జంటనగరాలకుతాగునీటిని సరఫరా చేస్తూ, పరిసర ప్రాంతాలకు సాగునీరూ అందిస్తున్న సింగూర్ ప్రాజెక్టును పరిరక్షించడంతో పాటు పునరుద్ధరణ విషయంలో ఎటువంటి రాజీ ఉండబోదని ఆయన స్పష్టం చేశారు.జాతీయ ఆనకట్ట భద్రతా సంస్థతో పాటు, రాష్ట్ర అధికారుల నుంచి భద్రతా పరిస్థితిపై హెచ్చరికలు వచ్చినట్టు ఆయన పేర్కొన్నారు.ప్రమాదాలను నివారించేందుకు తక్షణ సాంకేతిక జోక్యాలు, నీటిమట్టం దిగువన అండర్‌వాటర్ పరిశీలనలు, మరమ్మత్తు పనులను వేగవంతం చేయాలని ఆయన ఆదేశించారు.

సింగూర్ డ్యామ్ పై ప్రత్యేక దృష్టి

సంగారెడ్డి జిల్లాలో ఉన్న సింగూర్ డ్యామ్ పై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని ఆయన తెలిపారు. 2025 మధ్యకాలంలో నిర్వహించిన అంచనాల్లో ఎంబాంక్మెంట్‌లో చీలికలు, స్లోప్ ఎరోషన్, రివెట్‌మెంట్ నష్టం, ప్లంజ్ పూల్ సమస్యలు వెలుగులోకి వచ్చాయన్నారు.ఇవి దిగువ ప్రాంతాల్లో వరద ముప్పుకు దారితీసే అవకాశాలపై ఆందోళనలు రేకెత్తించాయన్నారు. 29.91 టీఎంసీల స్థూల సామర్థ్యం గల ఈ రిజర్వాయర్ ప్రతీ సంవత్సరం హైదరాబాద్‌కు 6-7 టీఎంసీల నీటిని సరఫరా చేస్తోందని ఆయన తెలిపారు. డ్యామ్ భద్రత విషయంలోపూర్తి బలోపేతం జరిగే వరకు అధిక ప్రమాదం కలిగించే ఆపరేషన్లు నిలిపివేయాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు.బండ్ దిగువన నీటిని పూర్తిగా వదలకుండా దాగి ఉన్న నష్టాలను గుర్తించేందుకు సోనార్ పరీక్షలు మరియు అండర్‌వాటర్ సర్వేలు చేపట్టి 2-3 రోజుల్లో నివేదిక సమర్పించాలని ఆయన అధికారులను ఆదేశించారు.త్వరలోనే స్వయంగా ఆనకట్టను సందర్శిస్తానని ప్రకటించిన ఆయన, ఒకే సీజన్‌లో పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టర్లను ఆదేశించారు, పంటల విరామం రాకుండా చూడాలన్నారు.ఇదే సమయంలో సింగూర్ కాలువ లైనింగ్ పనుల పురోగతిని కూడా మంత్రి సమీక్షించారు. మొత్తం 13 కి.మీ.లో 9 కి.మీ. పూర్తయ్యాయి; మిగిలిన 4 కి.మీ.ను అత్యవసరంగా పూర్తి చేయాలని ఆదేశించారు.

జూన్ 2 వరకు భూసేకరణ పూర్తి చేయాలి

2025 ఆగస్టులో నిల్వలను భద్ర పరిమితులకు కట్టడి చేసి, నియంత్రిత నీటి విడుదలలు ప్రారంభించినప్పుడు ఆనకట్టపై ముప్పు స్థాయి పెరిగిందని, డిసెంబర్ నాటికి దశలవారీగా నీటిమట్టాన్ని తగ్గించి ప్రధాన మరమ్మత్తులు చేపట్టినట్లు ఆయన వివరించారు. "సింగూర్ డ్యామ్ భద్రత రాష్ట్ర ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యమైనదని, ఇది ప్రజల ప్రాణాలను, జీవనోపాధిని, హైదరాబాద్ నీటి భద్రతను కాపాడుతున్నందున భద్రత ఏర్పాట్లకు త్వరితగతిన చర్యలు తీసుకుంటామని," ఆయన పునరుద్ఘాటించారు.ములుగు జిల్లాలో నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టులకు అవసరమైన భూసేకరణ ప్రక్రియను మరింత వేగవంతం చేయాలన్నారు. అదేవిధంగా పాలెం వాగు గేట్లు, రెగ్యులేటర్ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు.పాలెంవాగు పరిస్థితిని క్షేత్రస్థాయిలో పర్యటించి పూర్తిస్థాయిలో అధ్యయనం చేసి నివేదికను సమర్పించాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ప్రాజెక్టుల నిర్మాణాలకు గాను భూసేకరణకు రాష్ట్ర ప్రభుత్వం 5,000 కోట్ల నిధులు విడుదల చేయనున్నట్లు ఆయన ప్రకటించారు.

ఢిల్లీలో గణపతి లొంగుబాటు?

మొదటిపేజీ తరువాయి

మల్లా రాజిరెడ్డి, నూనె నర్సింహారెడ్డి తదితరులు ఇప్పటికే లొంగిపోయారు. మావోయిస్టు అగ్రనేత, సీపీఐ (మావోయిస్టు) మాజీ ప్రధాన కార్యదర్శి ముప్పాళ్ల లక్ష్మణరావు అలియాస్ గణపతి లొంగుబాటుకు సిద్ధమయినట్టు నేపథ్యంలో భారీగా పీఎల్జీఏ సభ్యలు ఆయుధాలతో సహా సీఎం ఎందుట లొంగిపోయేందుకు సిద్ధమయినట్లు సమాచారం. రెండేళ్లుగా 591 మంది మావోయిస్టులు ఇప్పటికే లొంగిపోయినట్లు రాష్ట్ర డీజీపీ శివధర్ రెడ్డి తెలిపారు. తెలంగాణాలో మావోయిస్టుల పునరావాసానికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు సత్ఫలితాలిస్తున్నట్లు తెలిపారు. కాగా దాదాపు 100 మంది సీఎం రేవంత్‌ఎదుట లొంగిపోనున్నట్లు సమాచారం.

ఆపరేషన్ కగార్ తో పార్టీ అంతం

కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ కగార్ తో మావోయిస్టులకు కోలుకోలేని దెబ్బ తగిలింది.మావోయిస్టు పార్టీకి చెందిన కీలక నేతలెందరోఎన్‌కౌంటర్లలో చనిపోయారు. మార్చి 31 నాటికి మావోయిస్టులు లేకుండా చేస్తామన్న కేంద్ర హోం మంత్రి అమిత్ షా ప్రకటనను నిజం చేస్తూ వందలాది మంది నాయకులు ఎదురుకాల్పుల్లో చనిపోయారు. దీంతో పార్టీలో ఉన్న కీలక నేతలు లొంగుబాట పట్టారు. దీంతో గణపతి ఏకాకిగా మిగిలిపోయారు. ఇటీవల లొంగిపోయిన అగ్రనేతల సమాచారంతో నేపాల్ లో ఉన్న గణపతిని తెలంగాణ పోలీసలు సురక్షితంగా ఢిల్లీకి తీసుకువస్తున్నట్లు సమాచారం. ఈ క్రమంలో ఆయన లొంగుబాటును ఈ రోజు లేదా మరో రెండు మూడు రోజుల్లో చూపించే అవకాశం ఉందని ప్రచారం సాగుతోంది. మరి కొన్ని గంటల్లో కేంద్ర ప్రభుత్వం, తెలంగాణ పోలీసులు సంయుక్తంగా గణపతి లొంగుబాటును చూపించనున్నట్లు సమాచారం.

ముగిసిన మావోయిస్టు శకం

50 ఏళ్ల పాటు మావోయిస్టు ఉద్యమాన్ని నడిపిన గణపతి అసలు పేరు ముప్పాళ్ళ లక్ష్మణ్ రావు. ఆయనది ఉమ్మడి కరీంనగర్ జిల్లా (ప్రస్తుతం జగిత్యాల) సారంగపూర్ మండలంలోని బీర్ పూర్ గ్రామం. 1949లో జన్మించారు. సుమారు 77 ఏండ్ల ఆయన జీవితకాలంలో నాలుగున్నర ఏండ్లు ఆయన అజ్ఞాతంలోనే ఉన్నారు. ఆపరేషన్ కాగర్ తర్వాత అజ్ఞాతంలోకి వెళ్లిన గణపతి అనారోగ్య కారణాలతో నేపాల్ లో ఆశ్రయం పొందుతున్నట్లు ప్రచారం జరిగింది. గణపతి లొంగుబాటుతో మావోయిస్టులో అగ్రనేతల శకం ముగిసినట్లే. వృద్ధాప్యం, అనారోగ్య కారణాలతో ఆయన తెలంగాణ పోలీసులతో రహస్య సంప్రదింపులు జరుపుతున్నట్లు, త్వరలోనే లొంగిపోయే అవకాశం ఉన్నట్లు సమాచారం. దశాబ్దాల పాటు సాయుధ మావోయిస్టు ఉద్యమాన్ని నడిపించిన గణపతి, వయస్సు, అనారోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని సాధారణ జీవితం గడపాలని కుటుంబ సభ్యులు కోరిక మేరకు జనజీవన స్రవంతిలోకి రానున్నారు. తెలంగాణ ఇంటెలిజెన్స్ బ్యూరో ఆయనతో టచ్‌లోకి వెళ్లినట్లు సమాచారం.గణపతి లొంగుబాటు మావోయిస్టు ఉద్యమానికి పెద్ద దెబ్బగా, వారి సాయుధ పోరాట ముగింపునకు దారితీసే పరిణామంగా నిపుణులు భావిస్తున్నారు. సుదీర్ఘకాలం పార్టీ ప్రధాన కార్యదర్శిగా కొనసాగిన గణపతి ఆ తర్వాత అనారోగ్య కారణాలతో ప్రధాన కార్యదర్శిగా తప్పుకున్నారు. ఆయన స్థానంలో ఇటీవల ఎన్‌కౌంటర్ లో మరణించిన నంబళ్ల కేశవరావు అలియాస్ బసవరాజు బాధ్యతలు నిర్వహించారు. పార్టీ ప్రధాన కార్యదర్శిగా లేకున్నా పొలిట్‌బ్యూరోలో జరిగే చర్చలన్నింటిలో పాల్గొంటూ వ్యూహం, ఎత్తుగడలు లాంటి కీలక నిర్ణయాల్లో యాక్టివ్‌గా ఉండేవారు. ఆ తర్వాత తీవ్ర అనారోగ్య సమస్యలతో ఆయన నేపాల్‌లో తలదాచుకున్నట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

రాష్ట్రీయం

రాహుల్‌ని ప్రధానిగా చూడాలనుకోవడం మా హక్కు

- నాయకత్వం ఎవరికి దక్కాలో నిర్ణయించేది సంజయ్ కాదు
- ఈ దేశానికి పట్టిన గ్రహణం ఎవరో ప్రజలకు తెలుసు
- కేంద్ర మంత్రి బండి సంజయ్ కి మంత్రి పొన్నం ప్రభాకర్ కౌంటర్

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, మార్చి 4: రాహుల్ గాంధీని ప్రధానమంత్రిగా చూడాలని ఆశించడం ఒక రాజకీయ పార్టీ గా మా హక్కు అని మంత్రి పొన్నం ప్రభాకర్అన్నారు. కేంద్ర మంత్రి బండి సంజయ్‌వ్యాఖ్యలపై ఆయన స్పందించారు. ప్రజాస్వామ్యంలో నాయకత్వం ఎవరికి దక్కాలో నిర్ణయించేది బండి సంజయ్ కాదని, ప్రజలే న్యాయ నిర్ణేతలని అన్నారు. ప్రజాస్వామ్యంలో పదవులు శాశ్వతం కాదని, అవి ప్రజల విశ్వాసంపై ఆధారపడి ఉంటాయని అన్నారు. ఈ దేశానికి పట్టిన గ్రహణం ఎవరో ప్రజలకు తెలుసని, గత 12 ఏళ్లుగా ప్రజలు ఎన్నో కష్టాలు అనుభవిస్తున్నారని, దేశాన్ని కార్పొరేట్లకు కట్టబెట్టి తమాషా చూస్తున్నారని అన్నారు. దేశ సార్వభౌమత్వాన్ని అమెరికాకు తాకట్టు పెట్టిన మీరా మాట్లాడేది? అని ప్రశ్నించారు. 'మీరు అధికారంలోకి వచ్చిన తర్వాత పరిపాలన వ్యవస్థలు అస్తవ్యస్థంగా మారాయి.. ప్రభుత్వ రంగ సంస్థలు తెగనమ్ముతున్నారు..' అని అన్నారు. ధరలు విపరీతంగా పెరుగుతున్నాయని, పేదలను ఆదుకునే ప్రయత్నం చేయలేదని విమర్శించారు. విద్వేషాన్ని రెచ్చగొట్టి మైనార్టీలను, అణగారిన వర్గాలను బూచిగా చూపి అధికారాన్ని చెలాయిస్తున్నారని, నిత్యం మతవిద్వేశాలు రెచ్చగొడుతూ రాజకీయం చేస్తున్నారని మంత్రి ప్రభాకర్ మండిపడ్డారు. కేంద్ర దర్యాప్తు సంస్థలను వాడుకుని విపక్ష ప్రభుత్వాలను కూలుస్తు ప్రజాస్వామ్యాన్ని కూని చేస్తున్న రాజకీయం బీజేపీది అని మండిపడ్డారు. దేశ ఐక్యత కోసం కన్యాకుమారి నుండి కాశ్మీర్ వరకు పాదయాత్ర చేసి, దేశ ప్రజలకు ఐక్యతను చాటి బీజేపీ ప్రభుత్వానికి నిద్ర లేకుండా చేస్తున్న రాహుల్ గాంధీని విమర్శించడం అంటే ఆకాశం మీద ఉమ్మిసినట్లే అని బండి సంజయ్ తెలుసుకోవాలని అన్నారు. రెండు సార్లు ఎంపీగా గెలిచి, కేంద్ర మంత్రి అయి తెలంగాణ కు ప్రత్యేక నిధులు తీసుకురాని బండి సంజయ్ తన వ్యవహారశైలి మార్చుకోవాలని అన్నారు.

46 లక్షల మంది మహిళల హెల్త్ ప్రొఫైల్

- 8న మహిళ దినోత్సవం సందర్భంగా స్క్రీనింగ్ ప్రారంభం
- టీ డయాగ్నస్టిక్స్ ద్వారా ఒక్కొక్కరికీ 30 రకాల పరీక్షలు
- ఆరోగ్యశాఖ మంత్రి రాజనర్సింహ
- ప్రజాపాలన.. ప్రగతి ప్రణాళిక కార్యక్రమాలపై సమీక్ష

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, మార్చి 4: రాష్ట్రవ్యాప్తంగా స్వయం సహాక సంఘాల మహిళల హెల్త్ ప్రొఫైల్ రూపొందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ కార్యక్రమాన్ని ఈ నెల 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవం నాడు ప్రారంభించాలని ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అధికారులకు సూచించారు. ప్రజాపాలనప్రగతి ప్రణాళికలో భాగంగా ఆరోగ్యశాఖ నిర్వహించాల్సిన కార్యక్రమాలపై సెక్రటేరియట్‌లో మంత్రి దామోదర్ రాజనర్సింహ బుధవారం సమీక్ష చేశారు. ఈ సమావేశంలో ఆరోగ్యశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ క్రిస్టినా జడ్ చొంగ్తు, హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్ సంగీత సత్యనారాయణ, ఆరోగ్యశ్రీ సీఈవో ఉదయ్ కుమార్, డ్రగ్ కంట్రోల్ అథారిటీ డైరెక్టర్ జనరల్ షానవాజ్ ఖాసీం, డీఎంఈ నరేంద్ర కుమార్, టీవీవీపీ కమిషనర్ అజయ్‌కుమార్, డీహెచ్ రవిందర్ నాయక్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఈ నెల 6 నుంచి జూన్ 12 వరకూ 99 రోజులపాటు చేపట్టనున్న కార్యక్రమాలపై ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులకు మంత్రి దిశానిర్దేశం చేశారు.

6 నుంచి మొదటిదశ...

తొలి దశలో మార్చి 6 నుంచి 31వ తేదీ వరకు 26 రోజుల పాటు మాతా శిశు సంరక్షణ, కౌమార దశ బాలికలు, వృద్ధుల ఆరోగ్య సేవలపై దృష్టి కేంద్రీకరించనున్నారు. హాస్పిటళ్లలో పారిశుధ్య నిర్వహణ, పెండింగ్ ఫైళ్ల పరిష్కారం, ఆస్తుల వెరిఫికేషన్ వంటి పరిపాలనా పరమైన అంశాలను చక్కదిద్దడంతో పాటు.. క్షేత్రస్థాయిలో రక్తహీనత నివారణ, పాఠశాలలు, అంగన్‌వాడీల్లో పిల్లలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించనున్నారు. మార్చి 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని సెల్ఫ్ హెల్ప్ గ్రూపు మహిళల హెల్త్ ప్రొఫైల్ తయారీ ప్రోగ్రామ్‌ను ప్రారంభిస్తారు. తెలంగాణ డయాగ్నస్టిక్స్ సహకారంతో ఒక్కో మహిళకు మొత్తం 30 రకాల పరీక్షలు చేయనున్నారు. మార్చి 8 నుంచి మూడు దశల్లో సుమారు 46 లక్షల మంది మహిళలకు పరీక్షలు చేయనున్నారు. తొలి దశలో ప్రతి జిల్లా నుంచి 5 మండలాల్లో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించి, రెండో దశలో మరో 10 మండలాల్లో, చివరి దశలో మిగిలిన అన్ని మండలాల్లో స్క్రీనింగ్ చేపట్టనున్నారు.

ఏప్రిల్1 నుంచి రెండో దశ...

ప్రజాపాలన రెండో దశను ఏప్రిల్ 1 నుంచి 15వ తేదీ వరకు నిర్వహిస్తారు. ఈ 15 రోజుల్లో అసంక్రమిత వ్యాధులైన బీపీ, షుగర్, కేన్సర్ వంటి వాటిని గుర్తించేందుకు సబ్ సెంటర్ల పరిధిలో విస్తృతమైన స్క్రీనింగ్ క్యాంపులు ఏర్పాటు చేస్తారు. జిల్లా డే కేర్ కేన్సర్ సెంటర్లలో కీమోథెరపీ సేవలను మ్యాపింగ్ చేయడంతో పాటు, డయాలసిస్ రోగులకు వైరల్ ఇన్ఫెక్షన్ పరీక్షలు తప్పనిసరి చేయాలని మంత్రి ఆదేశించారు.

ఏప్రిల్ 16 నుంచి మూడో దశ...

ఇక ఏప్రిల్ 16 నుంచి మే 15 వరకు సాగే మూడో దశలో అంటువ్యాధుల నియంత్రణ, ప్రజారోగ్య సన్నద్ధతపై యంత్రాంగం దృష్టి సారించనుంది. టీబీ ముక్త్ భారత్ లక్ష్యంగా టీబీ కేసులను గుర్తించడంతో పాటు.. ఎండలు ముదురుతున్న నేపథ్యంలో వడదెబ్బ, డెంగ్యూ, మలేరియా వంటి సీజనల్ వ్యాధులపై ప్రజల్లో అవగాహన కల్పించి, అత్యవసర మందులను అందుబాటులో ఉంచాలని మంత్రి ఆదేశించారు.

మే 16 నుంచి నాలుగో దశ...

మే 16 నుంచి జూన్ 12 వరకు నాలుగో దశలో పట్టణ ప్రాంతాల్లో ఆరోగ్య సేవలను విస్తరించనున్నారు. ముఖ్యంగా జీహెచ్ఎంసీ, సైబరాబాద్, మేడ్చల్ పరిధిలోని 145 అర్బన్ పీహెచ్‌సీలను పాలిక్లినిక్స్‌గా అప్‌గ్రేడ్ చేసి, స్పెషాలిటీ వైద్య సేవలను అందించాలని మంత్రి సూచించారు. బస్తీల్లో మొబైల్ వెహికిల్స్ ద్వారా వైద్య శిబిరాలు నిర్వహించి పేదలకు వైద్యం చేరువ చేయనున్నారు. ఫుడ్ సేఫ్టీ మేళాలు నిర్వహించి ప్రజల్లో కల్తీ ఆహారంపై చైతన్యం తీసుకురావాలని మంత్రి సూచించారు.

గత సర్పంచ్‌ల పెండింగ్ బిల్లుల విడుదల

- పంచాయతీ రాజ్ శాఖ మార్గదర్శకాలు
- పంచాయతీలకు అన్‌టైడ్, టైడ్ గ్రాంట్స్
- మల్టీ పర్పస్ వర్కర్ల వేతనాలు చెల్లించాలని ఆదేశం

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, మార్చి 4: గత సర్పంచ్‌లు చేపట్టిన పనులకు సంబంధించిన పెండింగ్ బిల్లుల చెల్లింపుల విషయంలో పంచాయతీ రాజ్ శాఖ స్పష్టతనిచ్చింది. ఈ మేరకు జిల్లా పంచాయతీ అధికారులకు పంచాయతీ రాజ్, రూరల్ డెవలప్మెంట్ శాఖ డైరెక్టర్ దివ్యా దేవరాజన్ ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం 15వ ఆర్థిక సంఘం కింద 2023-24 ఆర్థిక సంవత్సరానికి గ్రామ పంచాయతీలకు టైడ్ కాంపొనెంట్ క్రింద రూ. 245.00 కోట్లు విడుదల చేసినట్లు తెలిపారు. అలాగే 2024-25 ఆర్థిక సంవత్సరానికి బేసిక్ అన్‌టైడ్, టైడ్ గ్రాంట్స్ కింద రూ. 640.07 కోట్లు విడుదల చేసినట్లు వెల్లడించారు. గత సర్పంచ్‌ల పదవీకాలం ముగిసిన నేపథ్యంలో, 2023-24 సంవత్సరానికి విడుదలైన టైడ్ కాంపొనెంట్ నిధులతో చేపట్టిన తాగునీరు, పారిశుధ్య పనులకు సంబంధించిన రికార్డులు అందుబాటులో ఉన్న మేరకు మాత్రమే గత సర్పంచులకు బిల్లులు చెల్లించవచ్చని అధికారులు స్పష్టం చేశారు. ఈ మేరకు జిల్లాల పంచాయతీ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. 2023-24 టైడ్ కాంపొనెంట్ కింద విడుదలైన నిధులపై గత సర్పంచ్‌ల పెండింగ్ బిల్లులను రికార్డులు సరిచూసి చెల్లించాలని ఆదేశాలు ఇచ్చినట్లు పేర్కొన్నారు. అదేవిధంగా, గ్రామ పంచాయతీలకు అందుబాటులో ఉన్న నిధుల నుంచి మల్టీ పర్పస్ వర్కర్లు వేతనాలు చెల్లించాలని సూచించారు. ఈ మేరకు జిల్లాల స్థాయిలో తగిన చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు.

మియాపూర్‌లో డ్రగ్స్ కలకలం

- డ్రగ్స్ విక్రయిస్తున్న ముగ్గురు సాఫ్ట్‌వేర్ యువకులు
- 12.6 గ్రాముల ఎమ్‌డీఎమ్ఏ డ్రగ్ స్వాధీనం

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, మార్చి 4: మియాపూర్‌లో మరోసారి డ్రగ్స్ కలకలం రేపింది. డ్రగ్స్ విక్రయిస్తున్న ముగ్గురు సాఫ్ట్‌వేర్ యువకులను మియాపూర్ పోలీసులు అరెస్ట్ చేశారు. సాఫ్ట్‌వేర్ ఉద్యోగులను లక్ష్యంగా చేసుకుని డ్రగ్స్ విక్రయాలు జరుగుతున్నట్లు సమాచారం అందడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. పక్కా సమాచారంతో దాడులు నిర్వహించగా.. ముగ్గురు సాఫ్ట్‌వేర్ యువకులను పోలీసులు అరెస్టు చేశారు. వీరిలో డ్రగ్ పెడ్లర్ హనుమంతుతో పాటు డ్రగ్స్ వినియోగిస్తున్న మహేష్, ఆదర్శ్‌లను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి సుమారు 12.6 గ్రాముల ఎమ్‌డీఎమ్ఏ డ్రగ్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ డ్రగ్ మార్కెట్ విలువ దాదాపు 1.5 లక్షల రూపాయలుగా అంచనా. దర్యాప్తులో ఈ ముఠా నైజీరియన్‌ల నుంచి డ్రగ్స్ కొనుగోలు చేసి.. బెంగళూరు నుంచి హైదరాబాద్‌కు తరలించి సాఫ్ట్‌వేర్ ఉద్యోగులకు విక్రయిస్తున్నట్లు తేలింది. పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

'ఐడియా' వెబ్‌సైట్‌ప్రారంభించిన వీసీ ప్రో.చక్రపాణి

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, మార్చి 4: డా. బీఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయ వైస్‌ఛాన్సలర్ ప్రొ. ఘంటా చక్రపాణి బుధవారం ఇండియన్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ అసోసియేషన్ వెబ్‌సైట్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రొ. చక్రపాణి మాట్లాడుతూ ఈ నెల 25, 26 తేదీలలో "సరిహద్దులకు అతీతంగా సరికొత్త దిశలో సార్వత్రిక విద్య" అనే అంశంపై రెండు రోజుల జాతీయ సదస్సు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ సదస్సులో దేశంలోని అన్ని ఓపెన్ యూనివర్సిటీల నుంచి విద్యావేత్తలు పాల్గొంటారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో 'ఐడియా' అధ్యక్షులు, విశ్వవిద్యాలయ మాజీ వైస్‌ఛాన్సలర్ ప్రొ. కె. సీతారామ రావు, విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ డా.ఎల్. విజయ కృష్ణా రెడ్డి; హైదరాబాద్‌కేంద్రీయ విశ్వవిద్యాలయ అధ్యాపకులు, ఐడియా ఉపాధ్యక్షులు ప్రొ. జిలాని; మానూ యూనివర్సిటీ అధ్యాపకులు ఐడియా ప్రతినిధి ప్రొ. ముస్తాక్ అహ్మద్, మాజీ రిజిస్ట్రార్ ప్రొ. సి. వెంకటయ్య పాల్గొన్నారు

అగ్నిప్రమాదాల పట్ల అప్రమత్తత అవసరం

- బాచుపల్లి ఘటనా స్థలాన్ని పరిశీలించిన హైడ్రా కమిషనర్

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, మార్చి 4: వేసవి కాలం ఆరంభమైంది. నిప్పు రగిల్తే పెను ముప్పు తప్పదు. ఇలాంటి తరుణంలో అగ్నిప్రమాదాల పట్ల అప్రమత్తంగా ఉండాలని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ సూచించారు. బాచుపల్లి ప్రధాన రహదారిలో మంగళవారం రాత్రి అగ్ని ప్రమాదంలో దగ్ధమైన ఫర్నీచర్ దుకాణాలను బుధవారం హైడ్రా కమిషనర్ పరిశీలించారు. అగ్ని ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. పక్కనే ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ దగ్గర షార్టు సర్క్యూట్ జరిగి నిప్పు రవ్వలు రాలాయని.. అవి ఫర్నీచర్ దుకాణాలకు అంటుకుని మంటలంటుకున్నాయని అక్కడి షాపుల నిర్వాహకులు తెలిపారు. పైన కరెంటు తీగలు వెళ్తున్నాయని.. అందులో ఒక తీగ తెగి మంటలంటుకున్నాయని మరో దుకాణ నిర్వాహకుడు తెలిపారు. కారణాలు ఏవైనా.. వేసవి కాలం ఆరంభమైంది.. అగ్ని ప్రమాదాల పట్ల ఎంతో అప్రమత్తత అవసరమని హైడ్రా కమిషనర్ ఈ సందర్భంగా సూచించారు.

ఎవరికి వారు జాగ్రత్తలు తీసుకోవాలి..

అగ్ని ప్రమాదాలకు ఆస్కారం ఉండే అవకాశాలపై అవగాహన ఉండడం.. వాటి నివారణకు జాగ్రత్తలు తీసుకోవడం అందరూ అలవర్చుకోవాలని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ సూచించారు. తనిఖీలు చేసినంత మాత్రాన అగ్ని ప్రమాదాలను నియంత్రించలేమని, ఫైర్ సేఫ్టీ నార్మ్స్ అందరూ పాటించినప్పుడే ఫలితాలుంటాయని చెప్పారు. ఎన్నో ఏళ్లు కష్టపడి సంపాదించుకున్న ఆస్తులు ఒక్క ప్రమాదంతో బూడిదౌతున్నాయి. ఇక్కడ కూడా ఒక్కో దుకాణంలో రూ. 25 లక్షలకు పైగా ఫర్నీచర్ ఉందని నిర్వాహకులు చెబుతున్నారు. ఇది తీరని నష్టమని హైడ్రా కమిషనర్ చెప్పారు. 22 షాపులకు పైగా బూడిదయ్యాయి. నష్టపరిహారం రెవెన్యూ విభాగం చూస్తుందని, ప్రమాదాలు ముందుండ జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. తనిఖీలతో పాటు ఫైర్ సేఫ్టీ నిబంధనలు పట్టించుకోని వారిపై చర్యలు తీసుకునే అధికారం కూడా హైడ్రాకు కట్టపెట్టాలని ప్రభుత్వానికి నివేదించామని ఈ సందర్భంగా తెలిపారు.

హైదరాబాద్‌లో భారీగా కల్తీ నెయ్యి పట్టివేత

- రూ.18 లక్షలకుపైగా విలువైన కల్తీ నెయ్యి, యంత్రాలు సీజ్
- నిందితుడిని అరెస్టు చేసిన పోలీసులు

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, మార్చి 4: హైదరాబాద్ నగరంలో కల్తీనెయ్యి కలకలం రేపింది. కల్తీ నెయ్యి తయారు చేస్తున్న ఫ్రైడ్ డెయిరీపై సిటీ టాస్క్‌ఫోర్స్, మాసాబ్‌ట్యాంక్ పోలీసులు సంయుక్తంగా దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో భారీగా కల్తీ నెయ్యిని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. కల్తీ నెయ్యి విలువ సుమారు రూ.18 లక్షలు ఉంటుందని సమాచారం. మొత్తం 460 కిలోల కల్తీ నెయ్యి స్వాధీనం చేసుకున్నారు. వనస్పతి నూనె, పామాయిల్, ఇతర రసాయనాలతో దీనిని తయారు చేస్తున్నట్లుగా పోలీసులు గుర్తించారు. ఈ ఘటనలో నిందితుడు జునైద్ హుస్సేన్‌ను అరెస్టు చేశారు.

ఇజ్రాయెల్‌లో తెలుగు వారు సురక్షితం

- తెలంగాణ అసోషియేషన్ ప్రకటన

ప్రతిపక్షం, హైదరాబాద్, మార్చి 4 : ఇజ్రాయెల్‌లో ఉన్న తాము సురక్షితంగా ఉన్నామని ఇజ్రాయెల్ తెలంగాణ అసోసియేషన్ ప్రకటన విడుదల చేసింది. అమెరికా, ఇజ్రాయెల్‌పై ఇరాన్ ప్రతిదాడులు చేస్తోంది. గల్ఫ్ దేశాల్లో ఉన్న అమెరికా మిలటరీ స్థావరాలతో పాటు ఇజ్రాయెల్ పైనా ఇరాన్ దాడులు చేస్తోంది. ఇజ్రాయెల్ సైతం ఇప్పటికే ఎమర్జెన్సీ ప్రకటించింది. తమ దేశ పౌరులు అప్రమత్తంగా ఉండేలా హెచ్చరికలు జారీ చేస్తోంది. ప్రస్తుతం ఇజ్రాయెల్‌లో ఉన్న తమ వారు ఎలా ఉన్నారో అనే ఆందోళనలు ఆయా కుటుంబాల్లో నెలకొన్నాయి. ఈ నేపథ్యంలోనే ఇజ్రాయెల్లో ఉన్న తెలుగువారి పరిస్థితి గురించి ఇజ్రాయెల్ తెలంగాణ అసోషియేషన్అధ్యక్షుడు గంగాధర్ వివరించారు. ఇక్కడ తామంతా సురక్షితంగా ఉన్నామని ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఆయన తెలిపారు.

నూతన దేవాలయ కమిటీ ఎన్నిక

- ఏకగ్రీవంగా రామచంద్రస్వామి నూతన దేవాలయ కమిటీ

ప్రతిపక్షం, హుస్నాబాద్, మార్చి 4: హుస్నాబాద్ పట్టణంలోని శ్రీ శివ భక్త మార్కండేయ స్వామి దేవాలయంలో జరిగిన సమావేశంలో ఆలయ కమిటీ గౌరవ అధ్యక్షులుగా కోమటి సత్యనారాయణ, చైర్మన్ గా వెల్దండి లక్ష్మీపతి, ప్రధాన కార్యదర్శిలుగా వడ్డేపల్లి అరుణ, వడ్డేపల్లి లక్ష్మయ్య, కోశాధికారి గా పంతం కన్యాకుమారి, ప్రత్యేక ఆహ్వానితులుగా బుర్ర రాజయ్య, కొండా లక్ష్మణ్, కొండా రజిత, ముఖ్య సలహాదారులుగా వెల్దండి శివరాజం,వడ్డేపల్లి వెంకటరమణ, గాజుల భగవాన్, ఉపాధ్యక్షులుగా వడ్డేపల్లి బాలయ్య, గోలి వెంకటరమణ, బింగి శ్రీనివాస్, ప్రచార కార్యదర్శిగా చిలుక రాజు, పాము రాజన్న, అలంకరణ వెల్దండి సురేష్, దాసరి రమేష్, దారుణ రజనీకాంత్,పోగుల సుకన్య, కార్యవర్గ సభ్యులుగా కోమటి నారాయణ,కొండి గణపతి, వైద్యం సుధాకర్, భజన మండలి సభ్యులుగా బొద్దుల శ్రావణ్ కుమార్,మాదసు వెంకటనారాయణ, ఎలిగేటి దేవదాసు, చిప్ప రాజేష్, మ్యాన అంజయ్య తదితరులు ఎన్నికయ్యారు. అనంతరం గౌరవ అధ్యక్షులు నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా నూతనంగా ఎంపికైన కార్యవర్గ సభ్యులను సత్కరించారు.

అక్కన్నపేటలో 'కనువిప్పు'

- ప్రజల్లో అవగాహన కల్పించిన పోలీసులు

ప్రతిపక్షం, అక్కన్నపేట, మార్చి 4: ప్రజల్లో చైతన్యం నింపడమే లక్ష్యంగా అక్కన్నపేట మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద 'కనువిప్పు' అవగాహన కార్యక్రమం నిర్వహించబడింది. స్థానిక పోలీస్ యంత్రాంగం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ప్రజల నుండి విశేష స్పందన లభించింది. ఈ కార్యక్రమంలో సబ్ ఇన్‌స్పెక్టర్ ప్రశాంత్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. సమాజంలో జరుగుతున్న వివిధ నేరాలు, సైబర్ మోసాలు మరియు ఇతర సామాజిక అంశాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు. చట్టాలపై అవగాహన కలిగి ఉండటం ద్వారానే నేర రహిత సమాజాన్ని నిర్మించగలమని ఆయన పేర్కొన్నారు. గ్రామాల్లో శాంతిభద్రతల పరిరక్షణ కోసం పోలీసులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటారని, ప్రజలు పోలీసులకు సహకరించాలని ఈ సందర్భంగా ఎస్ ఐ కోరారు.

గడువు ముగిసిన సరుకులతో హోటల్ వ్యాపారం

ప్రతిపక్షం, మొయినాబాద్, మార్చి 4 : మొయినాబాద్ మున్సిపాలిటీ పరిధిలో జేబీఐటి చౌరస్తా సమీపంలో ఉన్న పంచదార హోటల్‌లో ఎక్స్పైర్ అయిన కూల్ డ్రింక్స్, ఆహార పదార్థాలు విక్రయిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. స్థానికుల సమాచారం ప్రకారం, గడువు ముగిసిన సరుకులను వినియోగదారులకు అమ్ముతూ వ్యాపారం నిర్వహిస్తున్నట్లు ఆరోపణలు వచ్చాయి. ఈ విషయం పై సంబంధిత ఫుడ్ సేఫ్టీ అధికారులు దృష్టిసారించి తనిఖీలు నిర్వహించాలని స్థానికులు కోరుతున్నారు. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

హిందుత్వం గురించి మాట్లాడే అర్హత జగన్‌కు లేదు. శ్రీవారి పేరు ఉచ్చరించే నైతికత ఆయనకు లేదు. హిందూ వ్యతిరేకి అయిన జగన్ సీఎంగా ఉన్నాడనే వైవీ, భూమన హిందూ మత ఔన్నత్యాన్ని మంటగలిపారు. నేను చైర్మన్ అయ్యాక టీటీడీని ప్రక్షాళన చేస్తున్నా. అందుకే నాపై ఫేక్ వీడియోలతో తిరుమల ప్రతిష్ఠ దెబ్బతీయాలని చూశావు.

- టీటీడీ చైర్మన్ బీఆర్‌నాయుడు

400 కోట్ల బంగారం ఎక్కడ?

పోలీసుల ఎదుట కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ కగార్ తో మావోయిస్టు పార్టీ కుదేలైపోయింది. ఇప్పటికే వందలాది మంది మావోలు మృత్యువాత పడగా, పలువురు అగ్రనేతలు పోలీసులు ఎదుట లొంగిపోయారు. దేవ్‌జీ, మల్ల రాజిరెడ్డి, మల్లోజుల వేణుగోపాల్, ఆశన్న, నరసింహారెడ్డి వంటి అగ్రనేతలంతా లొంగిపోవడంతో ఇక ఆ పార్టీ దేశంలో కనుమరుగవ్వడం ఖాయమనే ప్రచారం సాగుతోంది. ఈ క్రమంలో వారు పార్టీ కోసం సేకరించిన డబ్బు, నగలు ఎక్కడున్నాయనే విషయంలో పెద్ద ఎత్తున చర్చ సాగుతోంది. కేవలం డబ్బు, బంగారమే కాకుండా మావోయిస్టులకు సంబంధించిన పలు విలువైన డ్యాక్యుమెంట్లు, ఆధునిక ఆయుధాలు అడవుల్లో రహస్య ప్రదేశాల్లో దాచి ఉంచినట్లు ప్రచారం సాగుతోంది. వాటి వివరాలను సేకరించడం కోసం కేంద్ర దర్యాప్తు సంస్థలు మావోయిస్టు పార్టీ అగ్రనేతలను తీవ్రంగా ప్రశ్నిస్తున్నట్లు తెలుస్తోంది. మావోయిస్టుల్లో అగ్రనేతలుగా ఉన్నవారంతా ప్రస్తుతం పోలీసుల సమక్షంలో ఉన్నారు. దీంతో పార్టీ నిధులు, నిల్వల గురించి వారికి తెలిసి ఉంటుందన్న కోణంలో విచారిస్తున్నట్లు తెలుస్తోంది. దీనికోసం కేంద్ర నిఘా సంస్థలు ఇప్పటికే హైదరాబాద్ చేరుకున్నాయి. కేంద్ర నిఘా వర్గాలకు చెందిన ఇంటెలిజెన్స్ బ్యూరో (ఐబీ), నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ (ఎన్ఐఏ), రిసెర్చ్ అండ్ అనాలిసిస్ వింగ్ (రా), ఆర్మీ ఇంటెలిజెన్స్‌తో పాటు కేంద్ర సాయుధ బలగాలకు చెందిన సీఆర్‌పీఎఫ్, సీఐఎస్ఎఫ్ తదితర బృందాలు ఇప్పటికే వారిని పలు విషయాలపై ప్రశ్నిస్తున్నాయి. గడచిన ఆరు నెలల కాలంలో మావోయిస్టు పార్టీకి చెందిన అగ్రనేతలు ఒక్కరొక్కరుగా లొంగిపోతున్న విషయం తెలిసిందే. వారు లొంగిపోతున్న సమయంలో కొంతమది నేతలు తమ వద్ద ఉన్న ఆయుధాలు, నగదు, డబ్బు పార్టీ అధిష్టానానికి అప్పగించి వచ్చినట్లు చెబుతున్నారు. మరికొంతమంది ఆయుధాలతో లొంగిపోయినప్పటికీ పార్టీకి చెందిన నిధులు, బంగారం మాత్రం అడవుల్లో ఉన్న క్యాడర్ కు అప్పగించి వచ్చినట్లు చెబుతున్నారు. ఇటీవల లొంగిపోయిన కేంద్ర కమిటీ సభ్యులు, పొలిట్‌బ్యూరో మెంబర్ మల్లోజుల వేణుగోపాల్ ఇటీవల ఒక ఇంటర్వ్యూలో ఈ విషయాన్ని స్పష్టం చేశారు. తాము ఆయుధాలతో విప్లవం రాదు అని నమ్మాం కనుక తమ వద్ద ఉన్న ఆయుధాలతో లొంగిపోయామని, అయితే ఇంకా పార్టీలో ఉన్న క్యాడర్ అడవుల్లో ఉండి పోరాడేందుకు సిద్ధంగా ఉండటంతో తన వద్ద ఉన్న ఆరుకోట్ల రూపాయల నగదు, ఆరు కిల్లో బంగారం పార్టీ నేతలకు అప్పగించి వచ్చినట్లు స్పష్టం చేశారు. ఇటీవలి కాలంలో మావోయిస్టు అగ్రనేతల్లో ఒకరు, పీఎల్‌జీఏ కమాండర్ అయిన బార్సేదేవాను పోలీసులు పట్టుకున్న విషయం తెలిసిందే. ఆ సమయంలో తెలంగాణ చరిత్రలోనే మొదటి సారిగా మావోయిస్టు డంప్ నుంచి రూ.20 లక్షల నగదును పోలీసులు స్వాధీనం చేసుకోవడం గమనార్హం. అలాగే 48 అత్యంత అధునాతన ఆయుధాలు పోలీసులకు మావోయిస్టులు అప్పగించారు. మావోయిస్టులు కొవిడ్ సమయంలో తమ వద్ద ఉన్న కోట్లాది రూపాయల నగదును బంగారం రూపంలోకి మార్చినట్లు తెలుస్తోంది. ఝార్ఖండ్, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, తెలంగాణ, ఒడిసా, ఏపీ తదితర రాష్ట్రాల్లోని కాంట్రాక్టర్లు, వ్యాపారవేత్తల నుంచి మావోయిస్టులు పార్టీ ఫండ్ సేకరించినట్లు తెలుస్తోంది. ఈ మొత్తాన్ని కేంద్ర కమిటీకి పంపిస్తుంటారు. పార్టీకి నిధుల సేకరించడానకి విస్తృత నెట్‌వర్క్ ఉందని జాతీయ విచారణ సంస్థ (ఎన్ఐఏ) ధృవీకరించింది. ఈ క్రమంలోనే సుమారు రూ.400 కోట్ల విలువైన నగదును బంగారం రూపంలోకి మార్చినట్లు తెలుస్తోంది. అయితే అది ఎవరివద్ద ఉందనేది ప్రస్తుతం సస్పెన్స్..ఇక బీజాపూర్ పోలీసులు మూల్‌వాసీ బచావో మంచ్ (ఎంబీఎం) సభ్యులు ఇద్దరు మావోయిస్టుకు పార్టీకి చెందిన బ్యాంకు ఖాతాలో రూ.6 లక్షలు డిపాజిట్ చేస్తుండగా అరెస్టు చేశారు. మావోయిస్టు పార్టీ నోట్ల మార్పిడి సమయంలో తీవ్రంగా నష్టపోయినట్లు పార్టీ అగ్రనేతలు చెబుతున్నారు. సుమారు రూ.200 కోట్ల వరకు పాత నోట్లను మార్పిడి చేసేందుకు పార్టీ అగ్రనాయకత్వం ప్రయత్నించినట్లు తెలుస్తోంది.ఈ క్రమంలో కొంతమొత్తాన్ని మార్చినప్పటికీ మిగతది సాధ్యం కాలేదని చెబుతున్నారు. దీన్ని అగ్రనేత ఒకరు దృవీకరించారు కూడా. మావోయిస్టు పార్టీ వద్ద సుమారు 400 కిలోల బంగారం ఉండి ఉంటుందని దర్యాప్తు సంస్థలు అనుమానిస్తున్నాయి. బంగారాన్ని అంతా అడవుల్లోని డంపు ల్లో దాచి ఉండటారని కేంద్ర, రాష్ట్ర నిఘా వర్గాలు అనుమానిస్తున్నాయి. దాదాపు రూ.500 కోట్ల బంగారం మావోయిస్టు పార్టీ వద్ద ఉందనే అనుమానంతో ఆయా సంస్థలు మావోయిస్టులను ప్రశ్నిస్తున్నాయి. అయితే పార్టీ అగ్రనేతలు పార్టీ నిలువల గురించి నోరు తెరుస్తారా? లేదా అనేది ప్రస్తుతం మిలియన్ డాలర్ల ప్రశ్న.

ప్రతిపక్షం
హైదరాబాద్
గురువారం
05.03.2026

ఇన్వెస్ట్ ఇన్ ఉమెన్, ఏక్సిలరేట్ ప్రోగ్రెస్

అంతర్జాతీయ మహిళా దినోత్సవం, 8 మార్చి 2024 (IWD 2023) యొక్క థీమ్, ''ఇన్వెస్ట్ ఇన్ ఉమెన్, ఏక్సిలరేట్ ప్రోగ్రెస్'' అన్నది 2024 మహిళా దినోత్సవ థీమ్. ఇన్నోవేషన్ అండ్ టెక్నాలజీ ఫర్ లింగ సమానత్వం ఈ థీమ్ మహిళల స్థితిగతులపై కమిషన్ (CSW-67) చర్చలు జరపనుంది ఆవిష్కరణ మరియు సాంకేతిక మార్పు మరియు డిజిటల్ యుగంలో లింగ సమానత్వం మరియు మహిళలందరి సాధికారత సాధించడం కోసం విద్య మరియు అమ్మాయిలు ఈ సంవత్సరం అంతర్జాతీయ మహిళా దినోత్సవం థీమ్ ఎంబ్రేస్ ఈక్విటీ అంటే లింగ సమానత్వంపై దృష్టి పెట్టండిని ఆర్థాన్ని ఇస్తుందిస్త్రీలు సమాజంలో బహుముఖ పాత్రను నిర్వర్తించాల్సి ఉంటుంది ,

డా:కృష్ణ సామల్ల
9705890045

అంతర్జాతీయ మహిళా దినోత్సవం కార్మిక ఉద్యమం నుంచి పుట్టుకొచ్చింది. దీనిని ఐక్యరాజ్య సమితి గుర్తించి, ఏటా నిర్వహిస్తోంది. దీని పుట్టుకకు బీజాలు 1908లో పడ్డాయి. తక్కువ పనిగంటలు, మెరుగైన జీతం, ఓటు వేసే హక్కు కోసం న్యూయార్క్ సిటీలో 15 వేల మంది మహిళలు ప్రదర్శన చేశారు. ఈ మహిళల డిమాండ్లను దృష్టిలో పెట్టుకుని అమెరికాలోని సోషలిస్టు పార్టీ 1909వ సంవత్సరంలో జాతీయ మహిళా దినోత్సవాన్ని ప్రకటించింది. మగువా మగువా లోకానికి తెలుసా నీ విలువా..మగువా మగువా నీ సహనానికి సరిహద్దులు కలవా ఈ పాట వింటుంటే కళ్ళు చెమర్చక తప్పదు ,సుడిగుండాల కష్టాలు ,అణిచివేతకు ఆనవాళ్లు ,దాసి వ్యవస్తకు నిదర్శనమ్ అయినా మగువ నేడు ఆ నారి ఏ భేరి మోగిస్తుంది మెగ జాతి పెత్తనాన్ని పంటి కింద బిగబట్టుకొని కంట నీరుతో అందురన్న ఒంటరి మనస్తత్వంతో మనుగడ సాగిస్తుంది.అన్నింట్లో సగం అయినా వనిత నేడు ఎందుకు వంచించ బడుతుంది తండ్రి లేని కుటుంబాలెన్నో నిలబడ్డాయి కానీ తల్లి ప్రేమ లేని ప్రపంచం మనుగడ సాగినసాగించదు ఈ భరత మాత దేశం లో అంటే అతిశయోక్తి లేదు. అవిద్య, నిరుద్యోగం, వంశపారంపర్యంగా కుటుంబంలో కొనసాగుతున్న హింస తదితర కారణాల వల్లనే పలు ఆసియా పసిఫిక్ దేశాల్లో గృహ హింసకు ఆమోదం లభిస్తోందని ఐక్యరాజ్యసమితి అభిప్రాయపడింది. కాగా, ప్రపంచవ్యాప్తంగా ఉన్న పరిస్థితులను పరిగణనలోకి తీసుకుంటే నిరుడి కంటే మహిళలపై గృహ హింస తగ్గిందని, ఆమోదం ఉన్న ఆసియా పసిఫిక్ దేశాల్లో కూడా తగ్గుముఖం పడుతోందని, భవిష్యత్తులో ఇది మరింత తగ్గుతుందని ఐక్యరాజ్యసమితి ఆశాభావం వ్యక్తం చేసింది. మహిళలు లేకపోతే దేశ అభివృద్దే ఉండదు. అలాంటి స్త్రీలను గౌరవించేందుకు ప్రతి సంవత్సరం మార్చి 8న మహిళ దినోత్సవాన్ని జరుపుకుంటున్నారు. అంతేకాకుండా అంతర్జాతీయ మహిళా దినోత్సవం జరుపుకోవడానికి చాలా కారణాలున్నాయి. అవేంటో ఇప్పుడు తెలుసుకుందాం సమాజంలో దేశ అభివృద్ధిలో పురుషులతో పాటు సమానంగా మహిళలు కూడా సహాయపడుతున్నారు. వరకట్నం, ఆడ భ్రూణహత్యలు, గృహహింస, వారసత్వ నిరాకరణ, అత్యాచారం,అమ్మకం మరియు ఆడపిల్లల అక్రమ రవాణా వంటి సవాళ్లను మహిళలుఎదుర్కోవాల్సి వస్తుంది . సమాజంలో మహిళల స్థాయి పెంపునకు ఎన్నోసామజిక సంఘాలు కృషి చేస్తున్నారు. అయినప్పటికీ, సమాజంలో మహిళలపై కొన్ని ప్రధాన అణచివేతలు ఉన్నాయి, అవి క్లుప్తంగా వరకట్న మరణాలుఆడపిల్లల సంఖ్య తక్కువ భారతదేశం వంటి అభివృద్ధి చెందుతున్న దేశాలలో, జనాభాలో పురుషులతో పోలిస్తే స్త్రీల నిష్పత్తి అనుమానాస్పదంగా తక్కువగా ఉంది. భారతదేశంలోని వివిధ రాష్ట్రాల్లో లింగ నిష్పత్తి మహిళలపై లైంగిక నేరాలకు ప్రధాన కారణాలలో ఒకటి. పిల్లలను, ముఖ్యంగా తక్కువఆదాయ కుటుంబాల నుండి వచ్చిన అమ్మాయిలను, బ్రోకర్లు అమ్ముతున్నారు,



ముఖ్యంగా ఉత్తర భారతదేశంలో, అసమతుల్య లింగ నిష్పత్తి సమస్య చాలా స్పష్టంగా కనిపిస్తుంది. ఇది కాకుండా, వారి వివాహ గృహాల నుండి మహిళలు అదృశ్యమైన సందర్భాలు ఎన్నో ఉన్నాయి, భారతదేశంలో, వారి వివాహ గృహంలో మహిళల వరకట్న మరణాలు గత కొన్ని సంవత్సరాలుగా పెరిగాయి, ఇది చాలా తీవ్రమైన సమస్య. భారతదేశంలోని నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో వరకట్నం కోసం హత్య చేయబడిన నూతన వధువుల గణాంకాలను వెల్లడించింది ఇందులో క్రైమ్ రికార్డు చుస్తే ఆడపిల్ల లకు భద్రత డొల్లే అనిపిస్తుంది . భారతీయ శిక్షాస్మృతిలోని సెక్షన్ 498A వైవాహిక క్రూరత్వానికి కారణమైన వ్యక్తికి సంబంధించింది అయినప్పటికీ,కేసులు పెరుగుతున్నాయి లేదా సకాలంలో నమోదు కావు. వరకట్న నిషేధ చట్టంపై ప్రస్తుతం వరకట్నం తీసుకోవడం మరియు ఇవ్వడం నేరంగా పరిగణించబడుతుంది. అయితే, చాలా రాష్ట్రాల్లో వరకట్న నిషేధ అధికారులు లేరని లేదా వారు ఇచ్చిన మరియు స్వీకరించిన వస్తువుల రికార్డును నిర్వహించడం తప్పనిసరి చేయడం లేదని గమనించబడింది. దేశీయ దురాక్రమణకు కారణం భారతీయ సమాజం యొక్క పితృస్వామ్య స్వభావం, ఇంట్లో ఇటువంటి హింసను సమర్ధించే స్వభావం మగ జీవితం నర నరాల్లో పేరుకుపోయింది. పనికార్యాలయంలో మహిళలపై లైంగిక వేధింపులపై చొరవ 1997లో సుప్రీం కోర్టు విశాల మార్గదర్శకాలతో ప్రారంభమైంది. అయితే, పని ప్రదేశంలో మహిళలపై లైంగిక వేధింపుల (నివారణ, నిషేధం మరియు పరిష్కారం) చట్టాన్ని ఆమోదించడం వీటిని అనువదించడంలో న్యాయవయవస్థ సరిగా స్పందించడం లేదని అనుభవజ్ఞుల మాట . అమలు చేయాల్సిన నిర్దిష్ట మార్గదర్శకాలు ఉన్నప్పటికినీ . కానీ నేటికీ, లైంగిక వేధింపుల సమస్య భారతదేశంలో ఎక్కువగా కొట్టుకుపోయింది. లైంగిక వేధింపులతో సంబంధం ఉన్న సామాజిక నిషేధాల కారణంగా ఈ నిబంధనలు ఎప్పుడూ విజయవంతంగా అమలు చేయబడలేదు.

మహిళలపై సామాజిక హింస:

భారతదేశంలోని చాలా చోట్ల కమ్యూనిటీలు మరియు సమాజాలు పితృస్వామ్య సూత్రప్రాయ విశ్వంతో ముడిపడి ఉన్నాయి, దాని నుండి మహిళలు నిజమైన న్యాయం పొందలేరు. గ్రామ సంఘాలు, మతపరమైన సంఘాలు లేదా వృత్తిపరమైన సంస్థలు వంటి కృత్రిమ సంఘాలు స్త్రీ పురుషుల మధ్య సమానత్వానికి సారాంశం కాదు. భారతదేశంలో గత పదేళ్లలోఅత్యాచార కేసుల సంఖ్య గణనీయంగా పెరిగింది. నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో ప్రకారం, రాష్ట్రంలో ప్రతి 3వ రోజు సుమారు 25000 అత్యాచార కేసులు నమోదవుతున్నాయి. భారతదేశంలో, గ్రామీణ ప్రాంతాలలో, ముఖ్యంగా ఉత్తర భారతదేశంలో, అగ్రవర్ణ ప్రజలు అట్టడుగు కులాల సమూహాల సభ్యులపై అధికారాన్ని కలిగి ఉండటానికి ఒక వ్యూహంగా సామూహిక అత్యాచారాలను ఉపయోగిస్తారు.

మహిళా దినోత్సవం 2024 థీమ్:

అంతర్జాతీయ మహిళా దినోత్సవం, 8 మార్చి 2024 (IWD 2023) యొక్క థీమ్, ''ఇన్వెస్ట్ ఇన్ ఉమెన్, ఏక్సిలరేట్ ప్రోగ్రెస్'' అన్నది 2024 మహిళా దినోత్సవ థీమ్. ఇన్నోవేషన్ అండ్ టెక్నాలజీ ఫర్ లింగ సమానత్వం ఈ థీమ్ మహిళల స్థితిగతులపై కమిషన్ (CSW67) చర్చలు జరపనుంది ఆవిష్కరణ మరియు సాంకేతిక మార్పు మరియు డిజిటల్ యుగంలో లింగ సమానత్వం మరియు మహిళలందరి సాధికారత సాధించడం కోసం విద్య మరియు అమ్మాయిలు ఈ సంవత్సరం అంతర్జాతీయ మహిళా దినోత్సవం థీమ్ ఎంబ్రేస్ ఈక్విటీ అంటే లింగ సమానత్వంపై దృష్టి పెట్టండిని ఆర్థాన్ని ఇస్తుందిస్త్రీలు సమాజంలో బహుముఖ పాత్రను నిర్వర్తించాల్సి ఉంటుంది , అంటే కుటుంబానికి అన్నదాతగా, సంరక్షకురాలిగా, తల్లిగా, భార్యగా, కూతురిగా మరియు సమాజానికి సేవా ప్రదాతగా. ఈ వాస్తవం ఉన్నప్పటికీ, దేశ అభివృద్ధికి మహిళల సహకారం ఎనలేనిది , ఇన్ని కానీ ఇప్పటికీ, లింగం ఆధారంగా వివక్ష చూపబడింది, మనస్సుల్లో మార్పు రానంత వరకు మహిళ ల పైన వివిక్ష అణిచివేతకు ఆనవాళ్లు ఉంటూనే ఉంటాయి.

(వ్యాసకర్త ప్రొఫెసర్ & ఫ్రీ లాన్స్ జర్నలిస్ట్)

ప్రపంచ నూనె సరఫరాకు 'గొంతు' హార్మూజ్

కాలగిరి శ్రీనివాస్ రెడ్డి
9010128884

హార్మూజ్ సముద్ర సందు ప్రపంచంలో అతి ముఖ్యమైన జలమార్గాల్లో ఒకటి. ఇరాన్ ఉత్తర భాగంలో, ఒమన్ దక్షిణ భాగంలో ఉంది.పర్షియా గల్ఫ్‌ను ఒమన్ గల్ఫ్, అరేబియా సముద్రంతో కలిపే ఇరుకైన మార్గం. అత్యంత ఇరుకైన చోట కేవలం 33 కిలోమీటర్ల వెడల్పు మాత్రమే ఉంది. ఇది ఒక చిన్న సందు కావడం వల్లే ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు 'గొంతు' లాంటిది. ఏ చిన్న అడ్డంకి వచ్చినా ప్రపంచ నూనె ధరలు ఆకాశాన్నంటుతాయి. ఇప్పుడు జరుగుతున్న అమెరికాఇజ్రాయెల్ దాడుల తర్వాత ఇరాన్ రెవల్యూషనరీ గార్డ్స్ మార్చి 2న ఈ సందును మూసివేస్తున్నామని ప్రకటించింది. ఏ ఓడా ఈ సందు నుండి వెళ్లినా దాడి చేస్తామని హెచ్చరించింది. ఫలితం? వాణిజ్య ఓడలు ఆగిపోయాయి. పెద్ద షిప్పింగ్ కంపెనీలు రవాణా ఆపేశాయి. ట్యాంకర్లు దాదాపు జీరోకి తగ్గాయి. కొన్ని ట్యాంకర్లపై దాడులు జరిగి 5కి పైగా ఓడలు దెబ్బతిన్నాయి. 150కి పైగా ఓడలు ఆగిపోయాయి. సందు వాస్తవంగా మూసివేయబడింది.

ఎందుకు ఇంత ముఖ్యమైనది?

ప్రతి రోజూ సుమారు 20 మిలియన్ బ్యారెల్స్ ముడి నూనె, ఇతర ఇంధనాలు ఈ సందు గుండా ప్రపంచానికి వెళ్తాయి. ఇది ప్రపంచ మొత్తం నూనె వినియోగంలో సుమారు 20 శాతానికి సమానం. సముద్ర మార్గంలో వచ్చే నూనెలో 2530 శాతం ఇక్కడి నుంచే వస్తుంది. ద్రవ గ్యాస్ (ఎల్ఎన్‌జీ)లో కూడా సుమారు 20 శాతం ఈ మార్గం గుండా వెళ్తుంది. గల్ఫ్ దేశాలు - సౌదీ అరేబియా, ఇరాక్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, కువైట్, ఖతార్, ఇరాన్ - వీటి నూనె ఎగుమతులు దాదాపు అన్నీ ఇక్కడి గుండానే వెళ్తాయి. ఆసియా దేశాలు ఎక్కువగా ఆధారపడతాయి. చైనా అత్యధికం, ఆ తర్వాత భారత్, జపాన్, దక్షిణ కొరియా. ఈ సందు ద్వారా వెళ్లే నూనెలో 84 శాతం ఆసియాకు వెళ్తుంది. ఇరాన్ ఉత్తర భాగాన్ని నియంత్రిస్తుంది కాబట్టి దాడి చేసి లేదా హెచ్చరించి సందును నియంత్రించగలదు. ఇది ఇరాన్‌కు పెద్ద వ్యూహాత్మక ఆయుధం. గతంలో కూడా ఇరాన్ ఇలాంటి హెచ్చరికలు చేసింది. కానీ ఈసారి వాస్తవంగా అమలు చేసింది. దీని వల్ల ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు తీవ్రమైన దెబ్బ తగులుతోంది. నూనె ధరలు ఇప్పటికే 7 నుంచి 13 శాతం పెరిగాయి. $100కి చేరే అవకాశం ఉంది.

భారత్‌కు ఎంత ప్రమాదం?

మన దేశం 85-90 శాతం నూనె విదేశాల నుంచి తీసుకుంటుంది. అందులో సగం కంటే ఎక్కువ (సుమారు 50 శాతం) ఈ సందు గుండా వస్తుంది - రోజుకు 1.5 నుంచి 2.7 మిలియన్ బ్యారెల్స్. ఇరాక్, సౌదీ అరేబియా, యుఏఈ, కువైట్ నుంచి వచ్చే నూనె దాదాపు అన్నీ ఇక్కడి గుండానే. దీంతో పాటు వంట గ్యాస్ (ఎల్‌పీజీ)

లో 85 శాతం, ద్రవ గ్యాస్ (ఎల్ఎన్‌జీ)లో 55 శాతం ఈ మార్గం గుండా వస్తాయి. సందు మూసివేత కొనసాగితే మన నూనె స్టాక్ కేవలం 40-45 రోజులకు సరిపోతుంది. పెట్రోల్, డీజిల్, వంట గ్యాస్ ధరలు భారంగా పెరుగుతాయి. ద్రవ్యోల్బణం పెరిగి సామాన్యుల జీవన ఖర్చు ఎక్కువవుతుంది. రూపాయి విలువ తగ్గుతుంది. వాణిజ్య లోటు పెరుగుతుంది. ఇది కేవలం నూనె సమస్య కాదు. ఎగుమతులు ఆలస్యమవుతాయి. షిప్పింగ్ ఖర్చులు పెరుగుతాయి. గల్ఫ్‌లో పని చేసే 90 లక్షల మంది మనవాళ్ల భద్రత, సంపాదన ప్రమాదంలో పడతాయి. దీర్ఘకాలంలో ఆర్థిక వ్యవస్థపై భారీ ఒత్తిడి పడుతుంది.

ఇరాన్ వ్యూహం ఎందుకు పని చేస్తోంది?

ఇరాన్‌కు ఇది ఏకైక ఆయుధం. అణు శక్తి, సైనిక బలం తక్కువైనా ఈ సందుతో ప్రపంచాన్ని బెదిరించగలదు. అమెరికా నావల్ ఫోర్సెస్ ట్యాంకర్లను రక్షించడానికి సిద్ధమవుతున్నాయి కానీ పరిస్థితి ఇంకా ప్రమాదకరంగా ఉంది. ఇలాంటి చోక్‌పాయింట్లు (ఇరుకైన మార్గాలు) ఎంత బలహీనమైన దేశానికైనా పెద్ద శక్తిని ఇస్తాయని ఇది నిరూపిస్తోంది.

భారత్ ఏం చేయాలి?

తక్షణం రష్యా నుంచి నూనె ఎక్కువ తీసుకోవడం ఒక ప్రత్యామ్నాయం. మన వ్యూహాత్మక నూనె నిల్వలను (SPR) ఉపయోగించాలి. దీర్ఘకాలంలో నూనె దిగుమతులను వైవిధ్యపరచాలి. సౌర శక్తి, గాలి శక్తి వంటి ప్రత్యామ్నాయ ఇంధనాలపై ఎక్కువ దృష్టి పెట్టాలి. ఇరాన్ యుద్ధం మనకు ఒక పెద్ద హెచ్చరిక - ఎనర్జీ భద్రతను స్వయం సమృద్ధిగా మార్చుకోవాలి.

శాంతి మాత్రమే ఏకైక మార్గం

హార్మూజ్ సముద్ర సందు మూసివేత ప్రపంచానికి పెద్ద సంక్షోభం తెచ్చింది. భారత్ వంటి దేశాలు ఇంధన ధరల పెరుగుదలతో ఆర్థికంగా దెబ్బతింటున్నాయి. ఇరాన్ యుద్ధం విస్తరిస్తే మూడో ప్రపంచ యుద్ధం అంచుకు వచ్చే ప్రమాదం ఉంది. ఐక్యరాజ్యసమితి ద్వారా తక్షణం సంభాషణలు జరిపి యుద్ధాన్ని ఆపాలి. సందు తెరవాలి. యుద్ధం కొనసాగితే ఎవరికీ లాభం లేదు - ప్రపంచమంతా నష్టపోతుంది. శాంతి, సంభాషణలు, దౌత్యం ద్వారా మాత్రమే ఈ సంక్షోభాన్ని అధిగమించాలి. భారత్ ఈ విషయంలో నాయకత్వం వహించాలి!

(వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్)

ఆధిపత్య రాజకీయాలకు కొత్త పరీక్ష?

ఫిరోజ్ ఖాన్
9640466464

పశ్చిమ ఆసియా మరోసారి అంతర్జాతీయ రాజకీయాల దృష్టిని ఆకర్షించే కీలక మలుపులో నిలిచింది. ఇరాన్-ఇజ్రాయెల్ మధ్య పెరుగుతున్న వ్యూహాత్మక ఉద్రిక్తతలు, గాజా యుద్ధానంతర పరిణామాలు, గల్ఫ్ ప్రాంత భద్రతా సమీకరణాల్లో కనిపిస్తున్న కదలికలు.. ఇవి కలిసి ప్రాంతీయ శక్తి సమతుల్యతను కొత్త దిశగా మలుస్తున్నాయి. గతంలో పరోక్షంగా సాగిన ప్రతిస్పర్ధ ఇప్పుడు బహిరంగ ప్రకటనలు, దౌత్య హెచ్చరికలు, రక్షణ రంగ చురుకుదనం రూపంలో మరింత స్పష్టత పొందుతోంది. అంతర్జాతీయ వేదికలపై పరస్పర ఆరోపణలు, మిత్రదేశాల వ్యూహాత్మక సమన్వయ చర్చలు వేగం పుంజుకోవడం పరిస్థితికి రాజకీయ తీవ్రతను జోడిస్తోంది. ఇంధన సరఫరా మార్గాల భద్రత, సముద్ర మార్గాల పర్యవేక్షణ, సాంకేతిక ఆధిపత్య పోటీ వంటి అంశాలు ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై కూడా ప్రభావం చూపే అవకాశాలుగా చర్చకు వస్తున్నాయి. ఈ పరిణామాలన్నీ కలిసి పశ్చిమ ఆసియాను కేవలం ప్రాంతీయ సంఘర్షణల వేదికగానే కాక, గ్లోబల్ శక్తుల వ్యూహపరమైన ప్రయోగశాలగా మలుస్తున్నాయనే అభిప్రాయాన్ని బలపరుస్తున్నాయి.

దాడి వర్సెస్ రక్షణ

దశాబ్దాలుగా ఆర్థిక ఆంక్షలను ఎదుర్కొంటున్న ఇరాన్, రక్షణ రంగంలో స్వయం సమృద్ధి సాధించాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నట్లు ప్రకటిస్తోంది. డ్రోన్ సాంకేతికత, దీర్ఘశ్రేణి క్షిపణి వ్యవస్థలు, అధిక వేగ ఆయుధాల అభివృద్ధి వంటి అంశాలు అంతర్జాతీయ చర్చకు వస్తున్నాయి. అయితే ఈ సామర్థ్యాలపై లభ్యమవుతున్న వివరాలు ప్రధానంగా అధికారిక ప్రకటనలు, మీడియా నివేదికల ఆధారంగానే ఉన్నందున, వాటిని విశ్లేషణాత్మక దృష్టితో చూడాల్సిన అవసరం ఉందని భద్రతా నిపుణులు సూచిస్తున్నారు. ఇజ్రాయెల్ తన బహుళస్థాయి రక్షణ వ్యవస్థలపై విశ్వాసాన్ని వ్యక్తం చేస్తోంది. ఆధునిక యుద్ధాల్లో దాడి-రక్షణ సాంకేతిక పోటీ నిరంతరం మారుతూ ఉండటం సహజమని రక్షణ విశ్లేషకులు చెబుతున్నారు. ఎటువంటి రక్షణ వ్యవస్థ శాతం వంద భద్రతను హామీ ఇవ్వలేనట్లే, దాడి సామర్థ్యాల ప్రభావం కూడా అనేక పరిస్థితులపై ఆధారపడి ఉంటుందని వారు గుర్తుచేస్తున్నారు. ఈ పోటీ ప్రాంతీయ భద్రతా సమీకరణాలను మరింత సున్నితంగా మారుస్తోంది.

బహుళ ధృవ ప్రపంచం

పశ్చిమ ఆసియాలో అమెరికా పాత్ర కూడా పరిణామక్రమంలో మారుతున్నట్లు కనిపిస్తోంది. గతంలో ప్రత్యక్ష సైనిక జోక్యం ప్రధానంగా కనిపించగా, ప్రస్తుతం దౌత్యపరమైన

ఒత్తిడి, ఆంక్షలు మరియు మిత్రదేశాల సమన్వయం ద్వారా ప్రభావాన్ని కొనసాగించే ప్రయత్నం స్పష్టమవుతోంది. ఇది ఆధిపత్య రాజకీయాల నుంచి నియంత్రిత సమతుల్యత వైపు కదులుతున్న సంకేతంగా భావించవచ్చు. రష్యా, చైనా దేశాలతో ఇరాన్ పెంచుకుంటున్న సంబంధాలు ప్రపంచ రాజకీయాల్లో కొత్త సమీకరణాలకు దారి తీస్తున్నాయి. ముఖ్యంగా చైనా మధ్యవర్తిత్వంతో ప్రాంతీయ ప్రత్యర్థుల మధ్య సంభాషణలు పునఃప్రారంభం కావడం గమనార్హం. ప్రపంచ వ్యవస్థ క్రమంగా బహుళ ధృవ నిర్మాణం వైపు పయనిస్తోందనే అభిప్రాయాలు బలపడుతున్నాయి.

శాంతి దిశగా అవసరమైన మార్గం

అణు ఒప్పంద భవిష్యత్తు ఇంకా స్పష్టత పొందలేదు. యురేనియం శుద్ధి స్థాయిలపై అంతర్జాతీయ పర్యవేక్షణ సంస్థలు వ్యక్తం చేస్తున్న ఆందోళనలు, దౌత్య చర్చల్లో పురోగతి లేకపోవడం, ఇవి ప్రాంతీయ ఉద్రిక్తతలను పూర్తిగా తగ్గనివ్వడం లేదు. చిన్న ఘటన కూడా విస్తృత ప్రభావం చూపే అవకాశముందని విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు. ప్రస్తుత పరిణామాలు ఒక స్పష్టమైన సందేశాన్ని ఇస్తున్నాయి. యుద్ధం ఎవరికీ శాశ్వత విజయం ఇవ్వదు. శక్తి ప్రదర్శనలు తాత్కాలిక ప్రభావం చూపవచ్చు; కానీ దీర్ఘకాలిక స్థిరత్వం కోసం సంభాషణ, పరస్పర గౌరవం, వ్యూహాత్మక సమన్వయం అవసరం. పశ్చిమ ఆసియా భవిష్యత్తు ఆయుధాల గర్జనలో కాదు, దౌత్య మార్గాల్లోనే స్థిరపడే అవకాశం ఉంది. శాంతి అనేది బలహీనత కాదు, అది రాజకీయ పరిపక్వతకు ప్రతీక.

(వ్యాసకర్త ఫ్రీలాన్స్ జర్నలిస్ట్)

రచయితలకు మనవి

ప్రతిపక్షం ఎడిట్ పేజీ 'ఓపెన్ వాయిస్'కు, సాహిత్య పేజీ 'బహుళ'కు తమ రచనలు పంపగోరువారు ఈ కింది చిరునామాకు పంపించగలరు. వీలును బట్టి ప్రచురించగలము. పుస్తక సమీక్షకులు మా చిరునామాకు పోస్టు ద్వారా గానీ, కొరియర్ ద్వారా గానీ రెండు పుస్తకములు తప్పక పంపించగలరు.

రచనలు పంపాల్సిన చిరునామా

ppbahula@gmail.com
9010223917

ADRESS
Editor,
Prathipaksham,
Telugu Daily
8-1-284/
OU/521/7/9,
OU Colony,
Shaikpet,
Hyderabad,
Telangana
500008

ప్రాంతీయం

గాంధీ విగ్రహానికి అవమానం

- రాందాస్ చౌరస్తాలో రాస్తారోకో

ప్రతిపక్షం ప్రతినిధి, మెదక్, మార్చి 04 : మెదక్ జిల్లా కేంద్రంలోని రాందాస్ చౌరస్తా వద్ద గల జాతిపిత మహాత్మా గాంధీ విగ్రహానికి గుర్తు తెలియని దుండగులు పశువుల పేడ పోయడం పట్ల కాంగ్రెస్ ఆర్యవైశ్య నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. నల్ల బ్యాడ్జీలు పెట్టుకుని చౌరస్తాలో రాస్తారోకో నిర్వహించారు దుండగులను వెంటనే పట్టుకోవాలని వారిని బహిరంగంగా శిక్షించాలని వారు డిమాండ్ చేస్తూ నినాదాలు చేశారు ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకుడు మెదక్ మున్సిపల్ వైస్ చైర్మన్ దొంతి నరేష్ గౌడ్ కాంగ్రెస్ నాయకులు భూపతి రాజ్ మాజీ మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్ మాట్లాడుతూ. మహాత్మా గాంధీ విగ్రహాన్ని అవమానించడం అంటే ఈ దేశ ప్రజలను అవమానించడం అని పశువుల పేడ పోయడం దుర్మార్గమైన చర్య అని దీనిని పట్టణ ప్రజలందరూ తీవ్రంగా ఖండించాలని వారు అన్నారు ఈ ఘాతుకానికి పాల్పడ్డ వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం గాంధీ విగ్రహాన్ని శుద్ధి చేసి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు అనంతరం మెదక్ పట్టణ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు సంఘటన స్థలానికి చేరుకున్న సిఐ మహేష్ మాట్లాడుతూ రాందాస్ చౌరస్తాలో ఉన్న సీసీ కెమెరాలను పరిశీలిస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు కౌన్సిలర్ శివరామకృష్ణ కాంగ్రెస్ నాయకులు. మ్యాడమ్ బాలకృష్ణ, రాగి అశోక్. లక్ష్మీనారాయణ గౌడ్ , ప్రసాద్, కొండ సంజీవ్, మేడిశెట్టి శంకర్, తదితరులు పాల్గొన్నారు.

దుండగులను వెంటనే గుర్తించాలి: బీఆర్ఎస్

మెదక్ చౌరస్తాలోని జాతిపిత మహాత్మా గాంధీ విగ్రహాన్ని అవమానపరిచిన దుండగులపై కఠిన చర్య తీసుకోవాలని భారత రాష్ట్ర సమితి మెదక్ పట్టణ కన్వీనర్ మున్సిపల్ కౌన్సిలర్ మామిళ్ల ఆంజనేయులు డిమాండ్ చేశారు. మహాత్మా గాంధీ అహింసా వాదంతో భారతదేశానికి స్వాతంత్ర్యం తెచ్చిన మహనీయుడు అని, ఆయన విగ్రహాన్ని అవమానపరచడం భారతజాతికి అవమానం అని పేర్కొన్నారు. దేశం కోసం పోరాడిన గాంధీజీని అవమానపరిచిన గూండాలను తక్షణమే అరెస్టు చేయాలని, వారికి కఠిన శిక్ష విధించాలని మెదక్ పట్టణ బిఆర్ఎస్ పార్టీ డిమాండ్ చేస్తుందని ఆయన తెలిపారు.

పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలి

ప్రతిపక్షం, మెదక్ టౌన్, మార్చి 4 : డీఎస్సీ 2003 ఉపాధ్యాయులకు ప్రభుత్వం పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలంటూ ఈ నెల 7న చలో హైదరాబాద్ కార్యాక్రమంలో భాగంగా ఇందిరా పార్క్ వద్ద మహా విజ్ఞాపన సభ నిర్వహిస్తున్నట్లు పాత పెన్షన్ పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంతోష్ కుమార్ పేర్కొన్నారు.ఈ సందర్భంగా ఆయన బుధవారం మెదక్ జిల్లా కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు.2003 ఉద్యోగ, ఉపాధ్యాయులకు కేంద్ర ప్రభుత్వ మెమో నంబర్ 57 ఆధారంగా, హైకోర్టు తీర్పును అమలు చేస్తూ పాత పెన్షన్ విధానాన్ని వర్తింపజేయాలని డిమాండ్ చేశారు.ఇప్పటికే దేశంలోని దాదాపు సగం రాష్ట్రాలు కేంద్ర ప్రభుత్వ మెమోని అనుసరిస్తూ పాతపించే విధానాన్ని అమలు చేస్తున్నాయని,ఆంధ్రప్రదేశ్ లో కూడా డీఎస్సీ 2003 ద్వారా నియామకైన ఉపాధ్యాయులకు పాతపించిన అమలు చేస్తూ ప్రక్రియ ప్రారంభమైందని పేర్కొన్నారు.అదే విధంగా మన రాష్ట్రంలో కూడా పాత పింఛన్ విధానాన్ని ఉద్యోగ ఉపాధ్యాయులకు అమలు చేయాలన్నారు.ఈ విజ్ఞాపసభకు ఉపాధ్యాయ ఎమ్మెల్సీలు,ఉద్యోగ జేఏసీ నాయకుడు కోదండరామ్ తదితరులు హాజరు కానున్నారని తెలిపారు.రాష్ట్రంలోని అన్ని జిల్లాలతో పాటు ఉమ్మడి మెదక్ జిల్లా నుంచి ఉద్యోగ, ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో పాల్గొని సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో డీఎస్పీ 2003 బాధ్యులు రాఘవేందర్ చారి, తాళ్ల శ్రీనివాస్,సుంకరి కృష్ణ, మల్లారెడ్డి,చంద్రశేఖర్ తదితరులు ఉన్నారు

ప్రణాళికతో చదివితే విజయం సొంతం

- ప్రముఖ మోటివేషన్ డాక్టర్ గోపాల సుదర్శన్

ప్రతిపక్షం,మెదక్ టౌన్, మార్చ్ 04: విద్యార్థులు ప్రణాళికబద్ధంగా చదివితే విజయం ఖాయమని ప్రముఖ మోటివేషన్ డాక్టర్ గోపాల సుదర్శన్ పేర్కొన్నారు.బుధవారం మెదక్ జిల్లా హవేలీ ఘనపూర్ మండల పరిధిలోని పీఎం శ్రీ జడ్పీహెచ్ఎస్ కూచన్ పల్లిలో విద్యార్థులకు ప్రేరనాత్మక తరగతులు నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ప్రముఖ మోటివేషన్ డాక్టర్ గోపాల సుదర్శన్ హాజరయ్యారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...ఈ నెలలో జరగనున్న పదవ తరగతి పబ్లిక్ పరీక్షల్లో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని సూచించారు.విద్యార్థుల సక్సెస్ అనేది వారి ఎంచుకున్న రంగంపై ఆధారపడి ఉంటుందని అన్నారు. ఒక్కసారి నిరుత్సాహపడితే భవిష్యత్తులో ఏమి సాధించలేమని ఎన్ని అడ్డంకులు ఎదురైనా తన గమ్యాన్ని చేరేవరకు ఒకే కోణంతో ఆలోచించకుండా అనేక కోణాల రూపంలో ఆలోచించి ముఖ్యంగా పాజిటివ్ దృక్పథంతో ఉండి విద్యార్థులందరూ ప్రతి చిన్న విషయాన్ని తరగతి గదిలో ఆలోచించే తత్వాన్ని మరియు నిబద్ధత ఉంది ముఖ్యమైన సబ్జెక్టులపై అవగాహన పెంచుకొని విశ్లేషణాత్మకంగా చదివితే మంచి మార్కులు సాధించవచ్చు అని అన్నారు. మరొక అతిథి జాతీయ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత SSA ప్లానింగ్ కోఆర్డినేటర్ రామస్వామి మాట్లాడుతూ..రాబోయే రోజుల్లో దేశ భవిష్యత్తు విద్యార్థుల విజయాల పైన ఆధారపడి ఉందని అన్నారు.విద్యార్థులందరూ సోషల్ మీడియా మొబైల్ ఫోన్లకు దూరంగా ఉండాలని విద్యార్థులకు సూచించారు.అనంతరం మండల విద్యాధికారి పాఠశాల ప్రధానోపాధ్యాయులు నాచారం మధుమోహన్ మాట్లాడుతూ.. పదవ తరగతి వార్షిక పరీక్షలకు సమయం తక్కువ ఉన్నదని మిగిలిన ఈ సమయాన్ని వృధా చేయకుండా క్రమశిక్షణతో చదివి జిల్లాలోని మన పాఠశాలను పదవ తరగతి ఫలితాల్లో అగ్రస్థానంలో ఉండే విధంగా ఉపాధ్యాయులు అందరు కృషిచేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో సీనియర్ ఉపాధ్యాయులు శివరాజ్ ఉపాధ్యాయ బృందం పంతంగి శ్రీనివాస్,ఎల్ మల్లారెడ్డి శశి కుమార్ రెడ్డి, వినోద్ సంతోషికుమారి, కృష్ణవేణి ,విమల పాల్గొన్నారు.

కలెక్టర్ ను కలిసిన అదనపు ఎస్పీ

ప్రతిపక్షం, మెదక్ టౌన్, మార్చ్ 04 : మెదక్ జిల్లా నూతన కలెక్టర్ గా బాధ్యతలు చేపట్టిన ప్రతిమా సింగ్ ను మెదక్ జిల్లా అదనపు ఎస్పీ ఎస్. మహేందర్ బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా కలెక్టరేట్ లో కలెక్టర్ ను కలిసి పూల మొక్కను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణతో పాటు అభివృద్ధి కార్యక్రమాల అమలులో జిల్లా యంత్రాంగం చేపడుతున్న చర్యల గురించి కలెక్టర్ కు వివరించారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు పోలీస్ శాఖ కట్టుబడి ఉందని తెలిపారు.

విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో ముందుకు సాగాలి!

ప్రతిపక్షం,తొగుట, మార్చి 04: గ్రామీణ విద్యార్థులకు పట్టుదల ఎక్కువగా ఉంటుందని, వారు తలుచుకుంటే ఎలాంటి లక్ష్యమైనా చేరుకుంటారని లోహిత్ సాయి ఆసుపత్రి అధినేత డా.ఆమిరిశెట్టి భాస్కర్ పేర్కొన్నారు. మండలంలోని వెంకట్రావుపేటలో జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో విద్యార్థులకు డెస్క్ లు లేకపోవడంతో మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు జీడిపల్లి రాంరెడ్డి అభ్యర్థన మేరకు 9వ తరగతికి 20 డెస్క్ లు అందించిన సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమం లో మాట్లాడారు.. తన స్వగ్రామం తొగుట మండలం పల్లెపహాడ్ లోని ప్రభుత్వ పాఠశాలలోనే విద్యాభ్యాసం సాగించడం జరిగిందని, డాక్టర్ కావాలని కష్టపడి ప్రొఫెసర్ స్థాయికి ఎదగడం జరిగిందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో విద్యార్థులు పేదరికంను చాలెంజ్ గా స్వీకరించి ముందుకు సాగాలన్నారు. చదువుతోనే ఏదైనా సాధ్యమని, చదువు ద్వారానే తాను ఈస్థాయికి చేరుకోవడం జరిగిందన్నారు. ప్రణాళికాబద్ధంగా అభ్యాసం చేస్తే ఏదైనా సాధ్యమేనని ఆయన విద్యార్థులకు సూచించారు. వెంకట్రరావుపేట పాఠశాలలో మౌలిక వసతుల కల్పన కోసం తన వంతు సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. ఈసందర్భంగా 9వ తరగతి విద్యార్థులకు నోట్ బుక్స్, , పెన్నులు అందించారు. ఈసందర్భంగా డెస్క్ లు అందించిన డా.ఆమిరిశెట్టి భాస్కర్ ను గ్రామ సర్పంచ్ బండారు కవిత స్వామిగౌడ్, హెచ్ ఎం నయామా కౌసర్లు ఘనంగా సన్మానించారు. ఎంఇవో నర్సయ్య మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి కోసం డా. భాస్కర్ ను స్ఫూర్తిగా తీసుకొని మిగతా వారు ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు జీడిపల్లి రాంరెడ్డి, ప్రముఖ కవి బండకాడి అంజయ్యగౌడ్, కార్యదర్శి రవీందర్, ఉప సర్పంచ్ లచ్చోల్ల లింగం, వార్డు సభ్యులు వడ్డె లలిత నర్సింహులు, జహంగీర్, ఎంగలి నరేందర్, మిద్దె శ్రీనివాస్, కత్తుల రాణి రమేష్, వడ్డె శ్యామల నర్సింహులు, గ్రామ పెద్దలు దబ్బికారి పెంటోజి, పులిగారి శివయ్య, సుతారి రాములు, ఈదగల్ల పర్శరాములు, బెజ్జనమైన శ్రీనివాస్, కనకరాజు, రాంబాబు, కల్లెపు నరేష్, కర్ణాకర్, పులిగారి లక్ష్మణ్, నవీన్, ప్రశాంత్, రాజు తదితరులు పాల్గొన్నారు.

మంద కృష్ణ పోరాట ఫలితమే ఎస్సీ వర్గీకరణ

ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, మార్చి 04 : ఎస్సీ వర్గీకరణ సాధ్యమైంది అంటే అది మందకృష్ణ మాదిగ పోరాట ఫలితమేనని మాదిగ ఉద్యోగుల సమాఖ్య జిల్లా అధ్యక్షుడు మరాఠీ సంతోష్, ఉపాధ్యక్షులు నరేష్ తెలిపారు. సిద్దిపేట ప్రెస్ క్లబ్ లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఎమ్మార్పీఎస్ నాయకులతో కలిసి మాదిగ ఉద్యోగ సమాఖ్య నాయకులు మాట్లాడారు. మాదిగ ఉద్యోగులు, మేధావులు అని చెప్పుకుంటూ ఈనెల 6న హైదరాబాద్లోని శిల్పకళా తోరణం లో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి సన్మానం అంటూ సోషల్ మీడియాలో మెసేజ్ ప్రచారం చేస్తున్నారని తెలిపారు. ఈ సన్మాన కార్యక్రమానికి ఎమ్మార్పీఎస్ కు ఎలాంటి సంబంధం లేదని.. ఈ సన్మాన కార్యక్రమంలో మందకృష్ణ మాదిగ పాల్గొనడం లేదని తెలిపారు. అలాగే ఎమ్మార్పీఎస్ కు అనుబంధంగా ఉన్న మాదిగ ఉద్యోగుల సమాఖ్య నాయకులు గానీ, ఎమ్మార్పీఎస్ నాయకులు గాని ఈ కార్యక్రమంలో పాల్గొనవద్దు అని పిలుపునిచ్చారు. ఈ మీడియా సమావేశంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు మొక్కపల్లి రాజు, నాయకులు మల్లిగారీ యాదగిరి, నాగరాజు కిష్టయ్య పలువురు పాల్గొన్నారు.

ఘనంగా స్వపరిపాలన దినోత్సవ వేడుకలు

ప్రతిపక్షం, దుబ్బాక, మార్చి 04 : స్వపరిపాలన దినోత్సవ వేడుకలు బుధవారం దుబ్బాక మండల పరిధిలోని తిమ్మాపూర్ జడ్పీ హెచ్ ఎస్ పాఠశాలలో ఘనంగా నిర్వహించడం జరిగింది. వేడుకల లో ప్రధానోపాధ్యాయురాలు గా జె. శరణ్య వ్యవహరించారు. ఈ సందర్భంగా నూతనంగా ఏర్పడినటువంటి ఉపాధ్యాయులు పాఠాలను విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో చక్కగా బోధించారు. పాఠశాలను డిఇఓ జి. సృజన్ ,డిప్యూటీ ఇఓ ఆర్ హర్షిత , ఎంఈఓ ఎం రాహుల్ పాఠశాలను సందర్శించి ఉపాధ్యాయులు బోధించిన తీరును పరిశీలించి ప్రశంసించారు.

అవమానాన్ని భరించలేక సహ కూలిపై దాడి

- తలకు గాయంతో కోమాలో కార్మికుడు
- నిందితుడికి రిమాండ్

ప్రతిపక్షం, దౌల్తాబాద్, మార్చి 4 : బిల్డింగ్ నిర్మాణ పనుల వద్ద సహకూలిపై దాడి చేసిన నిందితుడిని అరెస్టు చేసి చేసి మంగళవారం రిమాండ్ కు తరలించారు. దౌల్తాబాద్ పోలీస్ స్టేషన్ లో మంగళవారం విలేకరుల సమావేశంలో ఎస్సై అరుణ్ కుమార్, నిందితుడు అమృత్ లాల్ వివరాలు వెల్లడించారు.దౌల్తాబాద్ మండలం గాజులపల్లి గ్రామంలో బిల్డింగ్ నిర్మాణ పనుల వద్ద జరిగిన గొడవ తీవ్ర పరిణామాలకు దారి తీసింది. ఒక కార్మికుడు సహ కార్మిక కూలీపై పారతో దాడి చేయడంతో తీవ్ర రక్తస్రావమై అతడు కోమాలోకి వెళ్లిన ఘటన ఆదివారం చోటుచేసుకుంది .గ్రామంలో బిల్లింగ్ కాంట్రాక్టర్ మల్లెల కృప వద్ద ఆంధ్ర ప్రదేశ్‌కు చెందిన కోర్నాల్, మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన అమృత్ లాల్ అనే వ్యక్తులు లేబర్‌గా పనిచేస్తున్నారు. కొంతకాలంగా కోర్నాల్, అమృత్ లాల్‌ను ఆట పట్టించేవాడు. ఆదివారం సాయంత్రం సమయంలో కోర్నాల్, అమృత్ లాల్ ముఖానికి సిమెంట్ రాయడం, అంగి పట్టుకుని లాగడం వంటి చర్యలకు పాల్పడినట్లు సహ కార్మికులు తెలిపారు. ఈ ఘటనను అవమానకరంగా భావించిన అమృత్ లాల్ కోపోద్రిక్తుడై అక్కడే ఉన్న పారతో, కోర్నాల్ తలపై గట్టిగా కొట్టడంతో దాడిలో కోర్నాల్ తీవ్రంగా గాయపడి రక్తస్రావంతో కుప్పకూలిపోయాడు. వెంటనే సహచరులు సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, మెరుగైన చికిత్స కోసం కోర్నాల్ ను ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు.వైద్యులు అతడు కోమాలోకి వెళ్లినట్లు తెలిపారు. ప్రస్తుతం ఉస్మానియా ఆసుపత్రిలో అతని పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిపారు.సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. నిందితుడు అమృత్ లాల్‌పై హత్యాయత్నం కేసు నమోదు చేసి మంగళవారం అరెస్టు చేసి న్యాయస్థానంలో హాజరుపరచగా రిమాండ్‌కు పంపినట్లు పోలీసులు తెలిపారు.ఈ ఘటన కార్మికుల మధ్య చిన్నచిన్న వివాదాలు ఎలా తీవ్ర పరిణామాలకు దారితీస్తాయో మరోసారి గుర్తుచేసిందని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

'బిల్లుల చెల్లింపుల జాప్యం చేయొద్దు'

ప్రతిపక్షం ప్రతినిధి, మెదక్, మార్చి 04 : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల పథకం ద్వారా అర్హులైన పేద కుటుంబాలకు సురక్షితమైన, శాశ్వత నివాస గృహాలు అందించడం లక్ష్యమని మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమ సింగ్ తెలిపారు. నిర్మాణ పనులు వేగవంతంగా పూర్తి చేయాలని, పనుల నాణ్యతలో ఎలాంటి రాజీ పడకూడదని స్పష్టంగా ఆదేశించారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాల బిల్లుల చెల్లింపుల జాప్యం చేయొద్దు ఆమె అన్నారు. లబ్ధిదారులతో నేరుగా మాట్లాడి, వారికి ఎలాంటి సమస్యలు ఉన్నాయో తెలుసుకున్నారు. నిర్మాణ సామగ్రి సరఫరా, బిల్లుల చెల్లింపులు,సాంకేతిక సిబ్బంది పర్యవేక్షణ వంటి అంశాలపై సంబంధిత అధికారులకు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

ట్రాక్టర్ స్టీరింగ్ పట్టిన ఉప సర్పంచ్

ప్రతిపక్షం, దౌల్తాబాద్, మార్చి 04 : దౌల్తాబాద్ మండలం తిరుమలాపూర్ గ్రామంలో రోజు వారి పారిశుద్ధ్య కార్యక్రమం ఎలాంటి ఆటంకం లేకుండా కొనసాగించేందుకు ఉప సర్పంచ్ గడ్డం నాగరాజు చొరవ చూపారు. గ్రామ ట్రాక్టర్ డ్రైవర్ అనివార్య కారణాలతో హాజరుకాలేకపోవడంతో చెత్త సేకరణ పనులు నిలిచిపోకుండా ఉండేందుకు ఆయన స్వయంగా ట్రాక్టర్ నడిపి చెత్తను స్వీకరించారు.గ్రామంలోని ప్రధాన వీధుల్లో ఇళ్ల వద్ద నుంచి చెత్తను సేకరించి డంపింగ్ యార్డుకు తరలించారు. ప్రతిరోజు నిర్వహించే పారిశుద్ధ్య కార్యక్రమం గ్రామ ఆరోగ్యానికి ఎంతో కీలకమని భావించిన ఉప సర్పంచ్, ప్రజల ఆరోగ్య పరిరక్షణలో ఎలాంటి రాజీ ఉండకూడదనే ఉద్దేశంతో ముందడుగు వేశారు.ఈ సందర్భంగా ఉప సర్పంచ్ గడ్డం నాగరాజు మాట్లాడుతూ, గ్రామ పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత,డ్రైవర్ రాకపోయినా పనులు ఆగిపోకూడదనే ఉద్దేశంతో ట్రాక్టర్ నడిపానని గ్రామాన్ని స్వచ్ఛంగా ఉంచేందుకు ప్రజలంతా సహకరించాలని కోరారు.గ్రామ ప్రజలు ఉప సర్పంచ్ సేవా భావాన్ని అభినందిస్తూ, ప్రజాప్రతినిధులు ఇలా ముందుండి పనిచేయడం ఆదర్శనీయమని పేర్కొన్నారు. పారిశుద్ధ్య కార్యక్రమాలు నిరంతరం కొనసాగుతాయని, గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు పంచాయతీ కట్టుబడి ఉందని అధికారులు తెలిపారు.

మృతుని కుటుంబాన్ని పరామర్శించిన 'వంటేరు'

ప్రతిపక్షం, గజ్వేల్, మార్చ్ 04 : మండలంలోని సింగాటం గ్రామానికి చెందిన బిఆర్ఎస్ పార్టీ నాయకులు ప్రభాకర్, ప్రసాద్ ల తండ్రి పూదూరి వంజరి పోచయ్య అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న గజ్వేల్ నియోజకవర్గ బి ఆర్ ఎస్ పార్టీ ఇన్చార్జ్ వంటేరు ప్రతాప్ రెడ్డి వారి కుటుంబ సభ్యులను బుధవారం నాడు పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. వారి పవిత్ర ఆత్మకు శాంతిని చేకూర్చాలని కోరుకున్నారు. వారి వెంట బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు బెండే మధు, గజ్వేల్ మున్సిపల్ ఆరో వార్డు కౌన్సిలర్ స్వప్న సురేష్, బిఆర్ఎస్ నాయకులు తాటికొండ మధుసూదన్ రెడ్డి, బొగ్గుల సురేష్, గొడుగు స్వామి, మల్లేశం, శ్రీనివాస్, ఆందోలు కిష్టారెడ్డి, నర్సింలు, లింగాగౌడ్ గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



ప్రభుత్వ టీచర్ల జీతాలు తగ్గించాలంటూ విద్యాకమిషన్ సర్కారుకు ఇచ్చిన నివేదికపై నిర్ణయం తీసుకోలేదు. ప్రభుత్వం టీచర్ల జీతాలను తగ్గించదు. శాలరీలపై ఇంకా నిర్ణయం తీసుకోలేదు, ఉపాధ్యాయ సంఘాలను పిలిచి మాట్లాడుతాం. అన్ని జీవోలు పబ్లిక్ డొమైన్‌లో పెడుతున్నాం. ప్రభుత్వం నెల రోజుల్లో కొత్త ఎడ్యుకేషన్ పాలసీ తెస్తుంది.
- ఎడ్యుకేషన్ కమిషన్ మెంబర్ కే.కేశవరావు

ప్రాంతీయం

పాఠశాలల్లో మరుగుదొడ్లు, ప్రహరీలకు ప్రాధాన్యం

జిల్లా కలెక్టర్ హైమవతి

ప్రతిపక్షం బ్యూరో, సిద్ధిపేట, మార్చి 4 : జిల్లాలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎంజీఎన్ఆర్ఈజీఎస్) కింద చేపడుతున్న నిర్మాణ పనులను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ కె. హైమావతి అధికారులను ఆదేశించారు.బుధవారం సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలోని కాన్ఫరెన్స్ హాల్లో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడుతూ, గ్రామాల్లో నిర్మాణంలో ఉన్న అంగన్వాడీ భవనాలు, గ్రామపంచాయతీ భవనాలు, సబ్ సెంటర్లు, గ్రామ మహిళా సమాఖ్య భవనాలు, ఫుడ్ గ్రైన్ స్టోరేజ్ గోదాములు, సిసి రోడ్లు, పాఠశాలల ప్రహరీ గోడలు, మరుగుదొడ్ల పనుల పురోగతిపై సమీక్షించారు.ముఖ్యంగా అన్ని పాఠశాలల్లో మరుగుదొడ్లు, ప్రహరీ గోడల నిర్మాణాలను మొదటి ప్రాధాన్యంగా తీసుకుని త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో మంజూరైన ఈజీఎస్ పనులను నిర్దిష్ట గడువులోగా పూర్తి చేసి, కేటాయించిన నిధులను సద్వినియోగం చేసుకోవాలని అధికారులకు స్పష్టం చేశారు.రాబోయే 15 రోజులు అత్యంత కీలకమని పేర్కొంటూ, ప్రతిరోజూ ప్రణాళికాబద్ధంగా పనుల పురోగతి సాధించాలని, పనులు పూర్తయిన వెంటనే మాస్టర్ రోల్ జనరేట్ చేసి ఆన్‌లైన్‌లో అప్లోడ్ చేయాలని ఆదేశించారు.ప్రజాపాలన ప్రగతి నివేదిక కార్యక్రమంలో భాగంగా నియోజకవర్గం, మండలం, గ్రామం వారీగా ప్రారంభాలకు సిద్ధం కావాలని పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారులను కోరారు.ఈ సమావేశంలో డీఆర్డీఓ జయదేవ్ ఆర్య, పంచాయతీరాజ్ ఈఈ చిరంజీవి, ఏఈలు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా స్వయం పరిపాలన దినోత్సవం

ప్రతిపక్షం, తొగుట, మార్చి 04 : మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఘణపురం నందు విద్యార్థులే ఉపాధ్యాయులై స్వయం పరిపాలన దినోత్సవం జరిపారు. విద్యార్థులే ఉపాధ్యాయుల విధులను ఉత్సాహంగా నిర్వహించారు. అనంతరం పాఠశాల ప్రధానోపాధ్యాయులు చంద్రకళ మాట్లాడుతూ సమాజంలో దిశానిర్దేశం చేసేది ఉపాధ్యాయులే అని అన్నారు. విద్యార్థులు బాగా చదివి లక్ష్యం వైపు పయనించాలన్నారు. రోజంతా ఉపాధ్యాయులుగా విద్యార్థులు విధులు నిర్వర్తించి సంతోషపడ్డారు.ఒక రోజు ప్రధానోపాధ్యాయులుగా అక్షయ, డీఈవోగా శ్రీనిధి ఎంఈఓ గా శ్రీ వర్షిత్ ఉపాధ్యాయులుగా హర్షవర్ధన్, సాత్విక, లక్ష్మీప్రసన్న, హర్షిత, ఎం.శ్రీజ, కె.శ్రీజ, స్మృతి, శ్రీహిత, శ్రీహర్ష, శ్రీవర్ష, భరత్, శశివర్ధన్, యశ్వంత్, మనోజ్, వరుణ్,రిత్విక్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు లక్ష్మారెడ్డి, వనజ, రవీందర్, రాజ్ కుమార్, ప్రేమల, నవనీత పాల్గొన్నారు.

క్రీడా రంగంలో రాణిస్తున్న కానిస్టేబుల్ సాయి

- **నిరుపేద కుటుంబం నుంచి జాతీయ స్థాయి వరకు క్రికెటర్ సాయి**
- **జిల్లా ఎస్పీ చేతుల మీదుగా సన్మానం నగదు ప్రోత్సాహకం**

ప్రతిపక్షం, మెదక్ టౌన్, మార్చ్ 04 : జాతీయ స్థాయి క్రికెట్ క్రీడాకారుడైన కానిస్టేబుల్ సాయి కుమార్‌ను జిల్లా ఎస్పీ శ్రీ డి.వి. శ్రీనివాస రావు బుధవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఘనంగా సన్మానించి నగదు ప్రోత్సాహకాన్ని అందజేశారు.క్రీడా రంగంలో ఆయన సాధించిన విజయాలను గుర్తించి అభినందించారు. తిరుపతిలో ఇటీవల నిర్వహించిన సౌత్ జోన్ క్రికెట్ టోర్నమెంట్‌లో సాయి అద్భుత ప్రదర్శనతో జట్టును సెమీ ఫైనల్ వరకు చేర్చడంలో కీలక పాత్ర పోషించారు.అలాగే ఎలైట్ క్రికెట్ ప్రీమియర్ లీగ్‌లో తెలంగాణ పోలీస్ క్రికెట్ జట్టు విజేతగా నిలవడంలోనూ ప్రధాన పాత్ర పోషించారు.ఈ విజయాలతో జిల్లా పోలీస్ శాఖకు రాష్ట్ర, జాతీయ స్థాయిలో మంచి గుర్తింపు తీసుకువచ్చారని ఎస్పీ ప్రశంసించారు.విధి నిర్వహణతో పాటు క్రీడా రంగంలోనూ రాణిస్తూ యువ పోలీస్ సిబ్బందికి ఆదర్శంగా నిలుస్తున్న సాయి, నిరుపేద విద్యార్థులకు ఉద్యోగ మార్గదర్శకత్వం అందిస్తూ సేవా కార్యక్రమాలను కొనసాగించనున్నట్లు తెలిపారు.
ఈ కార్యక్రమంలో ఆర్ఐ శైలేందర్, ఎస్బీ ఇన్స్పెక్టర్ సందీప్ రెడ్డి, సీసీ రాజేందర్ పాల్గొన్నారు.

స్వయం పాలనతో బాధ్యతలు తెలుస్తాయి

ప్రతిపక్షం, కొండపాక, మార్చి 04 : విద్యార్థులు స్వయం పరిపాలనతో తమ బాధ్యతలను తెలుసుకుంటారని కుకునూరు పల్లి ఎంఈఓ బచ్చలి సత్తయ్య అన్నారు. కుకునూర్ పల్లి మండలంలోని తిప్పారం ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు స్వయం పరిపాలన దినోత్సవాన్ని బుధవారం నిర్వహించారు. కార్యక్రమాన్ని పరిశీలించి మాట్లాడారు.ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించి పాఠాలు బోధించారు. డీఈవోగా మనోహర్ , ఎంఈఓ గా ఆదర్శణ,ప్రధానోపాధ్యాయురాలుగా చిన్మయి, ఉపాధ్యాయులుగా,ప్రణవి, లాస్య, సాయికృష్ణ, శివకుమార్,భానుప్రకాష్,ప్రణీత్ అటెండర్‌గా రక్షిత్ లు వ్యవహరించారు.ఈ సందర్భంగా ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ప్రధానోపాధ్యాయులు సి హెచ్ రవి, సి అర్ పి సంతోష్, ఉపాధ్యాయులు రామకృష్ణారెడ్డి, మాధురి తదితరులు పాల్గొన్నారు.

నేను రోజూ ఆన్‌లైన్‌లో లైంగిక వేధింపులను ఎదుర్కొంటున్నా. నేను ఏం ధరించినా సోషల్ మీడియాలో అసభ్య కామెంట్లు చేస్తున్నారు. అత్యాచారం చేస్తామని బెదిరిస్తుంటారు. సమాజంలో ఇదొక ప్రమాదకర వైఖరి. ఇలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి.
- 'ధురంధర్' స్పెషల్ సాంగ్ నటి ఆయేషా ఖాన్

స్వచ్ఛతలో మేటి..

జాతీయ స్థాయికి పోటీ

(కత్తుల లక్ష్మారెడ్డి, సిద్ధన్నపేట)

- **రాష్ట్ర స్థాయిలో ఉత్తమ రేటింగ్**
- **జాతీయ స్థాయి స్వచ్ఛ విద్యాలయ పోటీకి ఎంపిక**
- **నంగునూరు జడ్పీ పాఠశాల ఘనత**

"పరిశుభ్రతే దైవం" అన్న గాంధీజీ మాటలను నిజం చేస్తూ, పాఠశాల ప్రాంగణాన్ని ఒక పవిత్ర దేవాలయంగా తీర్చిదిద్దినప్పుడే విద్యార్థులకు ఆరోగ్యకరమైన అభ్యాస వాతావరణం లభిస్తుంది. విద్యాబుద్ధులతో పాటు క్రమశిక్షణ, పారిశుధ్యం, పర్యావరణ స్పృహను పెంపొందించడంలో నంగునూరు ఉన్నత పాఠశాల అత్యుత్తమ ప్రగతిని కనబరిచింది. పచ్చని చెట్లు, స్వచ్ఛమైన తాగునీరు, అత్యాధునిక మరుగుదొడ్ల సౌకర్యాలతో ఆదర్శంగా నిలిచినందుకు ప్రతిష్టాత్మకమైన 'స్వచ్ఛ విద్యాలయ జాతీయ పురస్కారం' పోటీలకు ఎంపికయింది. సిద్ధిపేట జిల్లా నుంచి నంగునూరు మండల కేంద్రంలోని జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల ఒక్కటే జాతీయ స్థాయి స్వచ్ఛ విద్యాలయ పురస్కారాల పోటీకి ఎంపిక కావడం విశేషం. తెలంగాణ రాష్ట్రం నుంచి 20 పాఠశాలలు జాతీయ స్థాయి పురస్కారానికి పోటీ పడుతున్నాయి. రాష్ట్రంలో రెండువేల పాఠశాలలు ఎస్ హెచ్ వీ ఆర్ కు దరఖాస్తు చేసుకున్నాయి. మండల, జిల్లా, రాష్ట్ర స్థాయి పరిశీలనా బృందాలు పాఠశాలలను సందర్శించి రాష్ట్రంలో జిల్లా స్థాయి నుంచి రాష్ట్ర స్థాయికి రెండు వేల పాఠశాలలు ఎంపిక అయ్యాయి. రాష్ట్ర స్థాయి పరిశీలన బృందాలు రెండు వేల పాఠశాలల్లో క్షేత్ర స్థాయి పరిశీలన చేశాయి. రాష్ట్ర స్థాయి పరిశీలన బృందాలు ఇచ్చిన రేటింగ్ ఆధారంగా జాతీయ స్థాయి పోటీలకు రాష్ట్రం నుంచి 20 పాఠశాలలు ఎంపికయ్యాయి. వీటిలో సిద్ధిపేట జిల్లా నుంచి నంగునూరు జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల ఒకటి కావడం విశేషం. దేశ వ్యాప్తంగా వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన ప్రతిపాదనల మేరకు జాతీయ స్థాయి పరిశీలన బృందాలు పాఠశాలను పరిశీలించి స్వచ్ఛ ఏవం హరిత విద్యాలయ రేటింగ్ (ఎస్ హెచ్ వి ఆర్) ఇస్తారు. ఈ రేటింగ్ ఆధారంగా దేశంలో మొత్తం 200 పాఠశాలలను అవార్డుకు ఎంపిక చేస్తారు. ఇందులో భాగంగా బుధవారం జాతీయ స్థాయి పరిశీలనా బృందం పాఠశాలను సందర్శించి 60 సూచికలను స్వయంగా పరిశీలించారు.

ఆధునిక శౌచాలయాలు

నంగునూరులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బాలురు, బాలికలకు వేర్వేరుగా ఆధునిక శౌచాలయాలు ఉన్నాయి. 361 మంది విద్యార్థులు ఉన్న ఈ పాఠశాలలో బాల, బాలికలకు వేర్వేరుగా ఆధునిక శౌచాలయాలను రూ.40 లక్షల సీఎస్ఆర్ నిధులతో నిర్మించారు. ప్రతిరోజూ పారిశుధ్య కార్మికులు వీటిని డెట్టాల్, ఫినాయిల్ వంటి వాటితో కడుగుతూ పరిశుభ్రంగా ఉంచుతున్నారు. నిరంతర నీటి సరఫరా కోసం అవసరమైన కుళాయిలను బిగించారు.

ప్రత్యేక అవసరాల పిల్లల కోసం

ప్రత్యేక అవసరాల (సీడబ్ల్యూఎస్ఎన్) విద్యార్థుల కోసం ప్రత్యేకంగా మరుగు దొడ్డితో పాటు మూత్రశాలను ఆధునిక సౌకర్యాలతో నిర్మించారు. ట్రై సైకిల్ పై మరుగు దొడ్డి వరకు వెళ్ళడంతో పాటు సులభంగా లోపలికి వెళ్లి కాలకృత్యాలు తీర్చుకునే విధంగా ఏర్పాట్లు చేశారు. ర్యాంపు నిర్మించారు.

చేతుల పరిశుభ్రతలో మేటి

పాఠశాలలో విద్యార్థుల చేతి పరిశుభ్రతకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. విద్యార్థులంతా భోజనానికి ముందు, భోజనం తరువాత, శౌచాలయాలను వినియోగించుకున్న తరువాత చేతులను శుభ్రంగా సబ్బుతో కడుక్కునేందుకు ఏర్పాట్లు ఉన్నాయి. ఆధునిక వాష్ బేసిన్ ను టైల్స్ తో నిర్మించి నల్లాలను బిగించారు.

శుద్ధి చేసిన మంచినీరు

విద్యార్థులు తాగేందుకు శుద్ధి చేసిన మంచినీరు అందుబాటులో ఉంది. పాఠశాల లో గంటకు రెండువేల లీటర్ల మంచినీటిని శుద్ధి చేసే సామర్థ్యంతో కూడిన మంచి నీటి ప్లాంటు ద్వారా విద్యార్థులకు తాగు నీటిని అందిస్తున్నారు. శుద్ధి చేసిన తాగు నీటిని నల్లాల ద్వారా పట్టుకునే విధంగా ఏర్పాట్లు ఉన్నాయి.

వ్యర్థాలతో సేంద్రీయ ఎరువు

పాఠశాలలో వ్యర్థాలను ఉపయోగించి వర్మీ కంపోస్టు తయారు చేస్తున్నారు. ఇందుకోసం ప్రత్యేకంగా కంపోస్టు పిట్ (గుంత)ను నిర్మించారు. దీనిలో వానపాములను పెంచుతున్నారు. వ్యర్థాలను దీనిలో వేసి వానపాముల ద్వారా వర్మీ కంపోస్టు తయారు చేస్తున్నారు. తయారైన వర్మీ కంపోస్టును మొక్కలకు ఎరువుగా వినియోగిస్తున్నారు.

వాన నీటి సంరక్షణ

పాఠశాల ఆవరణలో కురిసే వాన నీటిని వరద రూపంలో వెళ్లకుండా పాఠశాల ఆవరణలోనే భూమిలోకి ఇంకే విధంగా ఏర్పాట్లు ఉన్నాయి. ఇందు కోసం రెండు గుంతలు నిర్మించారు. వర్షం కురిసినపుడు పాఠశాల భవనం పైకప్పు నుంచి వచ్చే నీరు నేరుగా పైపుల ద్వారా ఇంకుడు గుంతలోకి వెళ్లి భూమిలోకి ఇంకుతోంది. పాఠశాల మైదానంలో కురిసే నీరు నేరుగా ఇంకుడు గుంతలోకి చేరే విధంగా మరో ఇంకుడు గుంతను తవ్వారు.

వంటగది తోట

పాఠశాల ఆవరణలో వంట గది తోట (కిచెన్ గార్డెన్) నిర్వహిస్తున్నారు. వంట గది పక్కనే ఉన్న కొద్దిపాటి స్థలంలో నిర్వహిస్తున్న వంటగది తోటలో మిరప, వంకాయ, టమాటా వంటి కూరగాయలు, పాలకూర, తోటకూర వంటి ఆకు కూరలను పండిస్తున్నారు. వీటిని విద్యార్థులకు మధ్యాహ్న భోజనంలో వండే కూరలో వినియోగిస్తున్నారు.

మూలికల తోట

ఇవి ఔషధ గుణాలను కలిగి, వ్యాధి నివారణకు తోడ్పడే మూలికల తోటను ప్రత్యేకంగా పెంచుతున్నారు. వీటిలో ఆహారానికి అద్భుతమైన రుచి, సువాసనను ఇచ్చే మొక్కలు ఉన్నాయి. రోగనిరోధక శక్తిని పెంచి,దగ్గు జలుబుకు మందుగా పని చేసే తులసి, జీర్ణక్రియను పెంచి ఆహారానికి రిఫ్రెష్ రుచిని ఇచ్చే పుదీనా, వాంతులు, వికారం, జలుబు నివారణ గుణాలు కల్గిన అల్లం, చర్మ సంరక్షణ, చర్మ వ్యాధుల చికిత్సకు ప్రసిద్ధి చెందిన కలబంద, వాము, కడుపు నొప్పిని,అజీర్తిని తగ్గించే వాము,వంటలలో సుగంధం అలంకరణ కోసం ఉపయోగించే కొత్తిమీర, జుట్టు ఆరోగ్యం జీర్ణక్రియకు ఔషధం గా వినియోగించే కరివేపాకు. మంచి సువాసన వంటలలో రుచి కోసం ఉపయోగించే రోజ్ మేరీ లెమన్ గ్రాస్ వంటి మొక్కలు మూలికల తోటలో ఉన్నాయి.

ప్రత్యేక ఆకర్షణగా వృక్షోద్యానవనం

పాఠశాల ఆవరణలో వృక్షోద్యానవనం ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. దీనిలో వివిధ వివిధ రకాల పూల మొక్కలు, ఇతర చెట్లను పెంచుతున్నారు. ఇవి వృక్షాలుగా ఎదిగితే ఉద్యాన వనాన్ని తలపిస్తుంది. దీనికి ఎదురుగా ఉన్న రావి చెట్టును చెట్టమ్మ(మదర్ ట్రీ)గా ప్రకటించారు.

ఆహ్లాదాన్ని పంచే పచ్చదనం

పాఠశాలలో తరగతి గదులు మూడు బ్లాకులుగా ఉన్నాయి. వరండా వెంట బ్లాకుల చుట్టూ పెంచిన చెట్లు పచ్చదనంతో ఆహ్లాదాన్ని పంచుతున్నాయి. కొత్తగా ప్రహరీగోడ నిర్మిస్తున్నారు. దాని వెంట మొక్కలను పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

స్వచ్ఛత, పచ్చదనంపై పెరిగిన బాధ్యత

ఎస్ హెచ్ వీ ఆర్ వల్ల విద్యార్థుల్లో స్వచ్ఛత, పచ్చదనం పట్ల బాధ్యత పెరుగుతోంది. ఉపాధ్యాయుల సహకారంతో చేసిన కష్టానికి తగిన గుర్తింపు లభించి, మరింత ఉత్సాహాన్ని కలిగిస్తోంది. పర్యావరణ స్పృహను పెంపొందించడానికి గొప్ప మార్గం.
- గొట్టిపర్తి రామస్వామిగౌడ్, ప్రధానోపాధ్యాయుడు

మౌలిక సదుపాయాల మెరుగుదల

ఎస్ హెచ్ వీ ఆర్ కోసం పాఠశాలలో పారిశుధ్యం, తాగునీరు, మొక్కల పెంపకం వంటి సౌకర్యాలు మెరుగయ్యాయి. దీని వల్ల విద్యార్థుల ఆరోగ్యానికి మేలు జరుగుతోంది. విద్యార్థుల్లో సేంద్రియ ఎరువుల వినియోగం పై అవగాహన కలుగుతోంది.
- గిరి తిరుపతి, ఎకో క్లబ్ కన్వీనర్,

విద్యార్థుల్లో సానుకూల వైఖరి పెరిగింది

స్వచ్ఛ విద్యాలయ రేటింగ్ వల్ల విద్యార్థుల్లో పర్యావరణ పరిరక్షణ పట్ల సానుకూల వైఖరి పెరుగుతోంది. పర్యావరణానికి హాని కలిగించే ప్లాస్టిక్ వంటి వాటి వినియోగాన్ని తగ్గించడమే కాక పరిసరాల పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నారు.
- ముబ్బుదు రవీందర్ రెడ్డి, భౌతిక రసాయన శాస్త్ర ఉపాధ్యాయుడు

కోనాపూర్ డబుల్ బెడ్‌రూమ్ లబ్ధిదారులకు త్వరలోనే పట్టాలు

- **జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి హామీ**

ప్రతి పక్షం, దౌల్తాబాద్, మార్చి 04 : దౌల్తాబాద్ మండలంలోని కోనాపూర్ గ్రామంలో ప్రభుత్వం నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లలో నివసిస్తున్న లబ్ధిదారులకు త్వరలోనే ఇంటి పట్టాలు మంజూరు చేయనున్నట్లు జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి తెలిపారు. దౌల్తాబాద్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మద్దెల స్వామి, టీపీసీసీ సోషల్ మీడియా రాష్ట్ర కార్యదర్శి గణేష్ పంచమి కలిసి కోనాపూర్ గ్రామంలోని డబుల్ బెడ్‌రూమ్ లబ్ధిదారులకు వెంటనే ఇంటి పట్టాలు మంజూరు చేయాలని మంత్రిని కోరారు.సానుకూలంగా స్పందించిన మంత్రి, జిల్లా కలెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడి విషయాన్ని వివరించారు. లబ్ధిదారుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని వీలైనంత త్వరగా పట్టాల మంజూరు ప్రక్రియ పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ హైమావతికు ఆదేశించారు. అదేవిధంగా గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణం కోసం ఉపాధి హామీ నిధుల నుంచి రూ.5 లక్షలు మంజూరు చేయాలని నాయకులు కోరగా, ఆ ప్రతిపాదనను కూడా పరిశీలించి మంజూరు చేయడానికి మంత్రి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆత్మ కమిటీ డైరెక్టర్ సూరం పల్లి ప్రవీణ్, కాంగ్రెస్ నాయకులు యాదవ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రాంతీయం

సోనియా గాంధీ కృషితోనే తెలంగాణ

డీసీసీ అధ్యక్షుడు నగేష్ రెడ్డి

ప్రతిపక్షం బ్యూరో, నిజామాబాద్, మార్చి 04 : తెలంగాణ రాష్ట్రం సోనియా గాంధీ కృషి తోనే ఏర్పడిందని, కేసీఆర్ దొంగ దీక్షతో కాదని జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నగేష్ రెడ్డి అన్నారు. బుధవారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయలో డీసీసీ అధ్యక్షుడు నగేష్ రెడ్డి మాట్లాడుతూ ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం కోసం ఉద్యోగులు విద్యార్థులు ఉద్యమకారులు కార్మికులు రైతులు మేధావులు తెలంగాణ ప్రాంత వాసులకు అన్యాయం జరుగుతుందని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఆంధ్ర ప్రాంత నాయకులే ముఖ్యమంత్రిగా మంత్రులుగా ఉంటూ తెలంగాణ రాష్ట్రానికి అన్యాయం చేస్తున్నారని ఆలోచనతో రాష్ట్ర ప్రజల ఇష్టం మేరకు సోనియాగాంధీ గారు 2014లో ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం తీర్మానం చేయడం జరిగిందని, అప్పట్లో ఉన్న ఆంధ్ర ముఖ్యమంత్రి అసెంబ్లీలో ప్రత్యేక తెలంగాణ బిల్లును ఆమోదించేలా చేయమని చెప్పిన ఒక్క మాట వల్ల కాంగ్రెస్ పార్టీ ఎంత చేసిన పార్టీ యొక్క ఉనికి కోల్పోయే విధంగా అయ్యిందని ఆయన కూడా సోనియా గాంధీ ఎంతోమంది ఉద్యోగులు విద్యార్థులు ఉద్యమకారులు తమ ప్రాణాలను త్యాగం చేస్తున్నారని ఆలోచనతో ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఇవ్వడం జరిగిందని నగేష్ రెడ్డి అన్నారు. గత నెలా ఫిబ్రవరి 21 ఉమ్మడి తెలంగాన, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల డీసీసీ అధ్యక్షులకు వికారాబాద్ జిల్లాలో శిక్షణ శిబిరం నిర్వహించడం జరిగిందని, అందులో రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, ఏఐసిసి ఇంచార్జ్ సచిన్ రావు గారు, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షురాలు షర్మిల పాల్గొని డీసీసీ అధ్యక్షులకు సూచనలు చేసినట్లు తెలిపారు. అందులో భాగంగా 10 రోజులపాటు ఉదయం యోగ చేయించడంతో పాటు శిక్షణ తరగతులు నిర్వహించడం జరిగిందని, దేశం కోసం కాంగ్రెస్ పార్టీ చేసిన కృషిని దేశానికి స్వాతంత్రం వచ్చిన తర్వాత దేశ అభివృద్ధిలో కాంగ్రెస్ పాత్రను వివరించడం జరిగిందని నగేష్ రెడ్డి తెలిపారు. దేశానికి స్వాతంత్రం తీసుకు రావాలనే ఆలోచనతో 1920లో మహాత్మా గాంధీ నేతృత్వంలో కాంగ్రెస్ పార్టీ ఆవిర్భవించడం జరిగిందని, శాంతియుతంగా బ్రిటిష్ వారిపై పోరాడుతూ 1947లో స్వాతంత్రం తీసుకురావడం జరిగిందని, స్వతంత్రం వచ్చిన అనంతరం నెహ్రు ప్రధానిగా మూడు సంవత్సరాలు కృషిచేసి డాక్టర్ అంబేద్కర్ నాయకత్వంలో 1950లో రాజ్యాంగాన్ని తీసుకురావడం జరిగిందని, ప్రపంచంలోని వివిధ దేశాలలో ముస్లింలు క్రైస్తవులు ఎక్కువ ఉన్నారని భారతదేశం అన్ని దేశాలతో సానుకూలంగా ఉంటూ అభివృద్ధి చెందాలని ఆలోచనతో మహాత్మా గాంధీ హిందూ ముస్లిం భాయ్ భాయ్ అంటూ మతాలకు అతీతంగా అందరూ కలిసి ఉండే విధంగా భారత దేశంలో హక్కులు కల్పించడం జరిగిందని తెలిపారు. 1947లో స్వాతంత్రం వచ్చిన తర్వాత నెహ్రూ ప్రధానిగా బాధ్యతలు స్వీకరించినప్పుడు దేశంలో వ్యవసాయదారులకు, ప్రజలకు, కార్మికులకు సరైన సౌకర్యాలు లేవు అని కేవలం 20 గ్రామాలకు మాత్రమే విద్యుత్ సరఫరా ఉండేదని నెహ్రూ దీర్ఘ దృష్టితో దేశాన్ని అభివృద్ధి వైపు నడిచే విధంగా చేయడం జరిగిందన్నారు. శిక్షణ శిబిరంలో ఇన్చార్జిలతో నగేష్ రెడ్డి తన అనుభవాన్ని తెలియజేస్తూ 1988లో నేను సర్పంచ్ గా గెలిచిన సమయంలో మా గ్రామంలో కుల వివక్ష తీవ్రంగా ఉండేదని టీ హోటల్లో దళితులకు వేరే కులస్తులకు వేరుగా గ్లాసులు ఉంచేవారని దానిని నిర్మూలించడానికి అన్ని వర్గాలకు సమాన న్యాయం అందించాలని ఆలోచనతో మొదటి తీర్మానం మా గ్రామంలో కుల వివక్షకు వ్యతిరేకంగా చేయడం జరిగిందని, శిక్షణ శిబిరంలో ఉన్న అందరితో తన వణుభవాన్ని పంచుకోవడం జరిగిందన్నారు. గతంలో ఎన్నడు లేని విధంగా మొదటిసారి కిందిస్థాయి నుండి వచ్చిన కార్యకర్తలకు సర్వేలు చేసి కాంగ్రెస్ పార్టీలో ఎక్కువగా పని చేసిన వారికి డిసీసీలుగా నియమించడం జరిగిందని శిక్షణ శిబిరంలో తెలపడం జరిగిందని డిసీసీలుగా నియమించిన అధ్యక్షులు ఎవరికి కూడా పెద్ద నాయకులకు గులంగిరి చేసే అవసరం లేదని కేవలం కింది స్థాయి కార్యకర్తలకు ఓటర్లకు మాత్రమే గులం గిరి చేయాలని శిక్షణ శిబిరంలో మాకు తెలియజేయడం జరిగిందన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డ సమయంలో మిగులు బడ్జెట్ లో ఉన్న రాష్ట్రాన్ని 13 లక్షల కోట్ల అప్పులోకి లాగిన ఘనత కేసిఆర్ ది అని దళితుడిని ముఖ్యమంత్రి చేస్తానని చెప్పి ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత కెసిఆర్ గద్దెనెక్కి కూర్చున్నాడని, బిఆర్ఎస్ రాష్ట్రం తెలంగాణలో మొత్తం అవినీతి చేస్తూ ప్రజలదనాన్ని దోచుకున్నారని, రాష్ట్రంలో అభివృద్ధి మాత్రం శూన్యం చేయడం జరిగిందని నగేష్ రెడ్డి దుయ్యబట్టారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు గ్రామ గ్రామానికి రోడ్లు వేయడం, కరెంటు సరఫరా అందించడం ,మంచినీటి కలెక్షన్లు ఇవ్వడం, ప్రాజెక్టులు కట్టడం, ఎయిర్పోర్టులు తీసుకురావడం వంటి ఎన్నో పనులు చేయడం జరిగిందని, చివరి రోజు రాహుల్ గాంధీ శిక్షణ శిబిరం ముగింపు కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పాల్గొని సుమారు నాలుగు గంటలు మాతో సమయం కేటాయించి ప్రజల సర్వే ప్రకారమే మీకు జిల్లా అధ్యక్షులుగా నియమించడం జరిగిందని, గ్రామస్థాయి నుండి కాంగ్రెస్ పార్టీ కోసం పని చేస్తున్న వారికి న్యాయం చేయాలని మీకు అధ్యక్షులుగా అవకాశం ఇవ్వడం జరిగిందని తెలిపారన్నారు. బిజెపి కేవలం మతతత్వంతో నడిచే పార్టీ అని కాంగ్రెస్ పార్టీ అన్ని మతాలను సమానంగా చూసే పార్టీ అని కాంగ్రెస్ పార్టీ గుర్తు వస్తాం గుర్తులోని 5 వేళ్ళు అందరూ సమానం అనే విధంగా సూచిస్తున్నాయని రాహుల్ గాంధీ తెలియజేయడం జరిగిందని, అన్ని మతాలకు చెందిన ప్రజలను సమానంగా చూసుకుంటూ కుల వివక్షతను నిర్మూలించుకుంటూ కాంగ్రెస్ పార్టీ ముందుకు వెళుతుందని రాహుల్ గాంధీ తెలియజేయడం జరిగిందని నగేష్ రెడ్డి అన్నారు. నిజామాబాద్ జిల్లాలో ఉన్న ఆరు నియోజకవర్గాలలో కాంగ్రెస్ పార్టీ అందరు నాయకులను సమన్వయం చేసుకుంటూ ముందుకు వెళుతుందని, రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ గారి చొరువతో భీమ్గల్ మున్సిపాలిటీలో 12 స్థానాలకు ఎనిమిది స్థానాలను కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకోవడం జరిగిందని, జిల్లా మొత్తంలో మున్సిపాలిటీలను కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకోవడం జరిగిందని ఇదేవిధంగా రాబోయే జడ్పిటిసి ఎంపిటిసి ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధిక స్థానాల్లో విజయం సాధిస్తుంది అని ధీమా వ్యక్తం చేశారు. పార్టీకి సేవకుడిగా పని చేస్తూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధిక విజయం సాధించడానికి నా వంతు ప్రయత్నం నేను చేస్తానని నగేష్ రెడ్డి అన్నారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో అధిక ఎంపీ స్థానాలను గెలిపించి రాహుల్ గాంధీ గారిని ప్రధానిగా చేసి తీరుతామని రేవంత్ రెడ్డి ఆశయం రాహుల్ గాంధీ ప్రధాని చేయడం మాత్రమే అని దానికి అనుగుణంగా కాంగ్రెస్ నాయకులు అందరం కలిసి పని చేస్తామని ఆయన అన్నారు. కార్పొరేషన్ జిల్లా అధ్యక్షులు బొబ్బిలి రామకృష్ణ గారు మాట్లాడుతూ శిక్షణా శిబిరంలో ఏఐసీసీ నాయకులు, రాష్ట్ర మంత్రివర్యులు మాజీ ఐఏ ఎస్ ఆఫీసర్లు ప్రొఫెషర్ల నుండి రోజుకొకరి చొప్పున వచ్చి శిక్షణను ఇవ్వడం జరిగిందని తెలిపారు. ప్రముఖులు వారి రంగాలకు సంబంధించిన వాటిని శిక్షణ ఇవ్వడం జరిగింది. అలాగే చరక ద్వారా దూది నుండి దారం తీయడం కూడా శిక్షణలో భాగంగా నేర్పించడం జరిగిందని తెలిపారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహేర్ బిన్ హందాన్, మార్కెట్ కమిటీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి, జిల్లా గ్రంథాలయ చైర్మన్ అంతరెడ్డి రాజారెడ్డి, రాష్ట్ర ప్రచార కమిటీ సభ్యుడు జావీద్ అక్రమ్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు రత్నాకర్, ఏఐసిసి పరిశీలకులు గన్ రాజ్, జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు విపుల్ గౌడ్, జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు సంతోష్, జిల్లా ఓబీసీ అధ్యక్షుడు రాజా నరేందర్ గౌడ్, జిల్లా ఎస్టీ సెల్ అధ్యక్షుడు యాదగిరి, నగర ఎస్టీ సెల్ అధ్యక్షుడు సుభాష్ జాదవ్ పాల్గొన్నారు.

విద్యార్థి ఆత్మహత్య ఘటనపై కలెక్టర్ సీరియస్

- ఏకలవ్య మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ సహా నలుగురిపై సస్పెన్షన్ వేటు
- మోడల్ స్కూల్ ను సందర్శించిన కలెక్టర్

ప్రతిపక్షం బ్యూరో, నిజామాబాద్, మార్చి 04 : ఇందల్వాయి లోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్ లో రామ్ చరణ్ (15) అనే తొమ్మిదవ తరగతి విద్యార్థి ఆత్మహత్య చేసుకున్న సంఘటనను కలెక్టర్ ఇలా త్రిపాఠీ తీవ్రంగా పరిగణించారు. ఈ ఘటనపై ప్రాథమిక విచారణ జరిపించారు. ప్రాంతీయ సమన్వయకర్త గంగారాం నాయక్ నేతృత్వంలో ఇతర జిల్లాల నుండి వచ్చిన ఏకలవ్య మోడల్ స్కూళ్ల ప్రిన్సిపాల్స్ శ్రీనివాస్ స్వామి, డాక్టర్ సైదా జైనబ్, ఫణి కుమార్, డాక్టర్ జ్యోతి ప్రాథమికంగా విచారణ జరిపి నివేదిక సమర్పించారు. వీరి నివేదిక ఆధారంగా ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్ ప్రిన్సిపాల్ రమేష్ కుమార్ ను, హౌజ్ మాస్టర్ కుల్దీప్ యాదవ్ ను, హాస్టల్ వార్డెన్ విశ్వంబర్, మెస్ ఇంచార్జి ఆకాష్ యాదవ్ లను సస్పెండ్ చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. కాగా, కలెక్టర్ ఇలా త్రిపాఠి బుధవారం ఇందల్వాయి ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్ ను సందర్శించారు. అధ్యాపకులు, విద్యార్థిని విద్యార్థులతో భేటీ అయి, రామ్ చరణ్ ఆత్మహత్య సంఘటనపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. రామ్ చరణ్ బలవన్మరణానికి పాల్పడడం ఎంతో బాధ కలిగించిందని కలెక్టర్ ఆవేదన వెలిబుచ్చారు. జీవితంలో అనేక సమస్యలు వస్తుంటాయని, వాటిని ధైర్యంగా ఎదుర్కోవాలని విద్యార్థులకు ఉద్బోధించారు. ఆత్మహత్య ఆలోచనలు దరి చేరకుండా, ఏకాగ్రతతో చదువుపై దృష్టి కేంద్రీకరించాలని హితవు పలికారు. క్రమశిక్షణతో ముందుకెళ్తే మంచి భవిష్యత్తు సొంతం అవుతుందని అన్నారు. తప్పుడు నిర్ణయాలతో నిండు జీవితాన్ని బలవంతంగా అంతం చేసుకోవద్దని, తల్లిదండ్రులకు కడుపు కోత మిగల్చవద్దని అన్నారు. కలెక్టర్ వెంట ఆర్.సీ.ఓ గంగారాం నాయక్ తదితరులు ఉన్నారు.

బోధన్ ఇఫ్తార్ విందులో పాల్గొన్న పోలీస్ కమీషనర్

ప్రతిపక్షం బ్యూరో, నిజామాబాద్, మార్చి 04 : బోధన్ పట్టణంలోని రాకాసిపేట్ జామ మసీద్ లో మజీద్ కమిటీ అధ్యక్షుడు గుల్షని ఆధ్వర్యంలో నిర్వహించిన ఇఫ్తార్ విందు కార్యక్రమానికి నిజామాబాద్ పోలీస్ పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. ముక్తి జావేద్ నిర్వహించిన దువాలో సీపీ పాల్గొని అనంతరం ఉపవాస విరమణ చేశారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ రంజాన్ మాసం విశిష్టతను విశ్లేషణాత్మకంగా వివరించారు. రంజాన్ అనేది కేవలం ఉపవాసాల నెల మాత్రమే కాకుండా, మనస్సును పరిశుభ్రం చేసుకునే ఆత్మపరిశీలన కాలమని అన్నారు. ఉపవాసం ద్వారా నియమం, సహనం, క్రమశిక్షణ పెంపొందుతాయని, పేదల పట్ల కరుణాభావం మరింత బలపడుతుందని పేర్కొన్నారు. దానధర్మాలు, సహనశీలత, సోదరభావం వంటి విలువలు ఈ పవిత్ర మాసంలో మరింత ఆవిష్కృతమవుతాయని చెప్పారు. అల్లా కృపతో సమాజంలో శాంతి, సౌభ్రాతృత్వం, సుఖసంతోషాలు నెలకొనాలని ఆకాంక్షించారు. అలాగే అన్ని వర్గాల ప్రజలు ఐక్యంగా ముందుకు సాగి బోధన్‌కు జిల్లా, రాష్ట్రస్థాయిలో ప్రత్యేక గుర్తింపు తీసుకురావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బోధన్ ఏసిపి శ్రీ శ్రీనివాస్ , సీఐలు వెంకటనారాయణ, విజయబాబు, కృష్ణ , ఎస్సై హబీబ్, మజీద్ కమిటీ సభ్యులు మహబూబ్ గుల్ షాని , సయ్యద్ జాకీర్, ముస్లిం సోదరులు పాల్గొన్నారు. సీపీ హాజరుకావడం పట్ల కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

విద్యార్థి కన్నీటి విలువ తెలిసే వరకు పోరాటం ఆగదు

- బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు సతీష్ రెడ్డి

ప్రతిపక్షం బ్యూరో, నిజామాబాద్, మార్చి 04 : జిల్లాలోని ఇందల్వాయి మండలం ఏకలవ్య పాఠశాలలో 9వ తరగతి విద్యార్థి ఉరి వేసుకుని మృతి చెందడం పై బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు పానుగంటి సతీష్ రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. విద్యార్థి ఉరివేసుకొని మృతి చెందడం అత్యంత విషాదకరమన్నారు. ఈ ఘటన జిల్లా ప్రజలను తీవ్రంగా కలచివేసిందన్నారు. ఈ దుర్ఘటనకు పాఠశాల ప్రిన్సిపాల్, కొంతమంది ఉపాధ్యాయుల మానసిక ఒత్తిడి కారణమని తోటి విద్యార్థులు వెల్లడించడం చాలా ఆందోళన కలిగించే అంశమన్నారు. విద్యార్థులకు మార్గదర్శకులుగా ఉండాల్సిన వారు ఒత్తిడి తీసుకురావడం వల్ల ఒక చిన్నారి ప్రాణాలు కోల్పోవడం విద్యా వ్యవస్థపై పెద్ద ప్రశ్నార్థక చిహ్నం వేస్తోందన్నారు. ఇప్పటి వరకు సంబంధిత అధికారులు పూర్తి స్థాయి విచారణ చేపట్టి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోలేదన్నారు. వెంటనే నిష్పక్షపాత విచారణ జరిపి, తప్పు చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం బాధిత కుటుంబానికి తక్షణ ఆర్థిక సహాయం అందించి, కుటుంబ సభ్యులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా బీజేవైఎం ప్రధాన కార్యదర్శి అమంద్ విజయ్ కృష్ణ మాట్లాడుతూ జిల్లాలో విద్యార్థులకు రక్షణ లేకుండా పోతుంది అన్నారు. ఇప్పటికైనా జిల్లా యంత్రంగం స్పందించి విద్యార్థి కుటుంబానికి న్యాయం చేయాలన్నారు. అతని మృతికి కారణమైన ఉపాధ్యాయలపైన చట్టపరమైన చర్యలు తీసుకోవాలి అన్నారు. ఒకవేళ చర్యలు తీసుకోకపోతే జిల్లా వ్యాప్తంగా బీజేవైఎం ఆధ్వర్యంలో ఆందోళనలు, నిరసనలు చేపడతామని హెచ్చరించారు.

శబ్ద కాలుష్యంపై ప్రత్యేక చర్యలు

- ఏఎస్పీ బి. చైతన్య రెడ్డి వెల్లడి

ప్రతిపక్షం ప్రతినిధి, కామారెడ్డి, మార్చి 04: కామారెడ్డి పట్టణంలో ఇటీవలి కాలంలో ద్విచక్ర వాహనాలకు నిబంధనలకు విరుద్ధంగా మాడిఫైడ్ సైలెన్సర్లు అమర్చడం వల్ల అధిక శబ్ద కాలుష్యం ఏర్పడుతోంది. ముఖ్యంగా విద్యార్థులు, వృద్ధులు, గర్భిణీ స్త్రీలు మరియు రోగులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ఆకస్మికంగా వచ్చే అధిక శబ్దం ప్రజలను భయభ్రాంతులకు గురిచేయడమే కాకుండా రోడ్డు ప్రమాదాలకు కూడా దారితీసే ప్రమాదం ఉన్నది. ఈ నేపథ్యంలో ఈరోజు కామారెడ్డి పట్టణంలోని నిజాంసాగర్ చౌరస్తాలో అదనపు ఎస్పీ బి. చైతన్య రెడ్డి ఆధ్వర్యంలో, పట్టణ సీఐ ఎస్.ఎస్. నరహరి సమక్షంలో మాడిఫైడ్ సైలెన్సర్ల ధ్వంస కార్యక్రమం నిర్వహించారు. ప్రత్యేక తనిఖీల్లో స్వాధీనం చేసుకున్న అధిక శబ్దం కలిగించే సైలెన్సర్లను ప్రజల్లో అవగాహన కల్పించే ఉద్దేశంతో రోలర్‌తో తొక్కించి ధ్వంసం చేయడం జరిగింది. ఈ సందర్భంగా అదనపు ఎస్పీ బి. చైతన్య రెడ్డి మాట్లాడుతూ ద్విచక్ర వాహనాలకు చట్టవిరుద్ధంగా మాడిఫైడ్ సైలెన్సర్లు అమర్చడం నేరమని స్పష్టం చేశారు. ఇలాంటి వాహనాలపై భారీ జరిమానాలు విధించడంతో పాటు వాహనాలను సీజ్ చేయడం జరుగుతుందని హెచ్చరించారు. అలాగే హెల్మెట్ లేకుండా వాహనం నడపడం, మద్యం సేవించి వాహనం నడపడం (Drunk & Drive) వంటి నేరాలపై కూడా కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రతి వాహనదారు రోడ్డు భద్రతా నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని కోరారు. పట్టణ ప్రజల ప్రశాంత జీవనానికి భంగం కలిగించే విధంగా శబ్ద కాలుష్యం సృష్టించే వారిని ఏమాత్రం సహించబోమని, అట్టి వాహనాలను వెంటనే సీజ్ చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజల భద్రత, ప్రశాంతత కోసం ఇటువంటి ప్రత్యేక చర్యలు నిరంతరం కొనసాగుతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ సీఐ ఎస్.ఎస్. నరహరి, ట్రాఫిక్ ఎస్ఐ మహేష్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

వ్యాపార సాముదాయాలను పరిశీలించిన సీపీ

ప్రతిపక్షం బ్యూరో, నిజామాబాద్, మార్చి 04 : రాబోయే రంజాన్ పండుగను పురస్కరించుకొని ఏర్పాటు చేసుకోనున్న వ్యాపార సముదాయాలను నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య బుధవారం రాత్రి పరిశీలించారు. నగరంలోని నెహ్రూ పార్క్, శంభుని గుడి, హైమది బజార్, ఖిల్లా రోడ్డు, బోధన్ బస్టాండ్ పరిసర ప్రాంతాలను కాలినడకన కలియ తిరిగి రాబోయే రోజులలో వివిధ వ్యాపారస్తులు నెలకొల్పే షాపులు గురించి వివరాలు సంబంధిత అధికారుల ద్వారా తెలుసుకున్నారు , వ్యాపా రస్తులకు వ్యాపార సమదాయులు నెలకొల్పడానికి స్థలాన్ని ఏ విధంగా కేటాయించాలి, ఏ ప్రదేశంలో కేటాయించాలి, ట్రాఫిక్ జామ్ కాకుండా తీసుకోవలసిన జాగ్రత్తలు , వ్యాపారస్తుల యొక్క వివరాలు సేకరించాలని , ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని కిందిస్థాయి పోలీస్ సిబ్బందిని ఆదేశించారు. సీసీ కెమెరాలు ఉండేవిధంగా , ప్రజలకు తగు సూచనలు ఇచ్చే విధంగా పోలీస్ శాఖ తరపున సౌండ్ సిస్టంను ఏర్పాటు చేయాలని, పార్కింగ్ వివరాలు సంబంధిత ట్రాఫిక్ అధికారాలకు లా అండ్ ఆర్డర్ అధికారులకు తగిన సూచనలు చేయడం చేశారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ ఏసీపీ, నిజామాబాద్ డివిజన్ ఇన్చార్జి మస్తాన్ అలీ, ట్రాఫిక్ సిఐ ప్రసాద్, వన్ టౌన్ ఎస్ హెచ్ ఓ రఘుపతి, టౌన్ సర్కిల్ సి.ఐ శ్రీనివాసరాజ్ , రెండవ టౌన్ ఎస్.హెచ్.ఓ ముజాహిద్ తదితరులు ఉన్నారు.

ప్రగతి ప్రణాళికను పకడ్బందీగా అమలు చేయాలి

- కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్

ప్రతిపక్షం ప్రతినిధి, కామారెడ్డి, మార్చి 4: పాఠశాలలు, వసతి గృహాలపై నిరంతర పర్యవేక్షణ అవసరం 99 రోజుల కార్యాచరణ ప్రణాళికపై జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ బుధవారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి అదనపు ఎస్పీ, డీఎఫ్ఓ, ఏసీ (ఎల్బీ), సబ్ కలెక్టర్, ఏసీ రెవెన్యూ (వీడియో కాన్ఫరెన్స్ ద్వారా), డీపీఓ, డీఆర్‌డీఓ, సీఈఓ జెడ్పీ, డీఎంహెచ్ఓ, డబ్ల్యుఓ, డీఈఓ, ఎస్ఈ ఎన్‌పీడీసీఎల్, ఎంసీ కామారెడ్డి, డీఏఓ, డిహెచ్ఎస్ఓ, పీడీ హౌసింగ్, సీపీఓ, ఈఈ పీఆర్, ఆర్డీఓ, డీవైఎస్ఓ, అదనపు డీఆర్‌డీఓ (సెర్ప్), బాన్సువాడ, బిచ్కుండా, ఎల్లారెడ్డి మున్సిపల్ కమిషనర్లు (వీడియో కాన్ఫరెన్స్ ద్వారా), పీడీ మేప్మా, సూపరింటెండెంట్ జి, ఈడీఎం, హెచ్‌హెచ్‌పి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మార్చి 6 నుంచి జూన్ 12 వరకు "ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక" కింద ఐదు దశల్లో 99 రోజుల యాక్షన్ ప్లాన్‌ను శాఖల వారీగా 10 థీమ్‌లతో సమర్థవంతంగా అమలు చేయాలని ఆదేశించారు. ప్రణాళిక శాఖ ఈ కార్యక్రమానికి నోడల్ శాఖగా వ్యవహరిస్తుందని తెలిపారు.

దశల వారీ కార్యక్రమాలు..

ఏప్రిల్ 2 - గ్రామ స్థాయి గ్రామసభలు
ఏప్రిల్ 16 - మండల స్థాయి కార్యక్రమం
మే 2 - నియోజకవర్గ స్థాయి కార్యక్రమం
మే 22 - జిల్లా స్థాయి కార్యక్రమం
జూన్ 2 - రాష్ట్ర ఆవిర్భావ వేడుకలు.

మార్చి 6న అన్ని ఉమ్మడి జిల్లాల్లో మంత్రుల ఆధ్వర్యంలో సన్నాహక సమావేశాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. 99 రోజుల కాలంలో శాఖల వారీగా ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

కందకుర్తి గోదావరి పుష్కరాల ఘాట్లను సందర్శించిన సీపీ

ప్రతిపక్షం బ్యూరో, నిజామాబాద్, మార్చి 04 : రెంజల్ మండలం కందకుర్తి పుష్కర ఘాట్లను బుధవారం నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య పర్యవేక్షించారు. 2027 సంవత్సరంలో రాబోయే గోదారి పుష్కరాలతో ఉద్దేశించి పుష్కర ఘాట్ల ఏర్పాట్లు, మహిళలు దుస్తులు మార్చుకునే గదులు , పుష్కర ఘాటుకు వచ్చే రోడ్డు మరియు వెళ్లే దారులను , పార్కింగ్ ప్రదేశాల మరియు నీళ్లలో ఎవరు కూడా మునిగి ప్రాణా నష్టం జరగకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాటులను చేయాలని అధికారులకు సూచించారు. గ్రామస్తులతో మాట్లాడి గత పుష్కరాల్లో ఏమేం లోటుపాట్లు ఉన్నాయి అడిగి తెలుసుకున్నారు. పుష్కరాలకు వచ్చే భక్తులకు ఎటువంటి పార్కింగ్ సమస్యలు, ఇతర అవరోధాలు కలగకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని చెప్పారు. సీపీ వెంటబోధన్ ఏసీపీ శ్రీనివాస్, బోధన్ రూరల్ సర్కిల్ సిఐ విజయ్ బాబు, రెంజల్ ఎస్సై కే. చంద్రమోహన్ కందకుర్తి సర్పంచ్ ఉపసర్పంచ్ నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

ఇరాన్ కొత్త సుప్రీం లీడర్‌గా ఎవరిని ఎన్నుకున్నా వారిని చంపేస్తాం. ఇరాన్ పగ్గాలు చేపట్టే ఏ నేత అయినా తమకు 'క్లియర్ టార్గెట్'. ఈ మిషన్‌ను పూర్తి చేయడానికి సిద్ధం కావాలని ఐడీఎఫ్‌ను ఆదేశించాం. ఇజ్రాయెల్‌కు కానీ, అమెరికాకు కానీ ఆ వ్యక్తి వ్యతిరేకంగా ఉన్నా , లేక ఇరానీ ప్రజలను హింసించినా, తాము ఊరుకోబోం.

- ఇజ్రాయెల్ రక్షణ మంత్రి కాట్జ్

ప్రాంతీయం

తాగునీటి సమస్య పరిష్కారానికి యాక్షన్ ప్లాన్

రెండు రోజులపాటు భగీరథ నీరు బంద్

ప్రతిపక్షం ప్రతినిధి, మెదక్, మార్చి 04 :- వచ్చే వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకుని త్రాగునీటి సమస్యల పరిష్కారానికై సమ్మర్ యాక్షన్ ప్లాన్ తయారీకి పటిష్ట చర్యలు తీసుకుంటున్నట్లు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ మిషన్ భగీరథ. గ్రిడ్ మెదక్ నాగభూషణం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.నీటి సరఫరా నిలుపుదలపై 05 మరియు 06 మార్చి తేదీలలో వివిధ ప్రాంతాలకు నీటి సరఫరా నిలిపి వేస్తున్నట్లు. అందులో మెదక్ నియోజకవర్గ పరిధిలోని 275 గ్రామీణ హాబిటేషన్లు, మెదక్. రామాయంపేట మున్సిపాలిటీలు. ఆందోలు నియోజకవర్గంలోని అల్లాదుర్గ్. టేక్మాల్ మండలాల 80 హాబిటేషన్లు.ప్రభావిత హాబిటేషన్ల సర్పంచ్ లకు సంబంధిత మండల గ్రూపుల ద్వారా సమాచారం అందించబడిందని తెలిపారు. సర్పంచులు స్థానిక వనరుల ద్వారా నీటి సమస్యను పునరుద్ధరించే దిశగా చర్యలు తీసుకోవాలని అయన సూచించారు. వేసవి దృష్ట్యా 04.03.2026 మరియు 05.03.2026 తేదీలలో కింది ప్రివెంటివ్ మెయింటెనెన్స్ పనులు చేపట్టడం నిర్ణయించబడిందని తెలిపారు.

90 MLD పెదరెడ్డిపేట WTP - వివిధ నిర్వహణ పనుల నిమిత్తం1000 మి.మీ. దయా పైప్‌లైన్ లీకేజీల మరమ్మత్తు మరియు రాయిపహాడ్ OHBR వద్ద స్లూయిస్ వాల్వ్ మరమ్మత్తు.అన్ని సివిల్ నిర్మాణాలు (OHBRలు మరియు సంపులు) శుభ్రపరచడం. వంటివి చేపడుతున్నట్లు అలాగే యెల్లాపూర్ వద్ద 700 మి.మీ. DI స్లూయిస్ వాల్వ్ మరమ్మత్తుల 06.03.2026 సాయంత్రం 6 గంటల తరువాత పంపింగ్ పునః ప్రారంభించబడుతుందని తెలిపారు.

'మహేంద్ర ట్రాక్టర్స్'లో యువతకు ఉపాది అవకాశాలు

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి , మార్చి 04: తెలంగాణ ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్ ఆధ్వర్యంలో మహేంద్ర ట్రాక్టర్స్ జహీరాబాద్‌లో 800 పైగా ఉద్యోగాలు - ఐటీఐ, డిప్లమా, ఇంటర్ అభ్యర్థులకు భారీ అవకాశం. డిజిటల్ ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్ ఆఫ్ తెలంగాణ ఆధ్వర్యంలో, రాష్ట్ర యువతకు ఉపాధి అవకాశాలను కల్పించేందుకు ప్రముఖ ఆటోమొబైల్ తయారీ సంస్థ మహేంద్రా & మహేంద్రా ట్రాక్టర్స్ , భారీ స్థాయి నియామకాలను చేపట్టింది. జహీరాబాద్‌లోని తయారీ యూనిట్ లో మొత్తం 800 పైగా ఖాళీలను భర్తీ చేయనున్నట్లు సంస్థ ప్రకటించింది. ఈ నియామకాలు ప్రత్యేకంగా ఇంటర్మీడియట్, ఐటీఐ మరియు డిప్లమా అర్హత కలిగిన అభ్యర్థులకు లభించనున్నాయి. ఈ నేపథ్యంలో బుధవారం జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య , జి ఎం డి ఐ సి తుల్జానాయక్ , మహేంద్రా & మహేంద్రా ట్రాక్టర్స్ సంస్థ ప్రతినిధులతో కలిసి రిక్రూట్మెంట్ 2026 పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భముగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వప్రైవేట్ భాగస్వామ్యంతో మరిన్ని ఉద్యోగాలు సృష్టించేందుకు ఈ నియామకాలు కీలకమని కలెక్టర్ పేర్కొన్నారు. జిల్లాలోని యువతకు ఇది ఎంతో మంచి అవకాశం అని , నిరుద్యోగ యువత తప్పక వినియోగించుకోవాలని ఆమె సూచించారు. జహీరాబాద్‌లోని మహేంద్ర ట్రాక్టర్స్ తయారీ యూనిట్ ఇటీవల ఉత్పత్తి విస్తరణలో భాగంగా వివిధ విభాగాల్లో సిబ్బందిని నియమాకాపు ప్రత్యేక డ్రైవ్ చేపట్టింది . ముఖ్యంగా ఐటీఐ ట్రేడ్స్, మెషినింగ్, ఫిట్టర్, ఎలక్ట్రిషియన్, వెల్డర్ వంటి సాంకేతిక విభాగాల్లో అవకాశాలు ఉన్నాయి. అదేవిధంగా డిప్లమా మరియు ఇంటర్మీడియట్ అభ్యర్థులకు క్వాలిటీ, లైన్ సపోర్ట్ వంటి విభాగాల్లో ఉద్యోగాలు లభించనున్నాయి. ఈ సందర్భముగా జి ఎం డి ఐ సి తుల్జానాయక్ మాట్లాడుతూ స్థానిక అభ్యర్థులకు ప్రాధాన్యం ఇవ్వబడుతుందని, అభ్యర్థులు నేరుగా అధికారికంగా అందించిన పోర్టల్ లేదా క్యూఆర్ కోడ్ ద్వారా మాత్రమే నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ నియామకాలు పూర్తిగా పారదర్శకంగా జరుగుతాయని తెలిపారు. క్యూఆర్ కోడ్ ద్వారా సులభంగా రిజిస్ట్రేషన్ పోస్టర్‌లో అందించిన క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి అభ్యర్థులు తమ వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోగలరు. గ్రామీణ ప్రాంతాల అభ్యర్థులకు ఈ ప్రక్రియ సులభమే. అభ్యర్థులు తమ విద్యార్హతలు, వ్యక్తిగత వివరాలను నమోదు చేసిన వెంటనే, వారికి ఇంటర్వ్యూకు సంబంధించిన సమాచారం పంపబడుతుంది. మహేంద్రా & మహేంద్రా ట్రాక్టర్స్ సంస్థ ప్రతినిధులు మాట్లాడుతూ ఉద్యోగాలను కోరుకునే యువతకు ఇది అత్యంత అనుకూల అని అన్నారు . తయారీ పరిశ్రమలో కెరీర్ నిర్మించాలనుకునే వారికి మహేంద్ర ట్రాక్టర్స్ వంటి ప్రముఖ సంస్థలో పనిచేయడం మంచి అవకాశం అని తెలిపారు. కె మహేంద్ర & మహేంద్ర సంస్థ యాస్మిన్ హెచ్ ఆర్ మేనేజర్,పి. వంశీధర్ రెడ్డి అదనపు కార్పొరేట్ రిలేషన్స్ డైరెక్టర్, డీటైల్స్ డీట్ హైదరాబాద్ శివ కృష్ణ వైఎస్కే ఇన్ఫోటెక్, హైదరాబాద్, పాల్గొన్నారు.

సంగారెడ్డి హోలీ సంబరాల్లో జగ్గారెడ్డి

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, మార్చి 04 : సంగారెడ్డిలో టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా హోలీ వేడుకలు నిర్వహించినారు. తన చిన్ననాటి మిత్రులు, కార్యకర్తలు, అభిమానులు, చిన్నారులతో కలిసి హోలీ జరుపుకున్న జగ్గారెడ్డి. సంగారెడ్డి బైపాస్ రోడ్డులో స్నేహితులతో కలిసి జగ్గారెడ్డి స్టెప్పులు లేశారు. చిన్నారులతో కలిసి డీజె టిల్లు పాటకు జగ్గారెడ్డి డాన్స్ చేసి అందరిని అలరించారు. ఈ సందర్భంగా డప్పు కళాకారులతో కలిసి డప్పు కొట్టి స్నేహితులతో కలిసి హోలీ సంభరాలు ఘనంగా నిర్వహించారు. అనంతరం రామ్ మందిర్ కమాన్ వద్ద ఉట్టి కొట్టే కార్యక్రమంలో జగ్గారెడ్డి పాల్గొన్నారు.

పటాన్‌చెరులో ఎమ్మెల్యేమహిపాల్‌రెడ్డి

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, మార్చి 04 : హోలీ పర్వదినం పురస్కరించుకొని పటాన్‌చెరులో నిర్వహించిన హోలీ వేడుకల్లో పటాన్ చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి పాల్గొన్నారు. రంగులు చల్లుకుంటూ శుభాకాంక్షలు తెలియజేశారు. బీరంగూడకు చెందిన కుమవత్ మార్వాడి సమాజం ఆధ్వర్యంలోని బృందం ఎమ్మెల్యే ను కలిసి తమ సాంప్రదాయ పద్ధతిలో హోలీ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ హోలీ పండుగ మనందరి జీవితాలలో ఐక్యత, ప్రేమ, ఆనందం నింపాలని అన్నారు. నియోజకవర్గ ప్రజలందరికీ హోలీ శుభాకాంక్షలు తెలియజేశారు.

ఉత్సాహంగా హోలీ సంబరాలు

ప్రతిపక్షం,సంగారెడ్డి ప్రతినిధి, మార్చి 04 : జిల్లా పోలీసు గ్రౌండ్స్‌లో ఏర్పాటు చేసిన హోలీ కార్యక్రమాల్లో జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ స్వయంగా పాల్గొని అధికారులకు, సిబ్బందికి రంగులు పూసి హోలీ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా జిల్లా ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ, రంగుల హోలీని ప్రశాంత వాతావరణంలో ఆనందోత్సాహాల నడుమ సహజ సిద్ధమైన రంగులతో జరుపుకోవాలని సూచించారు. బలవంతంగా రంగులు పూయడం, మద్యం సేవించి వాహనాలు నడపడం, ర్యాష్ డ్రైవింగ్ చేయడం వంటి చర్యలకు పాల్పడరాదని అన్నారు. అలాగే మద్యం సేవించి చెరువులు, కుంటలు, జలాశయాల వద్దకు వెళ్లరాదని, లోతట్టు ప్రాంతాల్లో ప్రత్యేక జాగ్రత్తలు పాటించాలని సూచించారు. నిత్యం విధి నిర్వహణలో నిమగ్నమై ఉండే పోలీసు సిబ్బందిలో ఉత్సాహం నింపేందుకు ఈ హోలీ వేడుకలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పోలీసు అధికారులు, సిబ్బంది, జిల్లా ప్రజలు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ వాహనాలు నడిపేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించాలని జిల్లా ఎస్పీ సూచించారు. ఈ కార్యక్రమంలో డీసీఆర్బీ ఇన్స్పెక్టర్ రమేష్, టౌన్ ఇన్స్పెక్టర్ రాము నాయుడు, ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ రామకృష్ణ రెడ్డి, ఆర్ఐ లు డానియెల్, రాజశేఖర్, ఆర్మ్డ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నిజామాబాద్ ప్రెస్ క్లబ్‌లో..

ప్రతిపక్షం బ్యూరో, నిజామాబాద్, మార్చి 04 : నిజామాబాద్ ప్రెస్ క్లబ్ కమిటీ ఆధ్వర్యంలోబుధవారం ఘనంగా హోలీ వేడుకలు జరిగాయి. జర్నలిస్టులు, డెస్క్ జర్నలిస్టులు, ఫోటో జర్నలిస్టులు, వీడియో జర్నలిస్టులు, అర్బన్ జర్నలిస్టులు, ఎడిటర్ అసోసియేషన్ జర్నలిస్టులు, జర్నలిస్టు సంఘాల నాయకులు పాల్గొని ఒకరినొకరు రంగులు చల్లుకుంటూ హోలీని ఉత్సాహంగా జరుపుకున్నారు. పాటలకు డ్యాన్స్ చేస్తూ హోలీ పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ సందర్భంగా నిజామాబాద్ ప్రెస్ క్లబ్ ప్రధాన కార్యదర్శి వాగ్మారే సుభాష్ మాట్లాడుతూ నిజామాబాద్ ప్రెస్ క్లబ్ లో ప్రతి సంవత్సరం కుల మతాలకతీతంగా అన్ని పండగలను ఘనంగా నిర్వహిస్తామని అందులో భాగంగానే ఈ సంవత్సరం హోలీ పండుగను ప్రెస్ క్లబ్ లో అందరం కలిసి ఘనంగా నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ కోశాధికారి రాజ్ కుమార్, ఆర్గనైజింగ్ సెక్రటరీ బి. రాజు, ప్రెస్ క్లబ్ కమిటీ సభ్యులు, సీనియర్ జర్నలిస్టులు, ప్రెస్ క్లబ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

హోలీ సంబరాల్లో పాల్గొన్న అర్బన్ ఎమ్మెల్యే

ప్రతిపక్షం బ్యూరో, నిజామాబాద్, మార్చి 04 : ఇందూరు నగరంలో హోలీ పండుగ సందర్భంగా నిర్వహించిన వివిధ సంబరాల్లో అర్బన్ ఎమ్మెల్యే పాల్గొన్నారు. ప్రజలతో కలిసి ఉత్సాహంగా వేడుకలు జరుపుకున్నారు. భారతీయ జనతా పార్టీ జిల్లా పార్టీ కార్యాలయంలో జరిగిన హోలీ సంబరాల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ "హోలీ పండుగ మన భారతీయ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక. ఈ పండుగ ద్వేషాలను దూరం చేసి ప్రేమ, సఖ్యత, సౌభ్రాతృత్వాన్ని పెంపొందిస్తుందన్నారు. రంగుల్లా మన జీవితాలు కూడా ఆనందంతో, ఐక్యతతో నిండిపోవాలి" అని అన్నారు. అనంతరం 34వ డివిజన్‌లోని కుమార్ గల్లీలో మున్సిపల్ కార్మికులతో కలిసి హోలీ సంబరాల్లో పాల్గొన్నారు. నగర పరిశుభ్రత కోసం కష్టపడుతున్న మున్సిపల్ కార్మికులు నిజమైన సేవాధారులని, వారి కృషి వల్లనే నగరం పరిశుభ్రంగా ఉంటుందని, వారి సంక్షేమం కోసం తాను ఎల్లప్పుడూ కృషి చేస్తానని అన్నారు. అనంతరం పట్టణ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో పాల్గొన్నారు. "పండుగలు సమాజంలోని అన్ని వర్గాలను ఒకే వేదికపైకి తీసుకువచ్చి పరస్పర బంధాలను బలపరుస్తాయనీ, సమాజ అభివృద్ధికి ప్రతి వర్గం సహకారం అవసరం" అని పేర్కొన్నారు.బీఈ కార్యక్రమాల్లో స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్పొరేటర్లు, కార్యకర్తలు, సంఘ సభ్యులు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

మెరుగైన సేవలు అందించండి

పక్షం ప్రతినిధి హనుమకొండ మార్చి 4 : ప్రజా ప్రభుత్వంలో విద్యుత్ సంస్థ ప్రధాన భూమిక వహిస్తుందని వినియోగదారులకు మెరుగైన సేవలు అందించడంలో లైన్మెన్ పాత్ర ప్రముఖమైనదని ఎన్పీడీసీఎల్ సిఎండి కర్నాటి వరుణ్ రెడ్డి సిబ్బందిని కోరారు బుధవారం రోజు చింతగట్టు సబ్ డివిజన్ కార్యాలయంలో జరిగిన లైన్మెన్ దివస్ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు ఈ సమావేశానికి ఏ డి ఈ అశోక్ అధ్యక్షత వహించారు చింతగట్టు టౌన్ చింత గట్టు రూరల్ హాసన్ పర్తి మూడు సెక్షన్లో సంబంధించిన విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు ఈ కార్యక్రమంలో సిఎండి కర్నాటి వరుణ్ రెడ్డి మాట్లాడుతూ పేదవారికి ఎంతో ఉపయోగపడుతుందని 24 గంటలు కరెంటు వినియోగదారులకు ఎంతో మేలు చేస్తుందని ఆయన అన్నారు ఈ కార్యక్రమంలో సిబ్బందిని ఎండి కర్నాటి వరుణ్ రెడ్డి సన్మానించారు ఇంకా ఈ కార్యక్రమంలో హాసన్ పర్తి ఏ ఈ శిరీష్ కుమార్ సత్య నారాయణ తరుణ్ లైన్మెన్లు ఆర్టిజన్లో మరియు సిబ్బంది పాల్గొన్నారు.

కొమ్మాల జాతర ప్రభ బండ్లను ప్రారంభించిన ఎమ్మెల్యే రేవూరి

ప్రతిపక్షం ప్రతినిధి, హనుమకొండ, మార్చి 4 : కొమ్మాల శ్రీ లక్ష్మీనరసింహస్వామి జాతర సందర్భంగా కొమ్మాల క్రాస్ (విశ్వనాథ పురం) వద్ద కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రభ బండ్లను వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అయూబ్ గారితో కలిసి పరకాల శాసనసభ్యులు శ్రీ రేవూరి ప్రకాశ్ రెడ్డి కొబ్బరికాయ కొట్టి,ప్రారంభించారు. అంతకుముందు హనుమకొండ భవాని నగర్ లోని క్యాంపు కార్యాలయం నుండి కొమ్మల వరకు భారీ కార్,బైక్ ర్యాలీ నిర్వహించారు.పరకాల నియోజకవర్గ ప్రజలు సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని అలాగే,ప్రజల శ్రేయస్సు, ప్రాంత అభివృద్ధి, శాంతి సమృద్ధులు కలగాలని దేవుడిని ఆకాంక్షించారు. ప్రభ బండి కార్యక్రమంలో పాల్గొన్న నిర్వాహకులకు ప్రత్యేక అభినందనలు తెలిపారు.

సిద్ధిపేటలో హోలీ వేడుకలు

ప్రతిపక్షం, సిద్దిపేట టౌన్, మార్చ్ 04 : సిద్దిపేట పట్టణంలో హోలీ పండుగను ఘనంగా నిర్వహించారు. 26 వార్డులో జరిగిన హోలీ వేడుకలు కౌన్సిలర్ కెమ్మసారం ప్రవీణ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకలకు మున్సిపల్ చైర్మన్ మంజుల రాజనర్సు ముఖ్య అతిథిగా హాజరై ప్రజలకు హోలీ శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం రంగులు చల్లుకుంటూ స్థానికులతో కలిసి ఆనందోత్సాహాల మధ్య పండుగను జరుపుకున్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు సద్ది నాగరాజు రెడ్డి, రెడ్డి విజేందర్ రెడ్డి, నాయకులు కెమ్మసారం దుర్గయ్య, కెమ్మసారం అశోక్, పోచయ్య, శీను పాల్గొన్నారు.

'చదువుకో తెలంగాణ' కరపత్రం ఆవిష్కరణ

ప్రతిపక్షం, గుండాల, మార్చి 4 : గుండాల మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'చదువుకో తెలంగాణ' కార్యక్రమానికి సంబంధించిన పదో తరగతి ప్రత్యేక కరపత్రాన్ని బుధవారం మండల విద్యాశాఖ అధికారి కె. పార్వతమ్మ ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పదో తరగతి విద్యార్థుల కోసం శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ సంస్థ రూ.2.2 కోట్ల విలువైన ప్రతిభా పురస్కారాలను ప్రకటించిందని తెలిపారు. విద్యార్థుల్లో పోటీ భావన పెంపొందించి, మెరుగైన ఫలితాలు సాధించేందుకు 'చదువుకో తెలంగాణ' ప్రచార కార్యక్రమాన్ని చేపట్టిన శ్రీరామ్ లైఫ్ ఇన్స్యూరెన్స్ కంపెనీ కి వారు అభినందనలు తెలిపారు.ఈ కార్యక్రమంలో శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ ఖమ్మం బ్రాంచ్ యూనిట్ మ్యానేజర్ మలిపెద్ది చిరంజీవి,తవిడిశెట్టి రాంబాబు, మలిపెద్ది పవన్,పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు,గ్రామస్తులు పాల్గొన్నారు.



సీఎం చంద్రబాబు తిరుమలను స్వార్థ రాజకీయాలకు వేదికగా మార్చారు. 'టీటీడీ చైర్మన్‌పై ఓ మహిళ ఫిర్యాదు చేస్తే చంద్రబాబు చర్యలు తీసుకోలేదు. అతడినే పదవిలో కొనసాగించి ఆలయ ప్రతిష్ఠను కాలరాశారు. లడ్డూ ప్రసాదం విషయంలో తప్పు చేసి దాన్ని వేరొకరికి మీదికి నెట్టారు. నెయ్యి సరఫరాను ఇందాపూర్ డెయిరీకి కట్టబెట్టి స్కామ్‌లు చేస్తూ సొంత ఆదాయ మార్గంగా మార్చుకున్నారు.

- వైసీపీ అధినేత జగన్

విశ్వ వీక్షణం

ఇండియాకు రష్యా చమురు సాయం

- భారీగా చమురు, లిక్విడ్ గ్యాస్ సరఫరా

ప్రతిపక్షం నేషనల్ డెస్క్: ఇరాన్‌ఇజ్రాయెల్ యుద్ధం నేపథ్యంలో చమురు రవాణాపై నీలిమేఘాలు కమ్ముకున్న సంగతి తెలిసిందే. దీంతో ఇండియా సహా అనేక దేశాలకు చమురు సరఫరా ఆగిపోయే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో ఇండియాకు తగినంత చమురు సరఫరా చేసేందుకు రష్యా సిద్ధమైంది. ప్రస్తుతం ఇరాన్ యుద్ధం వల్ల హోర్ముజ్ జలసంధిలో రవాణా నిలిచిపోయింది. ముఖ్యంగా చమురు రవాణా ఆగిపోయింది. చమురు నౌకలు కదిలే పరిస్తితి లేదు. ఇండియాకు 40 శాతం చమురు ఈ హోర్ముజ్ జలసంధి ద్వారానే వస్తుంది. అలాంటిది ఈ సంధి మార్గంలో చమురు రవాణా ఆగిపోతే ఇండియా తీవ్ర చమురు సంక్షోభాన్ని ఎదుర్కొంటుంది. ఎందుకంటే ఇండియా దగ్గర 25 రోజులకు సరిపడా మాత్రమే ఆయిల్ నిల్వలు ఉన్నాయని సమాచారం. ఆ తర్వాత చమురు వాడుకోవాలంటే కొత్తగా ఆయిల్ రావాల్సిందే. అందుకే మన దేశంలో ఆయిల్ సంక్షోభం తలెత్తకుండా రష్యా ముందుకొచ్చింది. ఇండియాకు రష్యా 9.6 మిలియన్ల బ్యారెళ్ల క్రూడాయిల్‌ను అందించనుంది. ఈ మేరకు రష్యా చమురు నౌకలు ఇండియాకు బయల్దేరినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం భారత సముద్ర జలాల్లోనే ఈ నౌకలుండగా, మరికొద్ది రోజుల్లోనే ఈ నౌకలు ఇండియాకు చేరుకోనున్నాయి. అయితే, రష్యా నౌక ఎక్కడ ఉందనే సమాచారం మాత్రం తెలియదు. రష్యా గతంలో మనకు తక్కువ ధరకే చమురు అందించేది. కానీ, ప్రస్తుతం మార్కెట్ ధరకే చమురు అందించేందుకు సిద్ధమైంది.

ఇరాన్ యుద్ధ నౌకపై అమెరికా సబ్ మెరైన్ దాడి

- 80 మంది మృతి.. ఇండియా నుంచి తిరిగి వెళ్తుండగా దాడి

ప్రతిపక్షం నేషనల్ డెస్క్: ఇరాన్‌కు చెందిన యుద్ధ నౌకపై శ్రీలంక తీరంలో అమెరికా సబ్‌మెరైన్ బుధవారం ఉదయం దాడి చేసింది. ఈ ఘటనలో ఇప్పటివరకు 80 మందికిపైగా మరణించినట్లు సమాచారం. గల్లంతైన మిగతావారి కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. ఈ ఘటనలో 32 మంది వరకు శ్రీలంక నేవీ రక్షించింది. దీనికి సంబంధించి పూర్తి సమాచారం తెలియాల్సి ఉంది. ఇరాన్‌కు చెందిన యుద్ధనౌక ఐఆర్ఐఎస్ దేనా ఇండియా నుంచి తిరిగి వెళ్తుండగా ఈ దాడి జరిగింది. కొన్ని వారాల క్రితం ఈ యుద్ధ నౌక ఇరాన్ నుంచి ఇండియా చేరుకుంది. ఇండియాకు చెందిన హిందూ మహా సముద్రంలో జరిగిన ఇండోపసిఫిక్ నావికా విన్యాసాల్లో ఈ నౌక పాల్గొంది. ఈ నౌక ఇండియా రావడం ఇది రెండోసారి. మొదటిసారి 2024లో నావికా విన్యాసాల్లో పాల్గొని తిరిగి వెళ్లింది. ఇప్పుడు 2026 ఫిబ్రవరిలో నావికా విన్యాసాల కోసం వచ్చింది. అనంతరం తిరిగి వెళ్తుండగా అమెరికా సబ్ మెరైన్ దాడి చేసింది. ఈ నౌకను తామే ముంచేశామని అమెరికా ప్రకటించుకుంది. ఈ ఘటన జరిగిన సమయంలో నౌకలో దాదాపు 180 మంది ఉన్నట్లు తెలుస్తోంది. అందులో 32 మందిని శ్రీలంక నేవీ రక్షించింది. మిగతా 148 మంది గల్లంతయ్యారు. వారి కోసం గాలింపు కొనసాగుతోంది. ఇప్పటివరకు 80 మందికిపైగా మృతదేహాల్నిగుర్తించారు.

మార్చిలోనే మండుతున్న ఎండలు

తెలుగు రాష్ట్రాల్లో మార్చి నెల ఆరంభంలోనే ఎండలు మండుతున్నాయి. ఈ సంవత్సరం ఫిబ్రవరి మాసంలోనే మొదలైన ఎండలు మార్చి మొదటి వారంలోనే ఎండాకాలం మండుతోంది. నెల ముందే ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. ఈసారి వేసవి మరింత ఉద్ధృతంగా విజృంభించనుందనే హెచ్చరికలూ మొదలయ్యాయి. ఎండ వేడి, వడగాలులు మనిషిని నిజంగానే 'పీల్చి' పిప్పిచేస్తాయి. చెమట రూపంలో ఒంట్లోంచి నీటిని, లవణాలను లాగేసుకుంటాయి. ఫలితంగా నిస్సత్తువ, అలసట ఆవహించేసి శరీరం చతికిల పడుతుంది. అయినా మేలుకోకపోతే వడదెబ్బకు దారితీస్తుంది. శరీర ఉష్ణోగ్రత అంతకంతకూ పెరిగి అవయవాలు చేతులెత్తేసే ప్రమాదముంది... మధ్యానం ... 11 దాటిన తర్వాత బయటకు వెళ్లాలంటే ప్రజలు ఇప్పడే భయపడుతున్న పరిస్థితులు ఉన్నాయి.

డా. కౌశల్ గోవర్ధన
ఏం.బి.బి.ఎస్, (ఎం.డి, ఇంటర్నల్ మెడిసిన్)
వైస్ చైర్మన్, శ్రీ రామానుజ సేవా ట్రస్ట్
ధనుంజయ నర్సింగ్ హోమ్, హైదరాబాద్
7702417779

గడిచిన రెండు రోజులుగా ఉష్ణోగ్రతలు అసాధారణంగా పెరుగుతుండటంతో అప్పుడే వేసవి తాపం మొదలైంది. రోజువారీ పనుల కోసం బయటకు వెళ్లిన సమయంలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలి, వడ దెబ్బ బారిన పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి... వాతావరణ శాఖ చెబుతున్న వివరాల ప్రకారం ఈ సంవత్సరం ఎండలు ఎక్కువగానే ఉంటాయని తెలుస్తోంది...

జాగ్రత్త పడాల్సిన విషయం కిడ్నీల సమస్య

శరీరం ఎండ వేడిని తట్టుకోవటానికి, తీవ్ర సమస్యలు తలెత్తకుండా చూసుకోవటానికి రకరకాలుగా ప్రయత్నిస్తుంది. చెమట పట్టటం దీనిలోని భాగమే. చెమట గాలికి ఆవిరవుతూ శరీరాన్ని చల్లబరుస్తుంది. ఇది మంచిదే. లేకపోతే శరీర ఉష్ణోగ్రత అంతకంతకూ పెరిగిపోయి ప్రాణాల మీదికి వస్తుంది. అయితే చర్మానికి రక్త సరఫరా పెరిగే క్రమంలో కిడ్నీలకు రక్త ప్రసరణ తగ్గుతుంది. సుమారు 30% వరకు రక్తం తక్కువగా అందుతుంది. దీంతో కిడ్నీలకు అవసరమైన ఆక్సిజన్, పోషకాలూ తగ్గుతాయి. చెమట మూలంగా ఒంట్లో నీటిశాతం తగ్గటం ఎక్కువసేపు కొనసాగితే ఆకస్మికంగా కిడ్నీలు దెబ్బతినే ప్రమాదముంది (అక్యూట్ కిడ్నీ ఇంజ్యూరీ). ఇందులో మూత్రం ఉత్పత్తి తగ్గటం, వికారం, వాంతి, కళ్లు తిరగటం,వాంతి, కళ్లు తిరగటం, నీరసం, నిస్సత్తువ వంటి లక్షణాలు కనిపిస్తుంటాయి. సమస్య మరీ ఎక్కువైతే తికమక పడిపోతుంటారు కూడా. ఎండ వేడి, నీటి శాతం తగ్గటం వల్ల కిడ్నీల్లో రాళ్లు ఏర్పడే ప్రమాదమూ ఉంది. తగినంత నీరు తాగకపోతే మూత్ర నాళ ఇన్ఫెక్షన్లూ తలెత్తొచ్చు. అందువల్ల ఎండాకాలంలో కిడ్నీల ఆరోగ్యం మీద ప్రత్యేక దృష్టి సారించాలి.

మన శరీర బరువులో సుమారు 50-60% వరకు ఉండేది ద్రవాలే. అవయవాలు సక్రమంగా పనిచేయటానికివి అత్యవసరం. ద్రవాలతో పాటు ఖనిజ లవణాలు సమస్థితిలో ఉండటానికి తోడ్పడేవి. కిడ్నీలే. ద్రవాల మోతాదులు ఏమాత్రం అస్తవ్యస్తమైనా వీటి మీద విపరీత ప్రభావం పడుతుంది. చెమట రూపంలో ఒంట్లోంచి నీరు బాగా పోయినప్పుడు డీహైడ్రేషన్ (నీటిశాతం తగ్గటం) తలెత్తుతుంది. దీంతో రక్తంలోని ద్రవభాగమూ (ప్లాస్మా) తగ్గుతుంది. రక్త ప్రసరణ వ్యవస్థలో ద్రవాల మోతాదు 15% కన్నా ఎక్కువగా పడిపోవటాన్ని హైపోవలీమియా అంటారు. ఇది చాలా ప్రమాదకర పరిస్థితి. కిడ్నీలకు చేరుకునే రక్తం పరిమాణం తగ్గుతుంది. రక్తపోటు పడిపోతుంది. దీంతో మరో ప్రమాదం రక్తం శుద్ధి అయ్యే ప్రక్రియ మందగించటం. ఫలితంగా వ్యర్థాల నిర్మూలనా కుంటుపడుతుంది.

- వడదెబ్బ తగిలినప్పుడు శరీర ఉష్ణోగ్రత నియంత్రణ వ్యవస్థ దెబ్బతింటుంది. దీంతో జ్వరం అంతకంతకూ తీవ్రమవుతుంది. ఇది మరీ ఎక్కువై కండరాలు క్షీణిస్తుంటాయి (రాబ్డోమయోలైసిస్).కండరాలు క్షీణించటంతో పుట్టుకొచ్చే మయోగ్లోబిన్ అనే ప్రొటీన్ రక్తంలోకి విడుదలవుతుంది. ఇది కిడ్నీలకు విఘాతంగా మారుతుంది. డీహైడ్రేషన్తో రక్తంలో పొటాషియం మోతాదులు తగ్గటమూ నేరుగా కిడ్నీల మీద విపరీత ప్రభావం చూపుతుంది. యూరిక్ ఆమ్లం మోతాదులు పెరగటమూ కిడ్నీలను దెబ్బతీయొచ్చు.
- ఎండాకాలంలో నీరు కలుషితమయ్యే అవకాశం ఎక్కువ. అపరిశుభ్ర నీటితో నీళ్ల విరేచనాలు, వాంతులు పట్టుకోవచ్చు. వీటితోనూ నీటి శాతం తగ్గుతుంది. ఇదీ కిడ్నీలు దెబ్బతినటానికి కారణం కావచ్చు. అంతేకాదు.. బోరు బావుల వంటి వాటితో నేలలో చాలా లోతుల నుంచి తోడే నీటిలోని రసాయనాలూ కిడ్నీల మీద విపరీత ప్రభావం చూపొచ్చు.
- కిడ్నీజబ్బు గలవారు మూత్రం ఎంత వస్తుందో చూసుకోవాలి. కాళ్ల వాపుల వంటివి ఉన్నాయేమో చూసుకోవాలి. వీటిని బట్టి ఎంత నీరు తాగాలనేది నిర్ణయించుకోవాలి. మూత్రం తక్కువ వస్తున్నా, కాళ్ల వాపులున్నా, ఆయాసం వస్తున్నా నీరు తగ్గించుకోవాలి. ఎండలో ఉన్నప్పుడు చెమట పడుతుందో లేదో గమనించుకోవాలి. రోజు మొత్తంలో మూత్రం ఎంత వస్తుందో ఒకసారి కొలుచుకొని, దాని కన్నా అరలీటరు ఎక్కువ నీరు తాగాల్సి ఉంటుంది. ఎంత నీరు తాగాలనేది మీ వైద్యుని అడిగి తెలుసుకోవాలి.
- నీటిశాతం తగ్గితే రక్తంలో పొటాషియం తగ్గుతుంది. ఇది తిరిగి అందకపోతే కండరాలు విచ్ఛిన్నమై, కిడ్నీలు దెబ్బతినే ప్రమాదముంది. ఇలాంటి పరిస్థితుల్లో కొబ్బరి నీళ్లు మేలు చేస్తాయి. అయితే కిడ్నీజబ్బు గలవారు దీని విషయంలో జాగ్రత్తగా ఉండాలి. వీరిలో పొటాషియంను బయటకు పంపించే సామర్థ్యం తగ్గుతుంది. అందువల్ల ఎక్కువగా తీసుకోకూడదు. కొబ్బరి నీళ్లు, పుచ్చకాయ, అరటిపండు వంటి వాటిల్లో పొటాషియం ఎక్కువగా ఉంటుంది. ఇవి వీరికి సమస్యలు తెచ్చిపెట్టొచ్చు. ఇలాంటి పదార్థాలు, పానీయాలను వైద్యుని సలహా మేరకే తీసుకోవాలి.

ఎండాకాలం.. పిల్లలు జాగ్రత్త..

- **వేసవి కాలంలో పెద్దలే కాదు, పిల్లలూ బాధితులుగా మారతారు. ఏప్రిల్, మే నెలల్లో వేసవి సెలవుల కారణంగా ఇంటిపట్టునే ఉండే పిల్లలు ఎండలో ఆడటం మొదలుపెడతారు. దీనివల్ల వారు కూడా ఎండదెబ్బకు గురయ్యే అవకాశం ఉంటుంది.**
- **పిల్లలు ఆటల్లో పడితే వారికి ఆకలి, దాహం గుర్తుండవు. అందుకే తల్లిదండ్రులు పిల్లల విషయంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలి.**
- **పిల్లల్లో డీహైడ్రేషన్ నివారించడానికి కొన్ని ముఖ్య జాగ్రత్తలు..**
- **పిల్లలు రోజంతా నీరు తాగేలా తల్లిదండ్రులు కనిపెట్టుకుని ఉండాలి. ఆడుకోవడానికి బయటకు వెళ్ళే పిల్లలకు వాటర్ బాటిల్ ఇచ్చి పంపాలి. ఎండగా ఉన్నప్పుడు ఆడుకోవడానికి వారిని బయటకు పంపకపోవడమే మంచిది...**
- **ఆహారంలో పండ్ల రసాలు, ఆకుకూరలు, కీరదోస, నారింజ, స్ట్రాబెర్రీలు ఉండేలా చూడాలి.**
- **పిల్లలను ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు ఎండలో ఆడకుండా చూడాలి.**
- **పిల్లలు కాస్త వదులుగా ఉండే, లైట్ కలర్ దుస్తులు ధరించేలా చూడాలి.**
- **పిల్లలు నీరసపడితే వారికి వెంటనే ఓఆర్ఎస్ (ఓరల్ రీహైడ్రేషన్ సాల్ట్) ఇవ్వాలి.**
- **పిల్లల శరీరంలో నీరు తగ్గకుండా చూసుకోవడం ముఖ్యం..**

నీరు తక్కువైతే ఏమవుతుంది?

- శరీరంలో నీరు తగ్గిపోయిన విషయాన్ని గుర్తించడమెలా అని చాలామందికి సందేహం వస్తుంది.
- నిస్సత్తువ, అలసటగా అనిపిస్తే నీటిశాతం తగ్గిందనే అర్థం. దీనికి మరో సూచన మూత్రం ముదురు రంగులో రావటం. పరిస్థితి ఇంతవరకూ రాకుండా చూసుకోవటమే మంచిది.
- నీరు తగ్గిందనడానికి మొదటి సూచిక.. మూత్రం పసుపు రంగులో రావడం, కొద్దిగా మాత్రమే విసర్జన అవడం, ఒక్కోసారి మూత్రం ఎరుపు రంగులోకి మారడం అనేవి డీహైడ్రేషన్‌కు సంకేతాలు.
- "ఎండలో ఎక్కువసేపు నడవడం, లేదంటే ఏదైనా వేడి వాతావరణంలో పనిచేయడం అనేది శరీరంలో నీటిశాతాన్ని మాత్రమే కాకుండా, ఇతర లవణాలు అంటే సోడియం, పొటాషియం, క్లోరైడ్, బైకార్బోనేట్ శాతాన్ని తగ్గిస్తుంది. ఈ పరిస్థితి దీర్ఘకాలం ఉంటే శరీరంలోని మెగ్నీషియం, కాల్షియం నిల్వలు కూడా తగ్గిపోతాయి''.

డీహైడ్రేషన్ రావడానికి కారణాలు ?

- ఎండలో ఎక్కువసేపు ఉంటే వడదెబ్బ తగిలి డీహైడ్రేషన్ వస్తుంది.
- ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉన్న సమయంలోనూ రావచ్చు.
- డయేరియా, ఇతర అనారోగ్య కారణాల వల్ల డీహైడ్రేషన్ రావచ్చు.
- అతిగా మద్యం సేవించడం, కెఫిన్ ఉండే ద్రవాలు తీసుకోవడం వల్ల శరీరంలో నీరు తగ్గిపోతుంది.
- చెమట ఎక్కువగా పట్టినప్పుడు, ఎక్కువగా కసరత్తులు చేశాక డీహైడ్రేషన్ వచ్చే అవకాశం ఉంది.
- మూత్రవిసర్జన కోసం ఇచ్చే మందుల వల్ల కూడా డీహైడ్రేషన్ రావచ్చు..
- చాలా మంది అనుకుంటుంటారు నేను చాలా నీరు తాగుతున్నాను అని "నీరు మాత్రమే తాగితే సరిపోదు"
- "వేసవిలో డీహైడ్రేషన్ బారిన పడకూడదనుకుంటే కేవలం మంచినీరు తాగితే సరిపోదు. ఆ నీటికి ఇతర ద్రవాల సాయం కూడా అవసరం''
- "వేసవిలో తరచూ మంచినీరు తాగాలి. కానీ అది శరీర దాహాన్ని తీర్చలేదు. శరీరంలో డీహైడ్రేషన్ స్థితిని నివారించడానికి పండ్ల రసాలు, మజ్జిగ, చెరకు రసాలు తాగాలి. కొబ్బరి నీరు కూడా శరీరానికి మంచిది.
- "వేసవిలో శరీరంలో నీరు తగిన మోతాదులో ఉండేలా చూసుకోవడం చాలా అవసరం. సహజంగా మన శరీరం 70 శాతం నీటితోనే నిండి ఉంటుంది''.
- అయితే శరీరానికి నీరు అవసరం కదా అని ఒకేసారి పెద్ద ఎత్తున మంచినీరు తాగడం సరికాదు . దాహం వేసినప్పుడు నీరు తాగాలి అనే విషయాన్ని గుర్తుంచుకోవాలి.
- "ప్రస్తుతం ఎక్కడ చూసినా ఏసీల వాడకం పెరిగింది. ఆఫీసులు, ఇళ్ళు, హోటళ్ళు ఎక్కడ చూసినా ఏసీలు ఉన్నాయి. దీనివల్ల దాహం వేయడం తగ్గిపోయి, అవసరానికన్నా తక్కువ నీరు తాగుతున్నాం. ఇలాంటి తప్పులను నివారించాల్సి ఉంది''.
- ఇక దాహం వేసినప్పుడు ఒకేసారి రెండు మూడు గ్లాసుల నీటిని తాగకూడదు. మంచినీరు మెల్లిగా తాగడం ఉత్తమం. ఒకేసారి ఎక్కువ నీరు తాగితే, కడుపు నిండిపోయి మీ ఆకలిపై ప్రభావం చూపుతుంది.

డీహైడ్రేషన్ లక్షణాలేంటి?

- దాహం ఎక్కువగా ఉండటం..
- వాసనతో కూడిన ముదురు పసుపురంగులో మూత్రం రావడం..
- సాధారణం కంటే తక్కువగా మూత్రవిసర్జన చేయడం..
- కళ్ళు తిరిగినట్టు అనిపించడం..
- అలసటగా ఉండటం..
- పెదవులు, నాలుక పిడచకట్టుకుపోవడం..
- కళ్ళు పీక్కుపోవడం లాంటి లక్షణాలు కనిపిస్తే, డీహైడ్రేషన్ ఉన్నట్టే... అటువంటి సమయంలో నీళ్లు తాగడంతో పాటు శరీరానికి అవసరమైన ఇతర మినరల్స్ తీసుకోవాలి. అలాగే మీ వ్యక్తి గత వైద్యుడి సంప్రదించాలి.

ఎండా కాలంలో ఆహారం ఏమి తీసుకోవాలి...

- వేసవిలో నూనె పదార్థాలకు దూరంగా ఉండాలి. అన్నం తిన్నాకే బయటకు వెళ్లండి. లేదంటే మీతోపాటు బాక్స్ తీసుకెళ్ళండి...
- విటమిన్ సీ కోసం పులుపు ఉండే పండ్లను తినండి. మీ ఆహారంలో పుచ్చకాయ, కమలా, బత్తాయి, ద్రాక్ష, మామిడి, దానిమ్మ లాంటి పండ్లు ఉండేలా చూసుకోండి.
- ఉసిరి, కోకుమ్ పండ్లలో కూడా విటమిన్ సీ, సోడియం, పొటాషియం, మెగ్నీషియం ఉంటాయి.

భారతీయులకు ఆశ్రయం నిరాకరణ నిజం కాదు

- ప్రటకించిన ఇజ్రాయెల్

ప్రతిపక్షం నేషనల్ డెస్క్: ఇరాన్ దాడులనుంచి రక్షణ పొందేందుకు భారతీయులకు ఇజ్రాయెల్ ఆశ్రయం నిరాకరించిందన్న వార్తల్లో నిజం లేదని ఆ దేశం ప్రకటించింది. ఇజ్రాయెల్‌పై ఇరాన్ క్షిపణి దాడులు చేస్తున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో బాంబుల ప్రభావం నుంచి తప్పించుకునేందుకు ఇజ్రాయెల్ ప్రజలు ప్రత్యేక బంకర్లు, షెల్టర్లలో తలదాచుకుంటున్నారు. అయితే, భారతీయులకు అక్కడి బంకర్లు, షెల్టర్లలో ప్రవేశం కల్పించడం లేదని ప్రచారం ఊపందుకుంది. సోషల్ మీడియాలో దీనిపై విస్తృత ప్రచారం జరుగుతోంది. దీనికి సంబంధించి కొన్ని ఫొటోలు కూడా వైరల్ అవుతున్నాయి. మెట్రో స్టేషన్లు, ఇతర పబ్లిక్ ప్లేసులలో భారతీయులు బహిరంగంగా పడుకుని ఉన్న ఫొటోలు వైరల్‌గా మారాయి. వారికి బంకర్లలో ఆశ్రయం కల్పించకపోవడంతోనే ఇలాంటి ప్రదేశాల్లో ఉంటున్నారని ప్రచార జరిగింది. దీనిపై ఇండియాలోని ఇజ్రాయెల్ రాయబార కార్యాలయ ప్రతినిధి గుయ్ నిర్ స్పందించారు. ఈ ప్రచారంలో నిజం లేదన్నారు. సోషల్ మీడియాలో ప్రచారమవుతున్న ఫొటోల్లో భారతీయులు మాత్రమే లేరని, వివిధ వర్గాలు, దేశాలకు చెందిన ప్రతినిధులు ఉన్నారని ఆయన తెలిపారు. ఇక అక్కడ ప్రజలు తలదాచుకున్న మెట్రో స్టేషన్లు ప్రత్యేకంగా యుద్ధ సమయంలో రక్షణ కోసమే రూపొందించినవని అన్నారు.

రాజ్యసభకు నితీశ్ కుమార్

- సీఎం పదవికి రాజీనామా!

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, మార్చి 4: బిహార్ రాజకీయాల్లో ఆసక్తికర చర్చ నడుస్తోంది. సీఎం పదవికి నీతీశ్ కుమార్ రాజీనామా చేసి, రాజ్యసభకు వెళ్తారని జోరుగా ప్రచారం జరుగుతోంది. నీతీశ్ కుమారుడు నిశాంత్ కుమార్ రాజకీయాల్లోకి వస్తున్న నేపథ్యంలో ఈ ప్రచారం జరగడం సర్వత్రా ఆసక్తి నెలకొంది. ఒక వేళ నీతీశ్ సీఎం పోస్టుకు రాజీనామా చేస్తే ఆయన కుమారుడు నిశాంత్ కుమార్ ఉప ముఖ్యమంత్రి అవుతారని వార్తలు వినిపిస్తున్నాయి. అలాగే బీజేపీకి చెందిన నేత బిహార్‌కు సీఎం అవుతారని ఊహాగానాలు వినిపిస్తున్నాయి. బిహార్‌లో 5 రాజ్యసభ స్థానాలు ఖాళీ అయ్యాయి. అందులో ఎన్డీఏ మిత్రపక్షమైన జేడీయూ రెండు స్థానాల్లో తమ అభ్యర్థులను బరిలోకి దింపొచ్చు. మిగతా మూడు చోట్ల బీజేపీ, ఇతర మిత్రపక్షాలకు కేటాయించారు.

కానీ, ఇప్పటివరకు తమ పార్టీ తరఫున రాజ్యసభ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులను జేడీయూ ఖరారు ప్రకటించలేదు. ఒక సీటులో కేంద్ర మంత్రి రామ్‌నాథ్ ఠాకూర్‌కు మళ్లీ రాజ్యసభకు పంపిస్తారని పార్టీ నేతలు చెబుతున్నారు. రెండో స్థానంపైనే ఇప్పుడు సర్వత్రా ఉత్కంఠ నెలకొంది.

గెలిచే ఆ ఒక్క రాజ్యసభ సీటుకు శరద్ పవార్ పోటీ

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, ముంబై, మార్చి 4: మహారాష్ట్రలో ప్రతిపక్షం గెలిచే ఏకైక రాజ్యసభ సీటులో నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ చీఫ్ శరద్ పవార్ పోటీ చేస్తున్నారు. మహా వికాస్ అఘాడి కూటమి అభ్యర్థిగా ఆయనను ఎంపిక చేసింది. సీనియర్ రాజకీయ నాయకుడైన శరద్ పవార్ రాజ్యసభ ఎన్నికల్లో మహారాష్ట్ర ప్రతిపక్ష అభ్యర్థిగా పోటీ చేస్తారని ఆయన కుమార్తె, ఎంపీ సుప్రియా సులే తెలిపారు. రాహుల్ గాంధీ, మల్లికార్జున్ ఖర్గేతో పాటు ఉద్ధవ్ ఠాక్రేతో చర్చలు జరిపినట్లు ఆమె చెప్పారు. కాగా, తన తండ్రి శరద్ పవార్‌కు మద్దతుఇచ్చిన కాంగ్రెస్, శివసేన (యూబీటీ) పార్టీలకు సుప్రియా సులే కృతజ్ఞతలు తెలిపారు. 'జయంత్ పాటిల్, నేను కలిసి ఉద్ధవ్ ఠాక్రేను కలిసి చర్చించాం. శరద్ పవార్‌కు మద్దతు ఇచ్చినందుకు కాంగ్రెస్, శివసేన (యూటీబీ)లకు ఎన్సీపీ (ఎస్పీ) కృతజ్ఞతలు తెలుపుతోంది' అని మీడియాతో ఆమె అన్నారు. మరోవైపు కాంగ్రెస్ నేత హర్షవర్ధన్ సప్కల్ కూడా ఈ విషయాన్ని ధృవీకరించారు. శరద్ పవార్‌కు మద్దతు ఇవ్వాలని కాంగ్రెస్ నిర్ణయించిందని చెప్పారు. మార్చి 16న రాజ్యసభ ఎన్నికలు జరుగనున్నాయి.





ఐసీసీ ర్యాంకింగ్స్‌లో సంజూ శాంసన్ దూకుడు

25 స్థానాలు ఎగబాకిన స్టార్ బ్యాట్స్‌మన్

ఒక్కటంటే ఒక్క ఇన్నింగ్స్ చాలు.. క్రికెటర్ల జీవితమే మారిపోతుంది. జట్టును గెలిపించే చిరస్మరణీయ ఆటతో చరిత్రకెక్కిన ఆటగాళ్లు చాలామందే. ఇప్పుడు వారి జాబితాలో సంజూ శాంసన్ కూడా చేరిపోయాడు. టీ20 ప్రపంచకప్‌లో క్వార్టర్ ఫైనల్‌లాంటి మ్యాచ్‌లో వెస్టిండీస్‌పై శివాలెత్తిపోయిన శాంసన్ భారత జట్టుకు సెమీఫైనల్ బెర్తును కట్టబెట్టాడు. టీమిండియాను సెమీస్ చేర్చిన ఈ డాషింగ్ వ్యక్తిగతంగానూ మైలురాయి సాధించాడు. మొన్నటివరకూ ఎక్కడో 60ల్లో ఉన్న అతడు.. ఏకంగా 25 స్థానాలు ఎగబాకాడు. ఈడెన్ గార్డెన్స్‌లో వెస్టిండీస్‌పై చిరస్మరణీయ అర్ధ శతకంతో భారత్‌ను గెలిపించిన సంజూ శాంసన్ ఐసీసీ టీ20 బ్యాటర్ల ర్యాంకిగ్స్‌లో ముందంజ వేశాడు. ఏకంగా.. 25 స్థానాలు మెరుగుపరచుకొని ప్రస్తుతం 40వ ర్యాంకులో కొనసాగుతున్నాడు. విండీస్‌పై 97 నాటౌట్.. ఆ ఒక్క ఇన్నింగ్స్ అతడిని టాప్40లోకి తీసుకొచ్చింది. అయితే.. నంబర్ 1 బ్యాటర్‌గా వరల్డ్‌కప్‌లో చెలరేగి ఆడాల్సిన అభిషేక్ శర్మ ఫామ్ లేమితో పెద్ద ముప్పును ఎదుర్కొంటున్నాడు. పాకిస్థాన్ ఓపెనర్ షహిబ్జద ఫర్హాన్ అభికి ర్యాంక్‌కు పోటీగా మారాడు. పొట్టి కప్‌లో రెండు శతకాలతో పాక్ విజయాల్లో భాగమైన ఈ ఓపెనర్.. 848 పాయింట్లతో రెండో స్థానంలో కొనసాగుతున్నాడు. అభిషేక్‌కు అతడికి 26 పాయింట్లే తేడా. ఇంగ్లండ్ హిట్టర్ ఫిల్ సాల్ట్ మూడో ర్యాంకులో ఉన్నాడు.

ఇండియా - ఇంగ్లండ్

సెమీ ఫైనల్ నేడే

అమీ తుమీకి సిద్ధమవుతున్న రెండు జట్లు

టీ20 ప్రపంచకప్‌లో డిఫెండింగ్ చాంపియన్ భారత్ కీలక పోరుకు సిద్ధమైంది. సొంతగడ్డపై తమ విజయయాత్రను కొనసాగిస్తున్న సూర్యకుమార్‌యాదవ్ నేతృత్వంలోని టీమ్‌ఇండియా..ఇంగ్లండ్‌తో గురువారం సెమీఫైనల్లో అమీతుమీ తేల్చుకోనుంది. ముచ్చటగా మూడోసారి పొట్టి ప్రపంచకప్ టైటిల్‌ను ముద్దాడాలన్న పట్టుదలతో ఉన్న ఇరు జట్లు సర్వశక్తులు ఒడ్డేందుకు సమాయత్తమయ్యాయి. మెగాటోర్నీలో దక్షిణాఫ్రికా చేతిలో ఓటమి మినహాయిస్తే భారత్ నిలకడ కనబరుస్తున్నది. సొంత ఇలాఖాలో బాగా అలవాటైన పిచ్‌లపై ప్రత్యర్థులపై పైచేయి సాధిస్తూ ఒక్కో అడుగు ముందుకేస్తున్నది. కోల్‌కతా ఈడెన్‌గార్డెన్స్ వేదికగా వెస్టిండీస్‌తో జరిగిన ఆఖరి సూపర్ 8 పోరులో టీమ్‌ఇండియా సత్తాచాటింది. పడుతూలేస్తూ సాగుతున్న తన కెరీర్‌లో చిరస్మరణీయ ఇన్నింగ్స్‌తో సంజూ శాంసన్..విండీస్ ఆశలపై నీళ్లు గుమ్మరించి భారత విజయానికి బాటలు వేశాడు. సహచరులు విఫలమైన వేళ తన ఉనికిని చాటుకుంటూ శాంసన్ సాధికారిక ఇన్నింగ్స్ అభిమానుల మదిలో అచిరకాలం గుర్తుండిపోవడం ఖాయంగా కనిపిస్తున్నది. ఇంగ్లండ్‌తో సెమీస్‌లోనూ సమష్టి ప్రదర్శనతో సత్తాచాటేందుకు సూర్యకుమార్ సేన తహతహలాడుతున్నది. అచ్చొచ్చిన వాంఖడే స్టేడియంలో ఇంగ్లండ్ భరతం పట్టేందుకు పక్కా ప్రణాళికతో సిద్ధమైంది. శాంసన్ రాకతో టాపార్డర్‌లో గాడిలో పడగా, ఫామ్‌లేమితో ఇబ్బంది పడుతున్న యువ ఓపెనర్ అభిషేక్‌శర్మ బ్యాటు ఝుళిపించాల్సిన సమయం ఆసన్నమైంది. జింబాబ్వేతో మ్యాచ్‌లో అర్ధసెంచరీ మినహా అభిషేక్ నుంచి ఆశించిన ప్రదర్శన లేకపోవడం టీమ్ మేనేజ్‌మెంట్‌ను ఆందోళనకు గురి చేస్తున్నది. ఫస్ట్‌డౌన్‌లో బ్యాటింగ్‌కు వస్తున్న ఇషాన్ కిషన్ ఆదిలో మెరుపులు మెరిపించినా ఆ స్థాయి ప్రదర్శన కనబర్చలేకపోతున్నాడు. మిడిలార్డర్‌లో కెప్టెన్ సూర్యకుమార్‌తో పాటు తిలక్‌వర్మ, హార్దిక్ పాండ్యా, శివమ్ దూబే తమ సత్తాచాటాల్సి ఉంది. ఈ ముగ్గురిలో ఏ ఇద్దరు కుదురుకున్నా..భారత్‌కు భారీ స్కోరు సాధ్యమైనట్లే. విండీస్‌తో ఆడిన జట్టునే ఇంగ్లండ్‌తో పోరులో కొనసాగించే అవకాశముంది.

ఫైనల్‌లో న్యూజీలాండ్

సెమీస్ లో సౌతాఫ్రికాపై విజయం

ఐసీసీ టోర్నీల నాకౌట్ దశలో తడబడుతూ అంతర్జాతీయ క్రికెట్ లో 'చోకర్స్' ముద్ర వేసుకున్న దక్షిణాఫ్రికా మరోసారి అదే బాటలో నడిచింది. టీ20 ప్రపంచకప్‌లో గ్రూప్, సూపర్ 8 దశలోఅదరగొట్టి అజేయంగా సెమీస్ చేరిన ఆ జట్టు.. కీలక పోరులో న్యూజిలాండ్ చేతిలో ఓడింది. ఒడిదొడుకుల నడుమే సెమీస్‌కు వచ్చిన కివీస్.. ఆల్‌రౌండ్ షోతో అదరగొట్టి రెండోసారి ఈ టోర్నీ ఫైనల్‌కు అర్హత సాధించింది. ఇరుజట్ల మధ్య కోల్‌కతాలో జరిగిన తొలి సెమీస్‌లో కివీస్.. 9 వికెట్ల తేడాతో సఫారీలపై ఘనవిజయం నమోదుచేసింది. ముందు బంతితో మార్క్మ సేనను 169/8 కే పరిమితం చేసిన ఆ జట్టు.. ఛేదనను 12.5 ఓవర్లలోనే దంచేసింది. టోర్నీలో అంచనాలను అందుకోలేక విమర్శలు ఎదుర్కొన్న 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్' ఫిన్ అలెన్ (33 బంతుల్లో 100 నాటౌట్, 10 ఫోర్లు, 8 సిక్సలు) అసలైన సమయానికి జూలు విదిల్చి పొట్టి ప్రపంచకప్ చరిత్రలోనే అత్యంత వేగవంతమైన శతకం బాది మ్యాచ్‌ను పూర్తి ఏకపక్షంగా మార్చేశాడు. అలెన్‌తో పాటు టిమ్ సీఫర్ట్ (33 బంతుల్లో 58. 7 ఫోర్లు, 2 సిక్సలు) మెరుపులు మెరిపించాడు. అంతకుముందు కివీస్ స్పిన్నర్లు కట్టడిచేయగా.. మార్కో యాన్సెన్ (30 బంతుల్లో 55, 2 ఫోర్లు, 5 సిక్సలు), డెవాల్డ్ బ్రెవిస్ (27 బంతుల్లో 34, 3 ఫోర్లు, 2 సిక్సలు) సౌతాఫ్రికాకు గౌరవప్రదమైన స్కోరునందించారు.

పాకిస్తాన్ జట్టులో భారీ ప్రక్షాళన

టీ20 ప్రపంచకప్‌లో దారుణంగా విఫలమైన పాకిస్థాన్ స్టార్ బ్యాటర్ బాబర్ ఆజమ్‌పై వేటు పడింది. ఈ నెల 11 నుంచి బంగ్లాదేశ్‌తో జరుగబోయే మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్ కోసం పాకిస్థాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) తాజాగా ఎంపికచేసిన 15 మంది జట్టు సభ్యులలో అతడికి చోటు దక్కలేదు. పశ్చిమాసియాలో యుద్ధ మేఘాలతో ఈ సిరీస్‌పై అనిశ్చితి కొనసాగుతున్న వేళ.. పీసీబీ తాజాగా జట్టును ప్రకటించడం గమనార్హం. సూపర్ 8 దశలోనే నిష్క్రమించి ఇంటా బయటా తీవ్ర విమర్శలెదుర్కొంటున్న ఆ జట్టులో పీసీబీ భారీ ప్రక్షాళన చేసింది. ఏకంగా ఆరుగురు అన్‌క్యాప్డ్ ఆటగాళ్లకు జట్టులో చోటు కల్పించింది. షహీన్ షా అఫ్రిది సారథ్యం వహించనున్నాడు. టీ20 ప్రపంచకప్‌లో చోటు కోల్పోయిన పేసర్ హారీస్ రౌఫ్‌తో పాటు బ్యాటర్ హుస్సేన్ తలాత్ వచ్చే జట్టులోకి వచ్చారు. ఈనెల 11, 13, 15 తేదీల్లో ఢాకా వేదికగా మూడు వన్డేలు జరుగుతాయి.

శ్రీలీల దూకుడు

టాలీవుడ్‌లో తక్కువ సమయంలోనే స్టార్ హీరోయిన్‌గా గుర్తింపు తెచ్చుకున్న శ్రీలీల ఇప్పుడు తన కెరీర్‌ను ఎంతో జాగ్రత్తగా ప్లాన్ చేసుకుంటూ ముందుకు సాగుతోంది. గ్లామర్, డ్యాన్స్, ఎనర్జీతో ప్రేక్షకులను ఆకట్టుకున్న ఈ యంగ్ బ్యూటీ, కేవలం ఐటమ్ సాంగ్స్‌కే పరిమితం అయితే కెరీర్‌పై ప్రభావం ఉంటుందని ముందుగానే అంచనా వేసి జాగ్రత్త పడినట్లు ఇండస్ట్రీ వర్గాల్లో చర్చ జరుగుతోంది.కొన్ని ప్రాజెక్టుల్లో హీరోయిన్ అవకాశంతో పాటు ఐటమ్ సాంగ్ చేయాలని కండీషన్స్ పెట్టినప్పుడు, ఆ ఆఫర్లను సైతం వదులుకోవడంలో ఆమె వెనుకాడలేదని సమాచారం. స్క్రిప్ట్, పాత్ర ప్రాముఖ్యత, భవిష్యత్తు దృష్టిలో పెట్టుకుని నిర్ణయాలు తీసుకుంటోందని, ప్రతి ప్రాజెక్ట్ ముందు కుటుంబ సలహాలు కూడా తీసుకుంటోందని టాక్.

దేవీశ్రీ స్థానంలో థమన్

పవర్ స్టార్ పవన్ కళ్యాణ్, దర్శకుడు హరీష్ శంకర్ కలయికలో రూపొందుతున్న 'ఉస్తాద్ భగత్ సింగ్' చిత్రం గురించి ఒక ఆసక్తికరమైన వార్త టాలీవుడ్‌లో హాట్ టాపిక్‌గా మారింది. ఈ సినిమాకు సంగీత దర్శకుడిగా దేవి శ్రీ ప్రసాద్ బాధ్యతలు నిర్వహిస్తుండగా, తాజా సమాచారం ప్రకారం బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ కోసం మ్యూజిక్ సెన్సేషన్ థమన్‌ను రంగంలోకి దించినట్లు జోరుగా ప్రచారం జరుగుతోంది. దీంతో కేవలం పాటలకు మాత్రమే దేవి శ్రీ ప్రసాద్ సంగీతం పరిమితం కానుందని, సినిమాలోని మాస్ ఎలివేషన్లు మరియు కీలక సన్నివేశాలకు అవసరమైన రీరికార్డింగ్ బాధ్యతలను థమన్‌కు అప్పగించాలని మేకర్స్ భావిస్తున్నట్లు తెలుస్తోంది. గతంలో పవన్ కళ్యాణ్ నటించిన 'వకీల్ సాబ్', 'భీమ్లా నాయక్' వంటి చిత్రాలకు థమన్ తన నేపథ్య సంగీతంతో థియేటర్లను హోరెత్తించిన నేపథ్యంలో, 'ఉస్తాద్' కోసం కూడా హరీష్ శంకర్ అదే మ్యాజిక్‌ను ఆశిస్తున్నట్లు సమాచారం.

పెద్ది లాంటి భారీ సినిమాలో పాటే రాసే అవకాశం అదృష్టం

అనంత శ్రీరామ్

మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ మ్యాసీవ్ మాస్ ఎక్స్‌ట్రావగాంజా 'పెద్ది' సెకండ్ సింగిల్ 'రై రై రా రా' పాట దేశవ్యాప్తంగా సంచలనంగా మారింది. రికార్డింగ్ బ్రేకింగ్ వ్యూస్ తో టాప్ వన్ లో ట్రెండ్ అవుతోంది. రామ్ చరణ్ గ్రేస్, చరిష్మా, ఎలక్ట్రిఫైయింగ్ డ్యాన్స్ మూమెంట్స్ అందరినీ అలరిస్తున్నాయి. దర్శకుడు బుచ్చిబాబు సానా అద్భుతమైన పిక్చరైజేషన్, ఏఆర్ రెహ్మాన్ మ్యూజిక్, అనంత శ్రీరామ్ లిరిక్స్, జానీ మాస్టర్ కొరియోగ్రఫీ అన్నీ కలసి ఈ సాంగ్ వైరల్ హిట్‌గా అదరగొట్టింది. వృద్ధి సినిమాస్ బ్యానర్ పై వెంకట సతీష్ కిలారు ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న ఈ చిత్రం ఏప్రిల్ 30న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్ రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా విలేకరుల సమావేశంలో పెద్ది రై రై రా రా పాట విశేషాలు పంచుకున్నారు లిరిక్ రైటర్ అనంత శ్రీరామ్.

పెద్ది 'రై రై రా రా' పాటకు అద్భుతమైన రెస్పాన్స్ రావడం ఎలా అనిపించింది?

రామ్ చరణ్ గారి రుద్రతాండవం, ఏఆర్ రెహమాన్ గారి ధీర శంఖారావం, రత్నవేలు గారి చిత్రీకరణలో ఉన్న మాయాజాలం, వీటన్నిటి మధ్యలో నుంచి కూడా పాటలో లిరిక్స్ బాగున్నాయి, ఫలానా లైన్ విను, ఫలానా లైన్ బాగుంది అని అన్ని చోట్ల సాహిత్యానికి ప్రశంసలు రావడం చాలా ఆనందాన్ని ఇచ్చింది. ఈ పాట ఆ అదృష్టాన్ని చేసుకుందనిపించింది. నిజానికి ఇది ఒక ప్రేమ పాట కాదు, ఐటెం సాంగ్ కాదు అయినప్పటికీ కూడా లైన్స్ గురించి మాట్లాడుతున్నారు.. దీనికి కారణం ఈ పాట సాహిత్యం ఇలా రావాలన్న దర్శకుడి సంకల్పం. బుచ్చిబాబు గారు సాహిత్యానికి చాలా ప్రాముఖ్యత ఇస్తారు. ఈ పాటలో ఎలాంటి సాహిత్యం ఉండాలి అనే దానిపై బుచ్చిబాబు గారు నేను చాలా సమయం కేటాయించాం. చాలా రాత్రులు రింగ్ రోడ్డు మీద అలా డ్రైవ్ చేస్తూ, కాఫీ షాపుల్లో కూర్చుని చాలా చర్చించాం. అలా నెలలు తరబడి మదనపడితే వచ్చిన పాట ఇది. ఈ తరానికి ముందు తరానికి కూడా గొప్ప సందేశాన్ని అందిస్తూనే మాస్ ని అలరించేలా ఈ పాటని రూపొందించడం జరిగింది. ఈ పాట రాయడానికి చాలా వెర్షన్స్ అనుకున్నాం. ఫైనల్‌గా ఒక మంచి ప్రబోధాత్మక పాట గానే ఉండాలి అని నిర్ణయించాం. కాకపోతే ఇందులోనే వాడే భాష జనానికి దూరంగా ఉండకూడదు. వ్యవహారికంగా ఉండాలి. చెప్పే విషయం చాలా లోతుగా ఉండాలి అని బుచ్చిబాబు గారు చెప్పారు. ఇందులో హీరోకి కెప్టెన్ లక్షణాలు ఉండాలి. తన జట్టు ఆటగాళ్లని రై రారా అని పిలిచేలాగా వుండాలి. బుచ్చిబాబు గారు చెప్పిన ఈ మాటలు ఆయన దగ్గర నుంచే తీసుకుని పాటని ప్రారంభించడం జరిగింది. సాహిత్యం ఒక్కటే కాదు జానీ మాస్టర్ కొరియోగ్రఫీ, రత్నవేలు గారికి విజువల్స్, రామ్ చరణ్ గారు చూపించిన చరిష్మా గ్రేష్, రెహమాన్ గారి సంగీతం, గొంతు అన్నీ కూడా నువ్వు నువ్వా నేనా అన్నట్టుగా పోటీ పడడం వల్ల ఈ ఘనత సాధ్యమైంది. ఈ పాట క్రెడిట్ అందరికీ ఇవ్వాలి. అలా కాదు ఒక్కరికే ఇవ్వాలి అంటే మా అందరినీ నడిపించిన డైరెక్టర్ బుచ్చిబాబు గారికి ఇవ్వాలి, ఆయనకి స్వేచ్ఛనిచ్చిన రామ్ చరణ్ గారికి ఇవ్వాలి.

ఈ పాట విన్న తర్వాత చరణ్ గారి రియాక్షన్ ఏంటి?

సాంగ్ విషయంలో పూర్తి స్వేచ్ఛ ఇచ్చారు. షూటింగ్ లోకేషన్ లో ఈ పాటను చరణ్ గారికి వినిపించాను. పాట విని నన్ను హత్తుకున్నారు.

ఈ సాంగ్ మీకు ఛాలెంజింగ్ గా అనిపించిందా?

ఒక మంచి పాట రాయడం అలాగే మాస్ పాట రాయడం రెండూ కష్టం కాదు. మాస్ పరిభాషలో ఫిలాసఫీ చెప్పడం అనేది కత్తి మీద సాములా అనిపించింది. అందులోనూ రెహమాన్ గారి బాణీ మామూలుగా ఉండదు. ప్రతి లైన్ ప్రయోగాత్మకంగా ఉంటుంది. అర్థం చేసుకోవడానికి చాలా సమయం తీసుకున్నాను. ఈ పాట రాయడానికి చాలా కసరత్తు జరిగింది. దాదాపు రెండు నెలల వరకు సమయం తీసుకున్నా. పరాయి భాషల ప్రభావం లేని అచ్చ తెలుగు పాటిది.

ఈ పాట మీకు ఎలాంటి తృప్తిని ఇచ్చింది?

నా పాట విని ఆత్మహత్యను విరమించుకునే సందర్భము రావాలి. అలాంటి పాట రాస్తే నా రచన సార్థకమైనట్లే అని చెప్తుంటాను. ఆ లక్షణం ఈ పాటకి కనిపిస్తోంది.

ఇందులో మీరు రాసిన పాటలు ఇంకా ఉన్నాయా?

మూడు పాటలు రాబోతున్నా యి. బాలాజీ రాసిన చికిరి, ఈపాట ఎంత వైవిధ్యంగా వున్నాయో.. మిగతా పాటలు కూడా దేనికవే ప్రత్యేకంగా వుంటాయి.

ఇండస్ట్రీలో దాదాపు 20 ఏళ్లు పూర్తి చేసుకున్నారు.. ఈ జర్నీ ఎలా అనిపిస్తుంది?

20 ఏళ్ల ప్రస్థానంలో నేను తెలుసుకున్నది ఏమిటంటే ..అవకాశం రావడం కష్టం, అవకాశం వచ్చిన తర్వాత మొదటి విజయం రావడం కష్టం, విజయాల్ని కొనసాగించడం ఇంకా కష్టం. ప్రతి సంవత్సరం ఒక చార్ట్ బస్టర్ హిట్ వస్తుందంటే.. అది తల్లి తండ్రులు వేసిన పునాది. ఎప్పటికప్పుడు నన్ను నేను కొత్తగా మార్చుకోవాలి అనే తపన. ఈ నిలకడే నేను సాధించిన విజయంగా భావిస్తున్నాను. షేర్స్, లైక్స్, వ్యూస్.. ఇలా విజయానికి కొలమానాలు ట్రెండ్ ని బట్టి మారుతుంటాయి.. కానీ నిలకడ మాత్రం మనం కొనసాగిస్తూ ఉండాలి.

సంక్రాంతికి వస్తున్నాం సినిమాలో మీ క్యారెక్టర్ కి మంచి పేరు వచ్చింది కదా.. నటన కొనసాగిస్తారా?

నటన నేను కోరుకున్నది కాదు, అలాగని దానిపై నాకు విరక్తి కూడా లేదు. నేను పాటలు రాస్తున్నప్పుడు నేను ఇచ్చే ఎక్స్ప్రెషన్స్ డైరెక్టర్స్ కి నచ్చి అలా ఓ క్యారెక్టర్ కి నేను సరిపోతానంటే వాళ్లు చెప్తుంటారు. నేను కూడా సరదాగా చేస్తుంటాను. అంతేగాని ప్రత్యేకంగా నటనపై నాకు దృష్టిలేదు. వచ్చినప్పుడు మాత్రం చేస్తాను.

మెగా ఫ్యామిలీతో మీ అసోసియేషన్ గురించి?

పాటల రచయితగా తొలిసారి నా పేరు చూసుకున్న తొలి చిత్రం చిరంజీవి గారి అందరివాడు. ఒకే హీరోతో ప్రయాణం అనేది గొప్ప అదృష్టం. రెండో తరం హీరోతో కూడా అంత మంచి పాట రావడం అనేది ఇంకా అదృష్టం. మరో అద్భుతమైన అదృష్టమేమిటంటే.. ఒకే సంవత్సరంలో చిరంజీవి గారి సినిమా, అలాగే చిరంజీవి గారి అబ్బాయి రామ్ చరణ్ గారి సినిమా.. ఇలా రెండు పెద్ద హిట్స్ రావడం అనేది గొప్ప అదృష్టం.

'మెన్షన్ హౌస్ మల్లేష్' చాలా నిజాయితీగా తీసిన సినిమా

హీరో శ్రీనాథ్ మాగంటి

శ్రీనాథ్ మాగంటి హీరోగా బాల సతీష్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'మెన్షన్ హౌస్ మల్లేష్'. గాయత్రి రమణ, సాయి కామాక్షి భాస్కర్ల హీరోయిన్స్. కనకమేడల ప్రొడక్షన్స్ బ్యానర్ పై రాజేష్ నిర్మిస్తున్నారు. ఇప్పటికే విడుదలలై టీజర్, ట్రైలర్‌కి మంచి రెస్పాన్స్ వచ్చింది. ఈ చిత్రం మార్చి 6న గ్రాండ్ గా రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా మేకర్స్ ప్రీరిలీజ్ ప్రెస్ మీట్ నిర్వహించారు. ప్రెస్ మీట్ లో హీరో శ్రీనాథ్ మాగంటి మాట్లాడుతూ.. అందరికీ హ్యాపీ. ఈ సినిమాకి ఫస్ట్ హీరో మా ప్రొడ్యూసర్. ఆయనకు ఎన్ని ఇబ్బందులు ఉన్నా సరే ఎక్కడ రాజీ పడకుండా ఈ సినిమాని నిర్మించారు. అద్భుతమైన క్వాలిటీతో బయటికి తీసుకొచ్చారు. సెకండ్ హీరో మా డైరెక్టర్. నన్ను బలంగా నమ్మి ఈ క్యారెక్టర్‌కి నేనైతే బాగుంటుందని హీరోగా పెట్టారు. మా నిర్మాత డైరెక్టర్ గారి నమ్మకాన్ని నిలబెట్టానని భావిస్తున్నాను. డీవోపీ అమ్మముత్తు, సురేష్ బొబ్బిలి గారి మ్యూజిక్ సినిమాకి మరింత బలాన్ని ఇస్తాయి. ఈ సినిమా చూస్తున్నప్పుడు మీరు ఒక ఊర్లో ఉన్న ఫీలింగ్ లోనే ఉంటారు. నేను హీరో అవుదామన్న ప్రతిసారి నీ మార్కెట్ ఏంటి అనే ప్రశ్న వస్తుంది. నిజానికి మీరు ఆదరిస్తేనే ఒక మార్కెట్ వస్తుంది. మంచి కథల్ని ఎన్నుకోవాలి, మంచి టెక్నీషియన్స్‌తో పనిచేయాలి. ఈ సినిమాకి అదే చేశాను. ఈ సినిమాలో కామాక్షి గారు అద్భుతమైన పెర్ఫార్మెన్స్ ఇచ్చారు. గాయత్రి కూడా చాలా చక్కని నటన కనబరిచారు. అలాగే ఈ సినిమాకి పనిచేసిన ప్రతి ఒక్కరికి పేరు పేరునా ధన్యవాదాలు. ఈ సినిమా కోసం 100% ఎఫర్ట్ పెట్టాను. ఈ సినిమా నాకంటే నా టీం కోసం గెలవాలి. ఈ సినిమా గెలిస్తే ప్రతి ఒక్కరు గెలుస్తారు. చిన్న అడుగు వేసుకుంటూ ముందుకు వస్తున్నాం. మిమ్మల్ని ఎంటర్టైన్ చేయడం కోసమే మా జీవితాలు అంకితం. నిజాయితీతోనే ఈ సినిమా మీ ముందుకు తీసుకొస్తున్నాం. మార్చి 6న సినిమా థియేటర్లో రిలీజ్ అవుతుంది. అందరూ సినిమా చూసి నచ్చితే సపోర్ట్ చేయాలని కోరుకుంటున్నాను. అందరం థియేటర్స్ లో కలుద్దాం అన్నారు.

Printed, Published and Owned by MOHAMMED AZIZ UR RAHAMAN, Printed at KRK PRINTERS, H.No. 2-3-703/7, Thirumalanagar Colony, Amberpet, Hyderabad, Telangana - 500013.
Published at h.no. 8-1-284/OU/521/7/9, OU Colony, Tolichowki, Golconda, Hyderabad, Telangana - 500008. Editor: FAZUL RAHAMAN MOHAMMED. 040-4390 2732, email: editor@prathipaksham.in, RNI No. APTEL/2007/19200